ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 467
వెల : రూ.20/-
మార్చి 2024



అగ్గిలాగ మండరండి..

సంకెళ్ళను తెంచరండి....

జనసాహితి ప్రచురణ

# వేళ్ళడగడానికి వచ్చినట్టే వచ్చి..

*- సాంబమూర్తి లండ*

వాళ్ళు చెప్పేవన్నీ చెవొగ్గి వింటావు
అక్షరమక్షరం తరచి చూసుకుంటావు
ఛాతీ మీద బోర్లావేసుకుని
ప్రతిమాటనూ చేతులతో తడుముకుంటావు
ఐనా అనుమానం తీరదు
ఎవరు వీళ్లంతా?

కొందరు ఎప్పట్నుంచో
ఈ దారిలో నడుస్తున్నవాళ్లు
కొందరు అప్పుడెప్పుడో నీతో పాదాలను పంచుకున్నవాళ్లు
మరికొందరు నీడల్లా నీ పక్కనే నడిచినవాళ్లు
పనిగట్టుకుని నిన్నుద్ధరించడానికే పుట్టామనంటే
చప్పున నమ్మేయొద్దు

మునివేళ్ళ మీద నక్షత్రాలను నిలబెట్టిన
నీలిసముద్రానికే పుట్టినట్టు
ఆధారాలను నీ ముందు ఉంచబోతారు
దేశం పాపాయిగా ఉన్నప్పటి కలల్ని
అరచేతుల్లో మళ్లీ చూపించబోతారు
ఎవరు వీళ్లంతా, ఎక్కడి పగటి వేషగాళ్లు?

వాళ్ళంతా బురిడీమాస్టర్లు
పెదవుల మీద మెరిసే మెత్తటి నవ్వులే పెట్టుబడి
ఎప్పుడొచ్చినా నెత్తిమీద టోపీవేసే పోతారు

నీలిమందు తొట్టెలోంచి లేచొచ్చిన బూడిదరంగు నక్కలు
గుప్పెడు సిద్ధాంత పరిమళమన్నాలేని
కేవలం కాగితం పువ్వులు
మన్ కీ కహానీ లో నీతులు కుప్పపోసే
మోడ్రన్ ప్రవచనకారులు
తల్లక్రిందుకుగా కుర్చీ పట్టుకు వేలాడే ముసలి గబ్బిలాలు
గోడ మీద దర్జాగా కులికే పిల్లులు
బతుకులకు సున్నంవేయడంలో నిపుణులు

వేళ్ళడగడానికి వచ్చినట్టే వచ్చి
తలలు నరుక్కుపోతారు
తతిమా అవయవాల మాటేమో గానీ
మిగిలిన ఒక్క చూపుడువేలును
మెదడుకొమ్మల మధ్య జాగ్రత్త పరచండి

తలలు తాకట్టుపెట్టే ముందు
జీవితాంతం
ఒట్టి మొండేలుగా బతకాల్సి వుంటుందని మర్చిపోవద్దు
కాళ్ళ కింద మిగిలిన పిడికెడు నేలనూ
పిల్లలకు లేకుండా చేయొద్దు

కవితలు

# దుమ్ములో ఆడుతున్న ఆడపిల్ల

*- జసింతా కర్కెట్టా*

బురదలో, దుమ్ములో పిల్లలతో ఆడుకుంటున్న
ఆమెను లాక్కువచ్చేశారు
వాళ్ళతోపాటు ఎందుకు ఆడుకోకూడదని
అడిగిందామె, వారిని....
పప్పు, బియ్యం, వంటిల్లు ఆటలు
నీవు ఆడుతున్నది మగపిల్లలతో
నీవేమో ఆడదానివి! అని జవాబు

తన కిడ్డీ బ్యాంకు నుంచి
డబ్బంతా తీసి
అరగంటసేపు నడచి, సంతకెళ్ళి
ఆడుకోడానికి తెచ్చిన
చిన్న చిన్న మట్టికుండలు, పెనాలు, కప్పులు, పళ్ళాలు
అన్నీ ఒక మూలకు విసిరేశారు-
అసలు పళ్ళాలూ, గ్లాసులూ, కుండలూ
కడగటం ప్రారంభించింది, ఇప్పుడు -
అందరూ పొగడ్తలు గుప్పించారు
ఎంత మంచి అమ్మాయో! అంటూ
అందరికీ కావాలి
అంట్లగిన్నెలన్నీ మెరిసేట్లు
రాత్రీ పగలూ అనకుండా
శుభ్రం చేసేవారూ,
అన్నం వండి, ఇల్లంతా వూడ్చేవారూ!
తనతో ఒకప్పుడు కలసి ఆడిన అబ్బాయిలను
కిటికీ తెరల నుంచి చూసింది
అందరూ పెద్దవారయ్యారు - ముందుకు సాగారు
ఆమె ఒడిలో పసిపాపను పెట్టుకొని
ఆమె మాత్రం ఎక్కడో వెనకపడిపోయింది
ఇసుకలో పిచ్చుక గూళ్ళు కట్టుకుంటూ
బురదలో అన్నం వండుతూ
ఆడిన ఆటలను కలలు కంటూ

(హిందీలో జసింతా కర్కెట్టా రాసిన కవితకు రిచా నాగర్
ఆంగ్ల అనువాదం నుండి తెలుగులోకి - కొత్తపల్లి రవిబాబు)

జనసాహితి ప్రచురణ

47 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

467

సంపుటి : 47
సంచిక : 8
మార్చి 2024

website : www.prajaasaahithi.com


## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ముఖచిత్రం | : | అంతర్జాతీయ శ్రామిక మహిళాదినం సందర్భంగా చిత్రం – శ్రీరామ్ | | .....01 |
| రెండవ అట్ట | : | కవితలు – సాంబమూర్తి లండ; జసింతా కర్కెట్టా | | .....02 |
| మూడవ అట్ట | : | 'పగిడీ సంభాళో' అనే ప్రసిద్ధ పంజాబీ గీతం చరిత్ర | | .....35 |
| నాల్గవ అట్ట | : | రైతుబిడ్డల యాతర.. పోరాటాల జాతర.... (పాట) | – శ్రీదేవి | .....36 |
| సంపాదకీయం | : | పోరాటాల స్ఫూర్తితో.... | | .....05 |
| ముసాయిదా ప్రకటన | : | మతతత్వానికి వ్యతిరేకంగా సంఘటితమవుదాం! | | .....06 |
| సజీవ సాహిత్యం | : | అంతర్జాతీయ శ్రామిక మహిళాదినం | – లెనిన్ | .....09 |
| సంస్మరణలో | : | నంబూరి పరిపూర్ణగారికి జోహార్లు! | – జె.జె. సంయుక్త | .....10 |
| | : | ఎవరీ పరిపూర్ణ?! | – దాసరి అమరేంద్ర | .....12 |
| | : | మా ఉక్కు మహిళ | – మనోజ నంబూరి | .....16 |
| వ్యాసాలు | : | మరొక అస్తిత్వవాద రాజకీయం! | – జి.వి. భద్రం | .....21 |
| | : | మహర్ల, మాంగ్‌ల దుఃఖభరిత జీవితం గురించి | – ముక్తాసాల్వే | .....28 |
| | : | యువత | – భగత్‌సింగ్ | .....30 |
| సమీక్ష | : | లెనిన్ కావ్యంపై | – దాదాహయాత్ | .....18 |
| కరపత్రం | : | మార్చి 8 సందర్భంగా | – స్త్రీ విముక్తి సంఘటన | .....32 |
| సినిమా సమీక్ష | : | 29వ కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం | – బాలాజీ (కోల్‌కతా) | .....25 |
| వివిధ | : | ప్రజాసాహితి యాజమాన్య వివరాలు (04); ముప్పై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (17); వార్తాసాహితి (34) | | |
| సంతాపం | : | పరుచూరు సీతాలక్ష్మి (11), జయగోపాల్ (15), శ్రీపతి, నల్లెల రాజయ్య (20), ఆర్కేఆర్ (31), | | |
| కృతజ్ఞతలు | : | జాస్తి (తుమ్మల) శైలసుతాదేవి (04) | | |



ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ**, జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

రచనలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు**, సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com



ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X

LIBRARY OF CONGRESS
LCCN 94903393

**‘ప్రజాసాహితి’**
**కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు**
**“అకౌంట్ నెం.**
***0680101004936***
***IFSC No. CNRB0000680***
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
**మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.**
**చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.**
డి.డి.లపై ‘ప్రజాసాహితి, విజయవాడ’ అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత ‘ప్రజాసాహితి’కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

## ‘ప్రజాసాహితి’ యాజమాన్య వివరాలు
**(ఫారం 4, రూల్-8 ప్రకారం)**

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రచురణ స్థలం | : | విజయవాడ-520002 |
| 2. | ప్రచురణ కాలం | : | నెలకొకసారి(మాసపత్రిక) |
| 3. | ముద్రాపకుని పేరు | : | **కొత్తపల్లి రవిబాబు** |
| | జాతీయత, చిరునామా | : | భారతీయుడు<br>30-7-6 అనపర్తివారివీధి,<br>అన్నదానం సమాజం రోడ్డు,<br>దుర్గాఅగ్రహారం,<br>విజయవాడ - 520002 |
| 4. | ప్రచురణ కర్త పేరు, జాతీయత, చిరునామా | : | పైవిధంగానే |
| 5. | సంపాదకుని పేరు | : | కొత్తపల్లి రవిబాబు |
| 6. | భాగస్వాములు | | జనసాహితి, ఆంధ్రప్రదేశ్ |

పైన పేర్కొన్న విషయములన్నియు యధార్థములు.

1.3.2024

సం॥ **కొత్తపల్లి రవిబాబు**
ప్రచురణకర్త

## కృతజ్ఞతలు



**జాస్తి (తుమ్మల) శైలసుతాదేవి**
**కూచిపూడి**
మరణం : **27 ఫిబ్రవరి 2023**
మొదటి వర్ధంతి : **16 మార్చి 2024**

**శైలసుతాదేవి సంస్మరణలో**
**కుమార్తె జాస్తి ప్రతిమ, కుమారుడు తుమ్మల సురేష్**
**ఈ సంచిక ముద్రణకు ఆర్థిక సహకారం అందించారు.**
**శైలసుతాదేవిగారికి జోహారులు, వారి పిల్లలకు కృతజ్ఞతలు**

## సంపాదకీయం

# పోరాటాల స్ఫూర్తితో....

**యుద్ధ** వాతావరణం ప్రపంచాన్ని కలచివేస్తూంది. ఏళ్ళ తరబడి రష్యా–ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం సాగుతూనే వుంది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ యుద్ధాన్ని అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను పక్కనపెట్టి మరీ కొనసాగిస్తూనే వుంది. పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు విస్తరిస్తున్నాయి. దేశాల మధ్య, రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య, తెగల మధ్య, జాతుల మధ్య, మతాల మధ్య, కులాల మధ్య.... యుద్ధాన్ని ప్రకటించగల, చేయించగల అవకాశాలన్నింటినీ ఉపయోగించు కుంటూ యుద్ధాలు జరుగుతున్నాయి. తమ మనుగడ కోసం, ప్రాపకం కోసం సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడుల మధ్య పోటీతో జరుగుతున్న యుద్ధాలు సామాన్య ప్రజానీకపు జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ప్రపంచంలోని దేశాలను పంచుకున్న సామ్రాజ్యవాదం, తమ పరిశ్రమలకు నూతన వనరులను సమకూర్చుకోవటం, తమ దోపిడీకి అనుగుణంగా అభివృద్ధి చెందుతూన్న దేశాలను మలచుకోవటం కోసం యుద్ధాలను, ఘర్షణలను ప్రజలపై రుద్దుతోంది. యుద్ధం జరుగుతున్న ప్రాంతాలలోనూ, యుద్ధ ప్రభావిత ప్రాంతాలలోనూ ప్రజల జీవితాలు అస్తవ్యస్తం అవుతున్నాయి.

ప్రపంచ దేశాలతోపాటు మనదేశంలో కూడా తీవ్రమయిన అసమానతలు, పేదరికం, ఆకలి, అణచివేతలకు ప్రజలు గురౌతున్నారు. ఆర్థిక సంక్షోభాలతో పెరుగుతున్న జీవన వ్యయం, అధిక ధరలు, ఉపాధిలేమి, ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. నేడు ప్రపంచ ప్రజలంతా అనుభవిస్తూన్న ఈ సంక్షోభ భారాలకు అంతిమంగా బలిఅవుతున్నది మహిళలూ ఆ తర్వాత విద్యార్థి, యువతరమే. ఈ సంఘర్షణల నడుమ అసమానతలు లేని సమాజస్థాపన లక్ష్యంగా, వర్గరహిత సమాజం మాత్రమే స్త్రీ, పురుషుల మధ్య అసమానతలను, వివక్షలను రూపుమాపుతుందన్న అవగాహనతో 114 సంవత్సరాల క్రితం ప్రకటించుకున్న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాటదినం 'మార్చి 8'ని జరుపుకుంటున్నాం. అసమానతలు లేని సమాజ నిర్మాణమే నిజమైన స్వాతంత్ర్యమని, దేశ స్వాతంత్ర్యం కోసం 24 సంవత్సరాలకే ప్రాణాలు అర్పించి, యువతకు ప్రేరణ, స్ఫూర్తి అయిన భగత్‌సింగ్ 93వ వర్ధంతిని మార్చి 23న జరుపుకుంటున్నాం.

పండించిన పంటకు కనీస మద్ధతు ధరకు చట్టబద్ధత కల్పించాలని 75 సంవత్సరాల స్వదేశీయుల పరిపాలనలో రైతాంగం ఉద్యమిస్తున్నారు. దశాబ్దాలుగా పాలకులు అనుసరిస్తూన్న రైతాంగ వ్యతిరేక విధానాల వలన వ్యవసాయరంగంలోకి ప్రవేశించిన విదేశీ బహుళజాతి కంపెనీల విత్తనాలు, పురుగుమందులు, మార్కెట్ పద్ధతులు దేశీయ వ్యవసాయ విధానాల్ని సర్వనాశనం చేశాయి. వ్యవసాయరంగాన్ని పరాధీనపర్చాయి. తత్ఫలితంగా ఏ విత్తనాలు వేయాలో, ఏ పంటలు పండించాలో, ఏ పురుగుమందులు వేయాలో దగ్గర నుండి మార్కెట్ రేట్లను కూడా బహుళజాతి కంపెనీలే నిర్దేశించే స్థితికి చేరాయి. పాలకుల ఈ పరాధీన విధానాలు పంటలను పండించే రైతాంగాన్ని పంటలకు కాపలాదారులుగా, బహుళజాతి కంపెనీలకు బానిసలుగా దిగజార్చాయి. ఏటికేతం బెట్టి వెయి పుట్లు పండిస్తె గంజిలో మెతుకెరగని రైతాంగం అప్పులతో, ఆకలితో చచ్చేకన్నా, బలవన్మరణాలకన్నా భూమిపైనా, పంటపైనా తమకు గల హక్కులను సాధించుకోవటానికి, ప్రజలందరికీ ఆహారభద్రతను కల్పించటానికి పోరుబాట పట్టారు. మాయలమారి మోడీ ప్రభుత్వం దేశంలోకి చొరబడుతున్న శత్రువులపై యుద్ధం చేస్తున్నట్లు, శాంతియుతంగా ఉద్యమిస్తూన్న రైతాంగం మీద బాష్పవాయు, నీటికేన్ల, రాళ్ళ బుల్లెట్లతో దాడిచేస్తోంది. దారి పొడవునా మేకులు, ముళ్ళకంచెలతో బారికేడ్లతో అడ్డగిస్తోంది.

బహుళజాతి కంపెనీలకు దాసోహమై ప్రజావ్యతిరేక విధానాలను అమలుచేస్తూన్న పాలకులు, భూమి నుండి రైతులను గెంటివేసే విధానాలతోపాటు ఆదివాసీలను అడవుల నుండి ఖాళీ చేయించే చర్యలను ముమ్మరం చేశారు. అటవీ సంరక్షణ చట్టం పేరుతో అటవీ సంపదలను, సహజ వనరులను కాపాడుతున్న ఆదివాసీలను విస్థాపనకు గురిచేస్తున్నారు. దేశ ప్రజల శాంతిభద్రతలను కాపాడాల్సిన పాలకులే ఆదివాసీ ప్రజలపై యుద్ధం చేస్తున్నారు. ఆదివాసీ ప్రజల మనో నిబ్బరాన్ని దెబ్బతీసేందుకు మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ అసభ్యకర ప్రవర్తనలతో, లైంగిక దాడులు చేస్తున్నారు. ఇంతటి అమానవీయమైన అవమానకరమైన సంఘటనలను దేశానికే అవమానంగా సభ్య సమాజం భావిస్తే, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రం ఇటువంటివి చాలా జరుగుతుంటాయంటూ వాటిని సమర్థించాడు.

అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం ఇజ్రాయిల్, తమ మాతృభూమిని రక్షించుకోవటానికి దశాబ్దాలుగా సాగుతున్న పాలస్తీనియన్ల పోరాటానికి వెన్నుదన్నుగా వున్న మహిళలను, పిల్లల్ని హతమార్చటం ద్వారా ఆ జాతిని రూపుమాపాలన్న యుద్ధ తంత్రాన్ని ప్రయోగిస్తూంది. యుద్ధ సమయాలలో మహిళలపై సాగుతున్న అత్యాచారాలు, కుటుంబాలను కోల్పోయి ఒంటరివారిగా మిగలటం, భర్తలను కోల్పోయి కుటుంబ భారాల్ని మోయాల్సి రావటం, మహిళల జీవన భద్రతా హక్కులను కాలరాస్తున్నాయి. కేవలం దేశాల మధ్య యుద్ధాలలోనే గాకుండా ప్రాంతాల మధ్య, తెగల మధ్య, జాతుల మధ్య, మతాల మధ్య, కులాల మధ్య ఘర్షణల సందర్భంలోనూ మహిళలపై అమానవీయమైన లైంగికదాడులు, అవమానకరమైన చర్యలు సర్వసాధారణమైపోయి మహిళల జీవన హక్కును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రాజుల కాలంనాటి యుద్ధాలలోనూ, దేశ విభజన సందర్భంగా జరిగిన ఘర్షణలలోనూ, కాశ్మీరు పౌరుల పోరాటాలలోనూ, గుజరాత్‌లో జరిగిన మత మారణ హోమాల్లోనూ, గ్రామ తగాదాల్లోనూ, అనేక సందర్భాలలో అన్ని

**(తరువాయి 6వ పేజీలో)**

ముసాయిదా ప్రకటన

# మత తత్త్వానికి వ్యతిరేకంగా సంఘటితమవుదాం! ప్రజా వికాస ఉద్యమానికి స్పష్టమైన కార్యాచరణ కోసం లౌకిక, అభ్యుదయ, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేద్దాం!!

**మధ్యయుగాల** చీకటి కాలం తర్వాత హేతుబద్ధమైన జ్ఞాన వికాస యుగం హేతువాదయుగం యూరప్‌లో మొదలైంది. మూఢ నమ్మకాల మీద హేతుదృష్టి ప్రాధాన్యతను, సైన్స్ యొక్క ప్రాధాన్యతను ఎక్కుపెడుతూ వచ్చిన మేధో, సాంస్కృతిక ఉద్యమమది. వ్యక్తిగత స్వేచ్ఛ, పరమత సహనం సాధించడం దాని ప్రధాన లక్ష్యం! పాతుకుని పోయి వున్న నమ్మకాలను అది ప్రశ్నించింది. హేతువు, శాస్త్రీయ రుజువులను బలపరిచింది. ప్రతిదాన్ని హేతుబద్ధమైన విశ్లేషణకు, పరీక్షకు గురి చేసింది.

ఈ రోజు మన దేశంలో హేతుబద్ధ యుగ స్ఫూర్తిని కొనసాగించే బదులు మన పాలకులు మళ్ళీ మనల్ని మధ్య యుగాల చీకటి కాలంలోకి తీసుకుపోతున్నారు. వాళ్ళు ప్రజలను మతం, ప్రాంతం, కులాల ప్రాతిపదికన విభజిస్తున్నారు. ప్రతివిషయంలోనూ హేతు విరుద్ధ భావాలను ప్రచారం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో మన పాలకుల ప్రగతి నిరోధక కార్యకలాపాలను తిప్పికొట్టడానికి మరో సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉందని మేము భావిస్తున్నాము. జ్ఞాన వికాసాన్ని పరివ్యాప్తి చేయడం కోసం ఒక ప్రజా ఉద్యమం నేటి తక్షణావసరం. అటువంటి ఉద్యమం కోసం ఒక కార్యాచరణ ప్రణాళికను ఇక్కడ సూచిస్తున్నాము.

సామాజిక అణచివేతకు సంబంధించిన ప్రజల సమస్యలను మనం చేపట్టాలి. మహిళలకు సమాన హక్కులు నిరాకరించడాన్ని, మహిళల దాస్యాన్ని సమర్ధించడం ద్వారా మహిళలపై దుర్మార్గమైన దాడులను చేయడానికి హిందూత్వం అనువైన వాతావరణాన్ని సృష్టిస్తోంది. కుల వ్యవస్థ, పితృస్వామ్య వ్యవస్థలలో హిందుత్వ భావజాల మూలాలున్నాయి కాబట్టి, కులం, మహిళల అణచివేతపై మనం చేసే పోరాటం, హిందుత్వ మతోన్మాదానికి వ్యతిరేక పోరాటంలో ముఖ్య భూమిక వహిస్తుంది. ఆర్.ఎస్.ఎస్. మనుధర్మ విధానానికి ప్రధానంగా బలవుతోన్న దళితులు, మహిళలు, ఆదివాసీలు, మైనారిటీలను సామాజిక ఆర్థిక న్యాయం అనే డిమాండు ప్రాతిపదికన పెద్ద ఎత్తున మనం సమీకరించాల్సి →

---

(5వ పేజీనుండి)

సందర్భాలలో మహిళలను అగౌరవపర్చటం ద్వారా తమ ఆధిపత్యాన్ని చాటుకునే అమానవీయ నీతి రాజ్యమేలుతోంది. మహిళలను ద్వితీయ పౌరులుగానే కాదు ప్రాణమున్న వ్యక్తిత్వమున్నవారిగానే గుర్తించటంలేదు.

సాధారణ జీవితం కొనసాగించటానికి ఏరోజుకారోజు ఘర్షణ పడాల్సిన పరిస్థితులు దేశంలోనూ, రాష్ట్రాలలోనూ నెలకొని వున్నాయి. విద్య, వైద్యం, రవాణా, నిత్యావసర ధరలు విపరీతంగా పెరగటం, ఉపాధి అవకాశాలు అడుగంటటం, మద్యం, మాదకద్రవ్యాలు, పోర్న్‌సైట్స్, విషసంస్కృతి, విచ్చలవిడిగా స్వైరవిహారం చేస్తూన్న ఈ సామాజిక పరిస్థితుల్లో ప్రజలు మరింత దోపిడీ పీడనలకు గురౌతున్నారు. ప్రజలందరితోపాటు దోపిడీ పీడనలకు గురౌతూనే కుటుంబ భారాన్ని, పురుషాధిపత్య పీడనను మహిళలు అదనంగా భరిస్తున్నారు. పని ప్రదేశాలలో ఉండే వేతన వివక్ష, లైంగిక దాడులు; అసంఘటితరంగ సమస్యలు, వలసల సమస్యలను పురుషులకన్నా ఎక్కువగా మహిళలు అనుభవిస్తున్నారు. ఇక ఆదివాసీ దళిత మహిళలపై సాగుతున్న దోపిడీ, పీడన, అణచివేతలు, లైంగిక దాడులపట్ల పాలకులు బాధ్యత వహించలేని, జవాబుదారీతనం లేని పరిస్థితుల్లో నేడున్నాం.

ప్రజల జీవితాలకు ఏమాత్రం జీవన భద్రత కల్పించలేని పాలకులు, ప్రజల శ్రమశక్తిని దోపిడీ చేయటంతోపాటు, శ్రమ ద్వారా పొందిన అరాకొరా వేతనాలను మద్యం, మాదకద్రవ్యాల వ్యాపారం ద్వారా కొల్లగొడుతున్నారు. మద్యం, మాదకద్రవ్యాల వ్యాపారం విరివిగా చేస్తూ ప్రజల ఆలోచనాశక్తిని మొద్దుబార్చటంతోపాటు ప్రశ్నించే తత్త్వాన్ని చంపేసే మతతత్త్వ భావజాల ప్రచారాన్నీ పెంచుతున్నారు. మతాచారాలు, పూజలు, పండుగలు పేరుతో ప్రజల్లో ఇంకా ముఖ్యంగా మహిళల్లో మూఢత్వాన్నీ పెంచుతూ, ఆయా ఈవెంట్ల ద్వారా వస్తు వ్యాపారాన్ని చేస్తున్నారు. మతం అనే సున్నితమైన విశ్వాసాన్ని పాలకవర్గాలు తమ దోపిడీ విధానాలకు అనుకూలంగా మార్చుకుంటూ మతతత్త్వ గొడవలను పెంచి ప్రజలను ఐక్యం గానీయకుండా చేస్తున్నారు. జీవన భద్రతాలేమి, విషసంస్కృతి, మతతత్త్వ భావజాలం ఈ ముప్పేట దాడి యువతలో సహజంగా వుండే నెత్తురు మండే, శక్తులునిండే చేవను హరించి వేస్తున్నది. మరింతగా అణచివేతలకు దోపిడీ పీడనలకు గురిచేస్తున్నది.

బానిసత్వానికి, ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల చరిత్రలో నూతన సమాజ ఆవిష్కరణకై ముందుపీఠిన నిలబడింది యువకులూ, మహిళలే. అంతర్జాతీయ శ్రామిక మహిళాదినం, భగత్‌సింగ్ వర్ధంతిల స్ఫూర్తితో.... హింస, అణచివేత, అసమానతలు లేని సమాజం కొరకు మరింత తెగువతో పట్టుదలతో ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైనది. ✺

వుంది. పలు రూపాలలో పనిచేస్తోన్న ఆర్.ఎస్.ఎస్ అనుబంధ సంఘాల కుతంత్రాలకు ప్రతిగా ఆదివాసీ ప్రాంతాలలో, దళితుల్లో అభ్యుదయ శక్తులు పట్టుకోల్పోయిన ప్రతిచోటా నిర్మాణాత్మక కృషిని మనం అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. బలహీన వర్గాలను సాంస్కృతికంగా తన గుప్పిట్లో తీసుకోవడానికి సంఘ్ పరివార్ అనుసరిస్తోన్న వ్యూహాన్ని ఈ విధంగా మాత్రమే ఎదుర్కోగలం. కుల వ్యతిరేక ఉద్యమాలు, కులాంతర వివాహాలను నిర్వహించే వ్యక్తులు, సంస్థలను ప్రోత్సహించాలి.

హిందుత్వ గ్రూపులు చేసే విషపూరిత విద్వేష ప్రచారాలు, భయోత్పాతాన్ని, ముఖ్యంగా మత మైనారిటీల మీద చేసే దాడులను చురుగ్గా ఎదుర్కోవాలి. సూక్ష్మ, స్థూల స్థాయిలలో ప్రజా క్షేత్రాలలో మతోన్మాదాన్ని నింపే ప్రయత్నాలను ఎదుర్కోవడానికి అత్యంత నిఘా పెట్టాలి.

ముస్లిం, క్రిస్టియన్ మతాల ప్రభావంలో ఉన్న ప్రజానీకంలో మనం లౌకిక కార్యక్రమాలు చేయడాన్ని ఆయా మత నాయకులు, మతోన్మాద శక్తులు కూడా ఇష్టపడరు. వారికి కూడా ప్రమాదం ఎదురయ్యే కొన్ని సందర్భాలలో మనతో స్నేహం చేయడానికి ఇష్టపడినప్పటికీ సామాన్య ప్రజానీకాన్ని మాత్రం మననుండి దూరంగా ఉంచడానికి వాళ్ళు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తారు. దీన్ని అధిగమించడానికి రాజకీయ జోక్యం, సైద్ధాంతిక కృషితో పాటు, ముస్లిం, క్రిస్టియన్ సాధారణ ప్రజానీకంతో సజీవ సంబంధాలు పెట్టుకుని వారిని చైతన్యం చేయడమే మనం అనుసరించాల్సిన మార్గం.

## సైద్ధాంతిక పోరాటం

ఆర్.ఎస్.ఎస్, దాని అనుబంధ సంఘాలు మీడియా ద్వారాను, నోటి మాటగాను చేసే విషపూరితమైన, విస్తృతమైన మతతత్వ ప్రచారాన్ని ఎదుర్కోవడానికి తీవ్రమైన సైద్ధాంతిక పోరాటం యొక్క అవసరం వుంది.

ఏ) హిందుత్వ మరియు ఇతర రూపాలలో వున్న మతతత్వంలోని ప్రతీఘాత, విచ్ఛిన్నకర స్వభావాన్ని ఎండగట్టే ప్రచారం కోసం, సులభ శైలిలో రాజకీయ, సైద్ధాంతిక సామాగ్రిని తయారు చేసుకోవాలి. దీనికోసం అంకితమై పనిచేసే బృందాలను ఏర్పాటు చేసుకోవాలి. చర్చలు, బహిరంగసభలు, కరపత్రాలు, ఇంకా ఇలాంటి ఇతర రూపాలలో ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా, రెగ్యులర్‌గా చేపట్టాలి. హిందుత్వ శక్తుల మతతత్వ ప్రచారాన్ని ప్రతిఘటించడంలో సోషల్ మీడియాలో జోక్యం చేసుకోవడం ఒక ముఖ్య అవసరం అయింది.

బి) మతతత్వ శక్తులను వ్యతిరేకిస్తూ చేసే సైద్ధాంతిక పోరాటంలో అన్నిరకాల మేధోపరమైన, సాంస్కృతిక వనరులను సమీకరించు కోడానికి అభ్యుదయ శక్తులు, ప్రజాసంఘాలు నిర్వహించే పరిశోధనా కేంద్రాలు, ట్రస్టులను వినియోగించాలి. మతతత్వానికి వ్యతిరేకంగా ఐక్య వేదికలు నిర్మించడానికి మేధావులు, చరిత్రకారులు, శాస్త్రవేత్తలు, సాంస్కృతిక రంగంలోని వ్యక్తులను, వాళ్ళ సంస్థలను సమీకరించాలి.

సి) ప్రీ-స్కూల్, స్కూల్ స్థాయిలో ఆర్.ఎస్.ఎస్ ప్రచారాన్ని ఎదుర్కోవడానికి టీచర్లు, సామాజిక, సైన్స్ ఉద్యమ సంఘాల సహకారం కోసం ప్రయత్నం చేయాలి. ప్రతి పట్టణాలలో బాలోత్సవాలు నిర్వహించాలి. స్కూల్ స్థాయిలో పసి హృదయాలకు చేరువకావడానికి ఇది ఒక ఉపయోగకరమైన మంచి విధానమని మనకు ఇప్పటికే వున్న అనుభవం తెలుపుతోంది.

డి) ఆర్.ఎస్.ఎస్ ఇప్పటికే తన ముసుగు సంస్థల ద్వారా ప్రీ-స్కూల్ స్థాయి నుండి హయ్యర్ సెకండరీ స్కూల్ వరకు వేలాది స్కూళ్లను నడుపుతోంది. ట్రస్టులు, రిజిస్టర్డ్ సంఘాలు లేదా సహకార సంఘాల ద్వారా మన పద్ధతిలో స్కూళ్లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలి.

ఈ) హిందుత్వ మతతత్వ శక్తులను ఎదుర్కోవడంలో హేతుబద్ధంగా భారతదేశ చరిత్రను అధ్యయనం చేయడాన్ని ప్రోత్సహించడం ఒక ముఖ్య కార్యక్రమం అవుతుంది. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, దేశ స్థాయిల్లో జరిగే హిస్టరీ కాంగ్రెస్‌లలో మనం చురుగ్గా పాల్గొనాలి. తన మతతత్వ రాజకీయాలకు అనుగుణంగా స్థానిక చరిత్రలను ఆర్ ఎస్ ఎస్ వక్రీకరించి ప్రచారం చేయడాన్ని ఎదుర్కోవడానికి ప్రతి రాష్ట్రంలో మన ఔత్సాహిక చరిత్రకారులను ప్రోత్సహించాలి.

## సైన్స్, హేతువాద కార్యక్రమాలు

నానాటికి పెరుగుతోన్న అజ్ఞానం, మూఢ నమ్మకాలు, అహేతుకతకు వ్యతిరేకంగా హేతుబద్ధమైన లౌకిక, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడానికి ప్రజా సైన్స్ ఉద్యమాలను ప్రోత్సహించాలి. హిందుత్వ మూకల అహేతుక కార్యక్రమాలను తిప్పికొట్టడానికి ఇది అవసరమవుతోంది.

మతతత్వశక్తులు వ్యాపింపజేస్తోన్న హానికరమైన, అజ్ఞానపూరితమైన ఆలోచనలు, విలువలను ఎదుర్కోవడానికి ప్రజా సైన్స్ ఉద్యమ కార్యక్రమాలు చేపట్టాలి. శాస్త్రవేత్తలు, హేతువాదులు, మెజీషియన్లను, వాళ్ళ సంఘాలను ఈ పనికోసం సమీకరించాలి. స్కూళ్లలో టీచర్లు, మెజీషియన్ల సహకారంతో మొబైల్ మేజిక్, వెంట్రిలాక్విజం(మాట్లాడే బొమ్మ) ప్రదర్శనలు ఏర్పాటు చేయాలి.

పిల్లలు, యువకుల్లో సైన్స్, శాస్త్రీయ స్ఫూర్తి, హేతుబద్ధత పెంపొందించడానికి ప్రత్యేకమైన కృషి చేయాలి. నియమిత కాలానుసారంగా సైన్స్ ఉత్సవాలు, మేజిక్ ప్రదర్శనలు ఏర్పాటు చేయాలి.

## లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళిక

ఈ రోజుల్లో మతతత్వశక్తుల సమీకరణకు కేంద్రంగా వున్న సాంస్కృతిక రంగంలో పోరాటం చేయడం కీలకమైనది.

ఏ) ప్రజానీకంలో మతతత్వాన్ని వ్యాపించజేయడానికి మతపర ఉత్సవాలను వాడుకుంటున్నారు. ఆ సందర్భాలను మనం మతతత్వ శక్తులకు వదిలివేయరాదు. ఈ పండుగలను మతతత్వానికి వాడుకోకుండా నిరోధించే రీతిలో మనం జోక్యం

చేసుకుని లౌకిక భావాల ప్రచారానికి ఉపయోగించుకోవాలి. మతతత్త్వ శక్తుల వ్యతిరేక పోరాటంలో వివిధ విశ్వాసాలు, నమ్మకాలలో వుండే సాంస్కృతిక ఆచారాల నుండి మతతత్త్వాన్ని తొలగించడం ఒక ముఖ్యమైన లక్ష్యం అవుతుంది. మతం యొక్క అభివృద్ధి క్రమంలో విశ్వాసం, సంస్కృతి అనే రెండు అంశాలుంటాయి. విశ్వాసం అనేది మతపరమైనదికాగా, సంస్కృతి లౌకికమైనది. మనం లౌకిక సాంస్కృతిక సంప్రదాయాన్ని పెంపొందించాలి.

బి) సామాన్య ప్రజానీకమంతా పాల్గొనేలా మనం ప్రత్యామ్నాయ లౌకిక పండుగలను రూపొందించాలి. ఒక అభ్యుదయకరమైన వినోద కార్యక్రమంలో, కుటుంబాలతో సహా అందరు పాల్గొని పూర్తి సంతోషంతో, ఆరోగ్యకరంగా గడిపే సామాజిక వేదికలా వీటిని నిర్వహించాలి. ఉదాహరణకు, మే డే, ఆదివాసీ స్వాతంత్ర సమరయోధుల దినం, మానవ హక్కుల దినం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం, భగత్సింగ్ అమరత్వం చెందిన దినం మొదలగువాటిని ఈ ఉత్సవాలకు ఎంపిక చేసుకోవచ్చు.

సి) క్షేత్ర స్థాయిలో ప్రజాసంఘాలు సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాలను తమ కార్యక్రమాలలో భాగం చేసుకోవాలి. స్థానిక స్థాయిలో సాధారణ ప్రజానీకం పాల్గొనే రీతిలో జానపద కళలు, సంగీతం, సాహిత్యం, పర్యావరణం లాంటి లౌకిక సాంస్కృతిక కార్యకలాపాలకు ప్రాధాన్యతనిచ్చి, వాటిని వికేంద్రీ కరించాలి. వీటి ద్వారా ఆయా తరగతుల్లో అభ్యుదయ, లౌకిక, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయాలి.

డి) ట్రేడ్ యూనియన్‌లు, ప్రాంతీయ ప్రజాసంఘాలు, బస్తి, కమ్యూనిటీ ఆధార సంస్థలను సమన్వయం చేసుకుంటూ వారివారి నివాస ప్రాంతాలలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి. హిందుత్వశక్తులు ప్రచారం చేస్తోన్న హానికర, కులతత్త్వ, అజ్ఞాన భావజాల విలువలను తిప్పికొట్టడానికి, ముఖ్యంగా దళితులు, ఆదివాసుల్లో భారత సమాజం యొక్క సమ్మిళిత సంస్కృతి ప్రాధాన్యతను ఎత్తి చూపుతూ సాంస్కృతిక కార్యకలాపాలను నిర్వహించడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

ఈ) అభ్యుదయ, లౌకిక విలువలు, సాంస్కృతిక కళారూపాలను రక్షించుకోవడానికి ఒక విశాల ప్రాతిపదిక గల వేదికల ఏర్పాటుకు కృషి చేయాలి.

ఎఫ్) ప్రముఖ రచయితలు, స్వాతంత్ర్య సమరయోధులు, శాస్త్రవేత్తలు మొదలగువారి జయంతులు, వర్ధంతుల సందర్భంగా ఆసక్తి గల సంస్థలను కూడా కలుపుకుని ప్రత్యేక కార్యకలాపాలు నిర్వహించాలి.

జి) మన స్టడీ సెంటర్‌లు / సాంస్కృతిక వేదికలు అన్ని స్థాయిల్లో యువజనోత్సవాలను క్రమబద్ధంగా నిర్వహించాలి.

హెచ్) ఆటలు, క్రీడలు, కళల లాంటి యువజన కార్యకలాపాలను ప్రోత్సహించాలి. మానవీయ, సేవా కార్యక్రమాలలో యువకులు పాల్గొనేలా చూడాలి.

ఐ) సాంప్రదాయశక్తుల దాడులను భౌతికంగా తిప్పి కొట్టడానికి ఒక యువజన వలంటీర్ల సంఘాన్ని నిర్మించుకోవాలి. అవసర మైనప్పుడు ఈ వాలంటీర్లు సామాజిక సేవలోను, సహాయ చర్యలలోను పాల్గొనేటట్లుండాలి.

జె) గ్రామీణ జానపద కళాకారులను సమీకరించి, జానపద ఉత్సవాలు నిర్వహించాలి. ఈ కళాకారుల్లో అధికులు అట్టడుగు వర్గాలకు చెందినవారై వుంటారు. ఈ విషయంలో గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే మన ప్రజాసంఘాలు చొరవ తీసుకోవాలి. ఈ జానపద కళా వేదికలను లౌకిక భావాల ప్రచారానికి వినియోగించవచ్చు.

కె) యువ, ఔత్సాహిక కళాకారులని సమీకరించి లఘుచిత్రాలు, చిత్రకళ, ఫొటోగ్రఫీ ప్రదర్శనలను, ఉత్సవాలను నిర్వహించవచ్చు. మన స్టడీ సెంటర్‌లు వీటిని ఆర్గనైజ్ చేయవచ్చును.

ఆరోగ్యం, విద్యారంగాలలో ప్రజా ఉద్యమాలు నిర్మించాలి. ఆర్.ఎస్.ఎస్, హిందుత్వశక్తులు విద్యారంగంలో చాలా చురుగ్గా వున్నాయి. విద్యారంగంలో జోక్యం చేసుకుని శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా లౌకిక, ప్రజాస్వామిక, బహుళత్వ భావనలను ప్రవేశపెట్టి, వ్యాపింప చేయడానికి, చర్యలు తీసుకోవాలి.

మతతత్త్వ వ్యతిరేక పోరాటాన్ని లౌకికతత్త్వం కోసం సాగే పోరాటంగా మార్చాల్సి ఉంటుంది. మతతత్త్వాన్ని ఎదుర్కోవడంలో పౌర సమాజాన్ని లౌకికతత్త్వం వైపు మళ్ళించడమనేది ఒక ముఖ్యమైన విధానంగా ఉంటుంది. మత ప్రాతిపదికన ఏకీకరణ సాధించాలనే మతతత్త్వ శక్తుల ప్రయత్నాలను ఎదుర్కోవడానికి, స్థానిక స్థాయిలో భౌతికవాద, లౌకిక కార్యకలాపాల ఆధారంగా లౌకిక కమ్యూనిటీలను నిర్మించి బలోపేతం చేయాలి. కుల, మతాలకతీతంగా ఇరుగు పొరుగు (నైబర్ హుడ్) కమ్యూనిటీల అవసరముంది. ఈ నూతన వేదికలకు నూతన రూపాలను కనుగొనాల్సి వుంది. మతతత్త్వాన్ని వ్యతిరేకంగా విస్తృత సమీకరణ కోసం, లౌకిక, ప్రజాస్వామిక, అభ్యుదయ శక్తులతో ఐక్య వేదికలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే అటువంటి వేదికలను ఎన్నికల ఐక్య సంఘటనలకు ప్రాతిపదికగా చూడరాదు.

కార్పొరేట్ పెట్టుబడి ఇచ్చే నిధితో ఆర్.ఎస్.ఎస్ నడుస్తున్నట్టుగా కాకుండా మన సామాజిక సేవ, సాంస్కృతిక కార్యక్రమాలకు నిధులను, విశాల ప్రజానీకం నుండి, ఉన్నతమైన భావాలు గల వ్యక్తుల నుండి, సంస్థలు, వ్యాపారస్తుల నుండి సమీకరించుకోవాలి. వర్గ, ప్రజాసంఘాలు కూడా ముందుకు వచ్చి ఆర్థికంగా కనీసం తమ స్వంత పరిచయస్తుల ద్వారా తోడ్పడాలి.

**ఆల్ ఇండియా పీపుల్స్ లిటరరీ అండ్ కల్చరల్ ఫోరమ్ (AIPLCF)**

**ఆల్ ఇండియా స్టూడెంట్స్ అండ్ యూత్ ఆర్గనైజేషన్ (AISYO)**



### 08-03-1921 'ప్రావ్దా' పత్రిక అనుబంధంలో వి.ఐ. లెనిన్ రాసిన వ్యాసం :

# అంతర్జాతీయ శ్రామిక మహిళాదినం

– అనువాదం : కొత్తపల్లి రవిబాబు

**అత్యంత** క్రూరమైన అణచివేతకు గురైన ప్రజలు నేడు రాజకీయాలలోకి ప్రవేశించడమే బోల్షివిజమూ, రష్యన్ అక్టోబరు విప్లవం యొక్క సారభూతమైన విషయం. వారు పెట్టుబడిదారులచే, రాజరిక కాలంలోనూ, బూర్జువా ప్రజాస్వామిక రిపబ్లిక్‌ల కాలంలోనూ అణచివేతకు, మోసానికి గురయ్యారు. దోచుకోబడ్డారు. భూమి, కర్మాగారాలు ప్రైవేటు వ్యక్తుల ఆస్తిగా వున్నంతకాలం, పెట్టుబడిదారుల మోసము, దోపిడీ తప్పనిసరి.

బోల్షెవిజం, సోవియట్ అధికారము యొక్క సారం ఏమిటంటే బూర్జువా ప్రజాస్వామ్యంలోని అసత్యాలనూ, కపటత్వాన్ని బట్టబయలు చేయడం, భూమిపైన, ఫ్యాక్టరీలపైన వ్యక్తిగత యాజమాన్యాన్ని రద్దు చేయడం, రాజ్యాధికారాన్ని దోపిడీకి గురవుతున్న శ్రామికుల చేతుల్లో కేంద్రీకృతం చేయడం. ఈ ప్రజలు రాజకీయాలపై ఆధిపత్యం సాధించి, ఒక నూతన సమాజమనే భవంతిని నిర్మిస్తారు. ఇది ఏమంత తేలికైన పని కాదు. ఎందుకంటే పెట్టుబడిదారీ విధానం ఈ ప్రజారాశులను పీడించింది. అణగద్రొక్కింది. వేతన బానిసత్వం నుండీ, పెట్టుబడిదారీ విధానానికి వెట్టిచాకిరీ నుండి విముక్తి సాధించాలంటే ఇది తప్ప మరో మార్గం లేదు.

కాని మహిళలను రాజకీయాలలోకి ఆకర్షించకుండా ప్రజారాశులను కదిలించలేము. పెట్టుబడి కార్మిక మహిళలను, రైతాంగ మహిళలను అణగ ద్రొక్కుతోంది. అంతేగాక, అత్యంత ప్రజాస్వామికమైన బూర్జువా రిపబ్లిక్కులలో కూడా వారికి కొన్ని హక్కులు నిరాకరింప బడతాయి. ఎందుకంటే చట్టం వారిని మగవారితో సమానంగా గుర్తించదు కనుక. రెండో కారణం ఏమిటంటే ఇదే ప్రధాన విషయం – వారు "ఇంటి బానిసత్వంలో కూరుకుపోయి వుంటారు గనుక. వారు "ఇంటి బానిసలుగా కొనసాగుతుంటారు. ఇంటిలోనూ, వంట గదిలోనూ వారు వెన్నెముక విరిగేటంతగా నీచమైన గాడిద చాకిరితో అత్యధిక భారాన్ని మోస్తూ వుంటారు.

సోవియట్ బోల్షెవిక్ విప్లవం చేసినంతగా ఏ పార్టీ కానీ, విప్లవం కానీ మహిళల అసమానత, అణచివేతలపై లోతుగా కృషి చేయడమనేది కలలో కూడా తలచలేదు. ఇప్పుడు ఇక్కడ సోవియట్ రష్యాలో చట్ట ప్రకారం స్త్రీ, పురుషుల మధ్య అసమానతల జాడే లేకుండా చేశాం. వివాహ సంబంధమైన, కుటుంబ సంబంధమైన పిల్లల సంబంధమైన విషయాలలోను అసమానతలతో కూడి వున్న అసహ్యకరమైన, నీచమైన కపటంతో కూడిన చట్టాలన్నిటిని సోవియట్ తొలగించివేసింది.

మహిళల విముక్తి సాధనలో ఇది మొదటి అడుగు మాత్రమే. అత్యంత ప్రజాస్వామికమని చెప్పుకునే ఏ బూర్జువా రిపబ్లిక్ కానీ, ఈ మొదటి అడుగు వేసే ధైర్యం చేయలేదు. కారణం "పవిత్రమైన ప్రైవేటు ఆస్తి" పట్ల వున్న అపారమైన గౌరవం!

ఇక రెండవదీ అత్యంత ముఖ్యమైన చర్య – భూమి, ఫ్యాక్టరీలపై వున్న ప్రైవేటు యాజమాన్యాన్ని రద్దుపరచడం. ఇది మాత్రమే మహిళలను పూర్తిగా, వాస్తవంగా విముక్తపరచడానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. చిన్న చిన్న వ్యక్తిగతమైన ఇళ్ళల్లోని "ఇంటి బానిసత్వం" నుండి విస్తృతమైన సామాజీకరింపబడిన ఇంటి సేవల ద్వారా ఆమె విముక్తి పొందుతుంది.

ఈ పరివర్తన అత్యంత కష్టమైనది. ఎందుకంటే ఈ క్రమంలో లోతుగా పాతుకుపోయిన, ఎదురులేని, మార్పుకు లొంగని దాని రూపాన్ని పూర్తిగా మార్చాలి. (అసభ్యత, అనాగరికత అనడం సత్యానికి దగ్గరగా వుంటుంది). కాని పరివర్తన ప్రారంభమైంది. అది ముందుకు సాగుతూ వుంది. మనమొక నూతన మార్గాన్ని ఎన్నుకున్నాం.

ఈ అంతర్జాతీయ శ్రామిక మహిళాదినం సందర్భంగా ప్రపంచంలోని అన్ని దేశాల శ్రామిక మహిళల సభలూ సోవియట్ రష్యాకు అభినందనల పరంపరనందిస్తాయి. ఎందుకంటే నమ్మశక్యంకాని, దీటులేని అతి క్లిష్టమైన మహత్తర కర్తవ్యాన్ని – విశ్వవ్యాప్తంగా నిజమైన విముక్తి స్వభావం గల కర్తవ్యాన్ని మొదటిసారిగా రష్యా చేపట్టింది. దీనిపై బూర్జువావర్గపు భయానకమైన, అనాగరిక ప్రతిక్రియలకు భయపడవద్దని మాకు మద్దతు తెలియచేస్తూ సందేశాలు వస్తుంటాయి. ఒక బూర్జువా దేశం అత్యంత స్వేచ్ఛగా, ఎంతో ప్రజాస్వామికంగా వుందీ అంటే ఆ దేశంలోని పెట్టుబడిదారుల ముఠా విప్లవాలను అంతగా విధ్వంసం చేస్తారన్నమాట! దీనికి ఉదాహరణే – ఉత్తర అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజాస్వామిక రిపబ్లిక్. కాని శ్రామిక ప్రజారాశులు ఇప్పటికే మేల్కొన్నారు. వెనుకబడ్డ ఆసియాలోనూ, అమెరికా, ఐరోపా దేశాలలో జడులుగా నిద్రావస్థలో మునిగి వున్న ప్రజారాశులను సామ్రాజ్యవాద యుద్ధం అంతిమంగా కర్తవ్యోన్ముఖులను చేసింది.

ప్రపంచంలోని ప్రతిచోటా స్తబ్ధత వీడింది.

సామ్రాజ్యవాద కాడి బరువు నుండి ప్రజల విముక్తిని, పెట్టుబడి కాడి భారం నుండి శ్రామిక స్త్రీ, పురుషుల విముక్తిని ఎవరూ ఆపలేరు. ఈ పిలుపు దేశవ్యాప్తంగా శ్రామిక స్త్రీ పురుషులకు చేరుతోంది. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి నుంచి శ్రామికుడికి స్వేచ్ఛ అనేది విజయం సాధిస్తుంది.

**మార్చి 4, 1921** ✱

## నంబూరి పరిపూర్ణ సంస్మరణలో....



# నంబూరి పరిపూర్ణ గారికి జోహార్లు!

– జె.జె.సంయుక్త, హైదరాబాద్

**ఉమ్మడి** కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నడిచిన విద్యార్థి ఉద్యమ నాయకురాలిగా, ప్రజా కళాకారిణిగాఆనాడు క్రియాశీలకంగా పనిచేసిన నంబూరి పరిపూర్ణగారు 26.1.24 తేదీన తన 93వ ఏట బెంగుళూరులో మరణించారు. ఉద్యమాలలో భాగస్వాములైన ఆ తరం నాయకుల, కార్యకర్తల జీవితాల గురించి, వారి నిబద్ధత గురించి, ఆనాటి నిర్బంధ కాలంలో కూడా వారు ప్రజల మధ్య శ్రామికవర్గ రాజకీయాలను తీసుకువెళ్లడానికి చేసిన కృషి గురించి తెలుసుకోవాలంటే పరిపూర్ణగారి లాంటివారి కృషిని చదవటం, అర్థంచేసుకోవడం అవసరం. ఆమె ఎదురుగా ఒక గంట కూర్చుంటే చాలు.... ఆమె అలా అలా.... ప్రవాహంలాగా చెప్పుకుంటూ పోయే ఉద్యమ జ్ఞాపకాల్లో ఎందరెందరో కార్యకర్తల, నాయకులజీవితాలు మన కళ్లముందు నిలబడి ఉత్తేజాన్నిస్తాయి. వివిధ చారిత్రక కాలాల్లో అసమాన త్యాగాలు చేసికూడా ఊరు పేరూ తెలియడానికి అవకాశం లేని, అసామాన్యులైన సామాన్యులెందరో ఉన్నారని మనకు అర్థమవుతుంది.

ఉద్యమాలలో పాల్గొనడం ద్వారా తాము పొందిన అనుభవాలను తమ స్వంత చరిత్రలుగా, తమ పరాక్రమంగా చెప్పుకునే కొందరు వ్యక్తివాదులకు భిన్నంగా సమష్టితత్వాన్ని గుర్తించిన రచయిత్రి పరిపూర్ణగారు. తెలంగాణ పోరాట విరమణ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో పొడచూపిన తిరోగమన ధోరణులకు, విధానాలకు ప్రతిబింబాలుగా చాలామంది కార్యకర్తల, నాయకుల జీవితాలు మారాయి. ఆ పరిస్థితుల్లో రకరకాల ఉద్యోగాలలోకి, వృత్తులలోకి వెళ్లిపోయిన వారిలో పరిపూర్ణగారు కూడా ఒకరు. కానీ ఏనాడు కూడా ఆమె తను నేర్చుకున్న మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల గాని, ఆ సిద్ధాంతం యొక్క విశిష్టత పట్ల గాని నమ్మకాన్ని కోల్పోకుండా చివరివరకు సాగారు. తాము పుట్టిన ప్రాంతాన్ని, కులాన్ని, మతాన్ని అమితంగా ప్రేమించే భావదారిద్ర్య లక్షణాలు పనిగట్టుకుని పెంచుతున్న ఈ కాలంలో కూడా విశ్వమానవ ప్రేమను కనబరుస్తూ జీవించిన పరిపూర్ణగారు భౌతికంగా మనకు దూరమయ్యారు.

ఆమె వ్యక్తిగా తాను పొందిన అనుభవాలను, నేర్చుకున్న పాటలను, కళలను సమాజం మధ్యకు చేరుస్తూనే వచ్చారు. తన అన్నయ్య ద్వారా కుటుంబంలో తాను పొందిన ఉద్యమచైతన్యాన్ని తన బిడ్డలకు, వారివారి సంతానానికి అందివ్వడానికి ప్రయత్నించారు. ఆ క్రమంలోనే ఆనాటి తరంలోని ఎంతోమంది నాయకులు, వారి పిల్లలు తనకు, తన కుటుంబానికి బంధువులుగా మారారు. వారిలో చాలామంది ప్రజాతంత్ర భావాలు కలిగి నేటికీ వివిధ రంగాల్లో కొనసాగుతున్నారు. వారందరి మీద ఉద్యమాల ప్రభావం ఉంది. పరిపూర్ణగారి ప్రభావం కూడా వుంది. భిన్నభిన్న తాత్విక దృక్పథాలకు, ఆలోచనలకు ప్రతినిధులుగా వున్న వారితో, వివిధ వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు, దళిత, మహిళా సంఘాలతో స్నేహపూరితంగా వుండేవారు. హైదరాబాద్‌లో జరిగిన పరిపూర్ణగారి సంస్మరణసభే అందుకు సాక్ష్యం.

పరిపూర్ణగారు తన వ్యక్తిగత జీవితంలో జరిగిన సంఘర్షణలో సైతం ఆత్మగౌరవాన్ని నిలుపుకొనే పరిష్కారాన్నే ఎంచుకున్నారు. తన పైన ఆధారపడ్డ పిల్లలకు, కుటుంబానికి బాధ్యత వహించారు. సామాజిక బాధ్యతను వదల్లేదు. తన వైవాహిక జీవితంలో ఎదురైన సమస్యలకు గల కారణాల్ని వ్యక్తిగత స్థాయిలోనే చూశారు తప్ప కమ్యూనిస్టు పార్టీ పట్ల, ఎర్రజెండా పట్ల విశ్వాసం కోల్పోలేదు. పట్టుదలగా, నిజాయితీగా చివరిశ్వాస దాకా జీవించారు. ఇదే పరిపూర్ణగారి గొప్పతనం, ఔన్నత్యం.

తన వ్యక్తిత్వం రూపుదిద్దుకోవడంలో నాటి ఉద్యమ వాతావరణం, సమష్టి కృషి, కమ్యూనిస్టు పార్టీ నాయకుల, కార్యకర్తల త్యాగాల గురించి ఎంతో వినమ్రంగా చెప్పేవారు. ఆగిపోయిన తన చదువును తిరిగి కొనసాగించడం కోసం మద్రాసు రావడం, కమ్యూనిస్టు నాయకులు దర్శి చెంచయ్యగారు, ఇంకా అనేకమంది అందించిన ప్రోత్సాహం గురించి, వాళ్ళ ఔన్నత్యం గురించి పదేపదే గుర్తు చేసుకునేవారు.

తన పెద్దన్నయ్య, గోదావరి జిల్లా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకులైన నంబూరి శ్రీనివాసరావును కడలూరు సెంట్రల్ జైలు నుండి రాజమండ్రి సెంట్రల్ జైలుకు మార్చడంతో పరిపూర్ణగారికి రాజమండ్రితో అనుబంధం ఏర్పడింది. పరిపూర్ణగారి చదువు, సంరక్షణకు సంబంధించిన బాధ్యతను పార్టీ కామ్రేడ్స్ స్వీకరించారు. ఉద్యమ వాతావరణం మధ్య 13 ఏళ్ల చిన్న వయసులోనే రాజమండ్రిలోని వివిధ పేటల్లో జరిగే మహిళాసంఘం సమావేశాల్లో మాట్లాడేవారు. పాటలు పాడేవారు. ఈ క్రమంలోనే విద్యార్థి సంఘం నాయకురాలిగా ఎదిగానని చెప్పేవారు.

ఉద్యమ క్రమంలో పరిపూర్ణగారు అనేక కష్టాలను, నిర్బంధాన్ని అనుభవించారు. ఈ అనుభవాలన్నింటినీ ఆమె ఆత్మకథ "వెలుగుదారులలో" రచన ద్వారా సమాజం ముందుంచారు.

మహీధరగారి కుటుంబాల నుంచి పొందిన ఆదరణ, అక్కడ నేర్చుకున్న రాజకీయాలు, అధ్యయనం చేసిన కమ్యూనిస్టు సాహిత్యం – ఇవన్నీ ఆమెకు మార్క్సిజంపట్ల సరైన అవగాహనను అందించాయని కలిసినప్పుడల్లా వివరించేవారు.

పరిపూర్ణగారు తన ఆత్మ కథలో సామాజిక ఉద్యమ జీవిత పరిణామ క్రమం గురించి చెప్పుకుంటూ.... కులవ్యవస్థల్ని, మతాధిపత్యాల

తిరోగమన భావజాలాన్నీ, అభ్యుదయ నిరోధక దృక్పథాన్ని తీవ్రంగా నిరసించాలని మాకు తెలియజెప్పేవారు జగన్మోహన్ దంపతులు. ఆ విధమైన వారి విమర్శలు మాకెంతో కనువిప్పు! ఈ విధమైన చర్చలు, విమర్శలు నావరకు నాకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, ప్రాథమిక విషయాలను ఎంతగా బోధపరిచాయో! భారతదేశంలో హైందవ మతం ఏర్పరిచిన చాతుర్ వర్ణవ్యవస్థ వృత్తి విభజనకు మారుగా కుల విభజనగా తయారయ్యింది. ఉన్నత, హీన కుల భావనలను ప్రజల మనసుల్లో లోతుగా నాటింది. తమ కులాలకు చెందిన దారిద్ర్యం, బానిసత్వం, వెట్టిచాకిరీ తమ పూర్వజన్మల కర్మఫలమని జనం చేత నమ్మించి, నిరాటంకంగా అన్ని విధాలుగా దోపిడీ సాగించేందుకు మార్గాలు వేసింది. ఈ కులవ్యవస్థ ఇతర దేశాల్లో లేనప్పటికీ పెట్టుబడిదారీ ధనికవర్గాల ఆధిపత్యం కింద కోట్లాది మంది శ్రమజీవులు ఆయా దేశాల్లో శ్రమదోపిడీకి గురవుతూ నిరంతర పీడనతో నలిగిపోతున్నారన్నది నిజం.

ఇలా అన్ని దేశాల సామాజిక అంతర్గత విషయాలు బాగా అవగాహనకు వచ్చేవి. "మహీధర గారింట్లో వర్గాలంటే ఏమిటో, వర్గ స్వభావాలేమిటో, దోపిడీ పీడనలంటే ఏమిటో నాకప్పుడే తెలియవచ్చింది. దాంతో నెమ్మదిగా కమ్యూనిస్టు సాహిత్యాన్నీ, మార్క్సు, లెనిన్‌ల రచనల్నీ చదివి అర్థం చేసుకోగల శక్తి పెరిగింది. నాకర్థమయినంత మేరకు మార్క్సిజం సమాజపు పడుగు పేకల శక్తులేమిటో తేటగా బోధించే సాధనమయింది" అని స్పష్టపరిచారు.

పరిపూర్ణగారితో జనసాహితి సంస్థకు, 'ప్రజాసాహితి' పత్రికకు సుదీర్ఘమైన అనుబంధం ఉంది. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని పరిపూర్ణ గారింటికి దగ్గరలో వున్న "కవిరాజు అక్షరాలయం"లో సాహిత్య సమావేశాలు, సభలు జరుగుతుండేవి. అక్కడ జనసాహితి సంస్థ వివిధ సందర్భాల్లో నిర్వహించిన 'ప్రజాసాహితి' ప్రత్యేక సంచికల ఆవిష్కరణ సభలకు, వివిధ అంశాలపై జరిగిన సమావేశాలన్నింటికీ పరిపూర్ణగారు తప్పనిసరిగా వచ్చేవారు. అందరికంటే ముందుగా వచ్చి ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవారు. అక్కడ "కృష్ణమ్మ మిలమిలల – గౌతమీ గలగలల...." పాటను, "నేనొక శాంతి సమర సైనికుడిని...." పాటను, బెంగాల్ కరువుపైన పాటలను ఎంతో శ్రావ్యంగా స్ఫూర్తినిస్తూ పాడేవారు.

2009లో హైదరాబాదులో జరిగిన స్త్రీ విముక్తి సంఘటన మహాసభలలో వల్లం నరసింహారావుగారు నేర్పించిన అల్లూరి సీతారామరాజు బుర్రకథను మహిళా కళాకారులు ప్రదర్శించారు. ఆ ప్రదర్శన చూసిన తర్వాత పరిపూర్ణగారు ఎంతో ఉద్వేగంతో ఆ ఆడపిల్లలను గుండెలకు హత్తుకొని చాలా బాగా చేశారని మెచ్చుకున్నారు. తమ పాతరోజులు గుర్తుకొస్తున్నాయంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

వల్లం నరసింహారావు, ప్రగతి ప్రింటర్స్ హనుమంతరావు వంటి వారితో కలిసి తాను ఇచ్చిన రకరకాల కళాప్రదర్శనలు, ఆసందర్భంలో వారు అనుభవించిన కష్టాలు, వారి కళారంగపు ఉద్యమ అనుభవాలను కొత్తతరం కళాకారులు ఎవరు కలిసినా చెప్పేవారు.

జనసాహితి సంస్థ ఆధ్వర్యంలో 2017లో హైదరాబాదులోని త్యాగరాయగానసభలో బెంగాల్‌కి చెందిన "సౌవిక్ సాంస్కృతిక చక్ర" అనే సంస్థ కళాకారులు గౌతమ్ ముఖర్జీగారి నేతృత్వంలో ప్రదర్శించిన గోర్కీ 'అమ్మ' నాటక ప్రదర్శన పరిపూర్ణగారి పాటతోనే ప్రారంభమైంది. ముందు వరుసలో కూర్చుని నాటకాన్ని మొత్తం చూసి, ప్రదర్శన అయిపోయిన వెంటనే కళాకారుల దగ్గరకెళ్ళి ఎంతో ఆత్మీయంగా వారిని పలకరించి అభినందించారు.

సాహితీ సాంస్కృతిక రంగంలో, మహిళా రంగంలో, ఇతర ప్రజా ఉద్యమాలలో పనిచేస్తున్న వారి పట్ల పరిపూర్ణగారు ఎంతో ఆత్మీయతను, ప్రేమను చూపేవారు. ఆ అనుబంధాన్ని కొనసాగించేవారు. ఎవరు ఏ పత్రిక ఇచ్చినా, కరపత్రం ఇచ్చినా పూర్తిగా చదివి తన అభిప్రాయం వ్యక్తం చేసేవారు. ఆమెను కలిసినప్పుడల్లా ఎంతోఇష్టంగా ఆమె అనుభవాల్ని వింటూ, దృఢమైన ఆమె వ్యక్తిత్వంలో ఆనాటి కమ్యూనిస్టు పార్టీ కృషిని చూసాం.

మార్క్సిజం పట్ల, ఎర్రజెండా పట్ల ఏమాత్రం సడలని విశ్వాసం ఆమె ప్రతి మాటలో ప్రస్ఫుటంగా వ్యక్తమయ్యేది. విద్యార్థి ఉద్యమ నాయకురాలిగా, ప్రజా కళాకారిణిగా తాను, తనతోపాటు పనిచేసిన వారందరూ ఎంత పట్టుదలతో, ఉత్సాహంగా, ఉత్తేజంతో పనిచేసేవారో, ఆ నాటి ఉద్యమానుభవాలను, జ్ఞాపకాలను నిన్న మొన్ననే జరిగిన సంఘటనల లాగా చెబుతూ ఆ కాలంలోకి, ఆ ఉద్యమ వాతావరణంలోకి మనల్ని కూడా తనతోపాటు తీసుకెళ్ళేవారు. కమ్యూనిస్టు పార్టీ తనకి అందించిన చైతన్యాన్ని, వికాసాన్ని చాలా గర్వంగా చెప్పేవారు. ఆమెను కలవడం, ఆమెతో మాట్లాడడం, ఆనాటి ఉద్యమ అనుభవాల్ని, వారి అచంచలమైన విశ్వాసాన్ని వినడం, చూడటం ఎంతో స్ఫూర్తినిచ్చేవి. ✺



# పరుచూరు సీతాలక్ష్మి మరణానికి సంతాపం

**ప్రగతి** ప్రింటర్స్ వ్యవస్థాపకులు పరుచూరు హనుమంతరావు భార్య సీతాలక్ష్మి తన నూరవ ఏట 15-1-24న హైదరాబాద్‌లో మరణించారు.

పరుచూరు హనుమంతరావు తొలితరం ప్రజానాట్యమండలి నాయకులు. సామ్యవాద స్థాపన కోసం జరిగే కృషికి చివరికంటా ఈ దంపతులిద్దరూ సహాయ సహకారాలందించారు.

సీతాలక్ష్మి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సహానుభూతి తెలియచేస్తూంది. ✺

నంబూరి పరిపూర్ణ సంస్మరణలో....



# ఎవరీ పరిపూర్ణా?!

- దాసరి అమరేంద్ర

ఈ ప్రశ్న నేను మీకు వెయ్యడంలేదు. నాకు నేను వేసుకొంటున్నాను. ఆమెతో అరవై ఆరేళ్ళ జ్ఞాపకాలు ఉన్న వ్యక్తిగా, ఆమె జీవన పోరాటాన్ని అరవైయేళ్ళుగా గమనించిన మనిషిగా – ఆమెను అర్థం చేసుకొనే ప్రయత్నంలో నాకు నేను వేసుకున్న ప్రశ్న ఇది. గత మూడు వారాలుగా సమాధానం వెదుకుతున్నాను. ఒకటిగాదు – ఆరేడు సమాధానాలు దొరికాయి. అవి మీతో పంచుకొంటున్నాను.

## 1. ఎవరీ పరిపూర్ణ?

చురుకైన విద్యార్థి. విద్యార్థి ఉద్యమ నాయకురాలు. వామపక్ష భావాలను ఉగ్గుపాలతో తనలోకి ఇంకించుకొని పెరిగిన మనిషి. చివరిదాకా ఆ భావాలకే కట్టుబడిన మనిషి.

తెల్రప్రోలు దగ్గరి బండారిగూడెం ఆమె స్వగ్రామం. అక్కడే ఎలిమెంటరీ విద్యను అభ్యసించింది. అప్పటికే రాజకీయ ఉద్యమాలలో చైతన్యంతో పనిచేస్తోన్న పెద్దన్నయ్య శ్రీనివాసరావు పూనికతో బెజవాడకు తన విద్యాభ్యాసాన్ని తరలించింది. ఆ తర్వాత మద్రాసులో గదర్ ఉద్యమకారుడు దర్శి చెంచయ్య నీడనా, రాజమండ్రిలో మహీధరల కుటుంబంలో సభ్యురాలుగా ఉంటూ హైస్కూలు విద్య ముగించింది. ఆ తర్వాత ఇంటర్ చదువు పీయార్ కాలేజ్ కాకినాడ. ఆ చిన్న వయసులోనే పెళ్లి అవడంతో చదువుకు అక్కడ విరామం ఏర్పడింది.

ఎలిమెంటరీ స్కూలు రోజుల నుండే ఇంటి వాతావరణం, అన్న శ్రీనివాసరావు ప్రభావాల వల్ల అభ్యుదయభావాలకు ఆమె సహజ నెలవు అయింది. దర్శి చెంచయ్యకు మానసపుత్రికగా ఆయన ట్రేడ్ యూనియన్ కార్యక్రమాలనూ, సామాజిక నిబద్ధతనూ దగ్గరగా గమనించింది. మహీధర కుటుంబంతో ఉన్నపుడు జగన్మోహనరావుగారు ప్రతిరోజూ తన ఇంటిలోని పిల్లలందరినీ చేర్చి చెప్పిన సాహిత్య రాజకీయ విశ్లేషణలను ఔపాసన పట్టింది. విని ఊరుకోవడమే గాకుండా తనకున్న గానశక్తితో అప్పటి పుష్కరాలలో పార్టీ ఏర్పాటు చేసిన అనేకానేక సమావేశాల్లో పాటలు పాడి తన భావాలకు స్పష్టత సమకూర్చుకుంది. టీనేజి దశలో విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించింది. కాకినాడలో స్టూడెంటు ఫెడరేషన్ వార్షిక జాతీయ సదస్సును దాసరి నాగభూషణరావు లాంటి గొప్ప విద్యార్థి నాయకులతో భుజం భుజం కలిపి దిగ్విజయంగా నిర్వహించింది. విద్యార్థి దశ దాటినా జీవితాంతం కమ్యూనిజాన్ని అభిమానిస్తూ అభ్యసిస్తూ నిత్య విద్యార్థిగా కొనసాగింది.

విద్యార్థి దశ దాటాక కుటుంబ కారణాల వల్ల పార్టీ రాజకీయాలకు దూరమయినా, తన జీవితంలోని ఒడిదుడుకులకు పార్టీలోని గొప్పగొప్ప నాయకులే కారకులూ మౌన వీక్షకులూ అయినా, కమ్యూనిజాన్ని, కమ్యూనిస్టు పార్టీనీ, పార్టీలోని వ్యక్తులనూ విడివిడిగా చూడగలిగిన సంతులిత సాధించుకొంది. చిట్టచివరిరోజుల్లో ఆమె చేతులు జోడించి ప్రార్థన చేయడం గమనించి, "అమ్మా నీ ప్రార్థన కోసం ఏమన్నా దేవుడి బొమ్మ ఏర్పాటు చేయమా" అని అడిగితే మండిపడింది. "నేనా! దేవుడా! నేను అలా గుర్తుచేసుకొంటున్నది వెళ్ళిపోయిన కూతురు దాసరి శిరీషను" అని వివరించింది.

## 2. ఎవరీ పరిపూర్ణా?

సహజ కళాకారిణి. అభ్యాసం లేకుండా రాగయుక్తంగా లలిత గీతాలనూ, అష్టపదులనూ పాడగల సుస్వర గాయని. చక్కని మాటతీరు, భావాలు సులభంగా పలికించే ముఖమూ, పాత్రలకు తగిన హావభావాలు ప్రదర్శించగల నేర్పూ – వీటి సాయంతో బాల్యంలోనూ, నవ యవ్వనంలోనూ నటిగా గొప్పగా రాణించిన మనిషి.

బెజవాడ హైస్కూలు రోజుల్లో పాదుకా పట్టాభిషేకం నాటికలో భరతుడిగా నటించింది. శోభనాచల పిక్చర్స్ అధినేత మీర్జాపురం రాజా చిన్నారి పరిపూర్ణ నటనను అభినందించారు. అలా 1941 ఆరంభంలో విడుదల అయిన భక్తప్రహ్లాదలో ప్రహ్లాదుడిగా నటించే అవకాశం ఆమెను వరించింది. వేమూరి గగ్గయ్య హిరణ్యకశిపుడు. చిత్రపు నారాయణమూర్తి దర్శకుడు. ప్రజలంతా బళ్లు కట్టుకుని వెళ్లి నీరజనాలు అర్పించిన సినిమా అది.

1940ల తొలినాళ్లలో, మద్రాసు విద్యాభ్యాసం రోజుల్లో రేడియోలో బాలకళాకారిణిగా రాణించిన మనిషి పరిపూర్ణ. బాలాంత్రపు రజనీకాంతరావుగారూ ఆచంట జానకిరామ్ గారూ ఆమెతో రేడియోలో పాడించి ఆ పాటలు విని రేడియో నాటకాల్లో కూడా ముఖ్యపాత్రలు ఇచ్చారు. ఆ తర్వాత రాజమండ్రి పుష్కరాల్లో దేశభక్తి గీతాలు పాడి పార్టీ సభలకు ఊతమిచ్చింది. 1950ల తొలిదినాలలో మళ్ళీ మద్రాసులో ఉంటున్నపుడు ప్రజానాట్యమండలిలో ముఖ్య కళాకారిణిగా బాధ్యత పంచుకొంది. 1952లో జనరల్ ఎలక్షన్ల సందర్భంగా పార్టీ ప్రచారం కోసం మిక్కిలినేని, గిడుతూరి సూర్యం, వల్లం నరసింహారావు, దాసరి పెరుమాళ్లు, రక్తకన్నీరు నాగభూషణం, వీరమాచనేని సరోజిని మొదలైనవాళ్ళతో కూడిన ప్రజానాట్యమండలి బృందంలో సభ్యురాలిగా గూడూరు నుంచి విశాఖ దాకా అనేక ప్రదేశాలలో కార్యక్రమాలలో పాలుపంచుకొంది. 1986లో ఓల్గా కుటుంబరావులు తాము రూపకల్పన చేసిన "ఇద్దరూ ఒక్కటే" అన్న టీవీ షార్ట్‌ఫిల్మ్‌లో తల్లిపాత్రకు ఈమెను ఎంచుకొంటే ఆ పాత్రా చక్కగా నిర్వహించింది. అనేకానేక సార్లు టెలికాస్ట్ అయిన లఘుచిత్రమది.

సభలూ సినిమాలలో పాటలు పాడటం 1950లలోనే ముగిసినా తన సంతోషం కోసం శ్రావ్యంగా పాడుకోవడం చిట్టచివరిదాకా కొనసాగించింది. మా అందరి పూనికతో 2004లో ఎంపిక చేసిన పాటలలో – అందులో తాను రాసి స్వరకల్పన చేసినవీ ఉన్నాయి – "స్వరపూర్ణిమ" అన్న రెండుగంటల క్యాసెట్‌ను విడుదల చేసింది. తెలుగు లలితగీతాలే కాకుండా మీరా భజనలూ హిందీ, తెలుగు సినీగీతాలూ – ప్రజానాట్యమండలి నాటికలలోని యుద్ధ వ్యతిరేక గీతాలూ – ఇలా అనేక స్వరాల వర్ణాల పరిపూర్ణమైన మేళవింపు ఈ 'స్వర పూర్ణిమ'.

## 3. ఎవరీ పరిపూర్ణా?

ముగ్గురు పిల్లల ఒంటరి తల్లి. పరిస్థితులకు బెదరకుండా పోరాడి గెలిచిన తల్లి. అగ్రశ్రేణి విద్యార్థి నాయకుడు వరించి వచ్చినప్పుడు ఆ పసియువతి ముచ్చటపడింది. మత్తులో మునిగింది. తమ సహజీవనం ప్రజాఉద్యమాలకు చేయగల సాయం, ఇవ్వగల ఊతం గురించి కలలు కన్నది. పరిపూర్ణ గురించి మహీధర కుటుంబంలోని ఆడవాళ్లు ఆనాడు చెప్పుకున్న మాటల్ని ఆ కుటుంబానికి చెందిన కంభంపాటి సుశీల ఒక వ్యాసంలో ఇలా నమోదు చేసారు : 'వాళ్లంతా పిల్ల గొప్పదవు తుందనుకొనేవారు. ఎలక్షన్లలోనూ, కళాకారిణిగానూ రాణిస్తుందను కొనేవారు. రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉందనుకొనేవారు'. 'వాళ్లంతా పరిపూర్ణ చిన్ననాటికే పెళ్లిలో పడటం గురించి వేసట చెందారు. పరిపూర్ణ లాంటి బాలికలు తమ కలలు సాధించి స్వతంత్ర పతాకలు వేస్తారనుకొంటే, పెళ్లికూతురుగా పరిపూర్ణ సంసార సాగరంలో పడటం వల్ల అలా ముందుకు వెళ్లడం జరగదేమోనని అనుమానించారు' అని అన్నారు కంభంపాటి సుశీల. **(ఒక దీపం – వేయి వెలుగులు, పేజ్ 264–265)**.

ఆ అంచనాలు నిజమే అయ్యాయి. తనకు పాతికేళ్లు నిండేసరికే పరిపూర్ణ ముగ్గురు పిల్లల తల్లి అయింది. సహచరుడు జాతీయ స్థాయి వామపక్ష విద్యార్థినేతగా ఎదిగాడు. వామపక్ష ఉద్యమాలు మనసునూ మేధస్సునూ పరిపూర్ణం చేసినా ముగ్గురు పిల్లల ఆకలి తీర్చలేవని గ్రహించిన పరిపూర్ణ తన అరకొర చదువుతో పిల్లల పెంపకం, పోషణ మీద సర్వశక్తులూ ఒడ్డింది. ఉపాధ్యాయినిగా సంపాదన మొదలెట్టింది. మేధస్సు నిబద్ధతతో కూడిన వామపక్షానికే చెందినా, అలవాట్లూ విలువల విషయంలో తమలోని తరతరాల భూస్వామ్య సంస్కృతిని వదిలించుకోలేని అనేకమంది ఆనాటి కమ్యూనిస్టులలానే ఆమె సహచరుడూ పిల్లల్ని ఆమె మీద వదిలి అశేష బడుగు ప్రజానీకపు సమస్యల పరిష్కారానికి మాత్రమే తన జీవితాన్ని అంకితం చేసాడు. క్రమక్రమంగా వారి దారులు వేరయ్యాయి. విడిపోయాయి.

స్వాభిమానమూ సమర్థతా పుష్కలంగా ఉన్న పరిపూర్ణ పరిస్థితులతో పోరాడింది. పరిసరాలతో పోరాడింది. తనతో తాను పోరాడింది. ఇంటర్ చదువును డిగ్రీ దాకా తీసుకువెళ్ళింది. పంచాయితీరాజ్ వ్యవస్థలో ఉద్యోగి అయింది. తర్వాత స్త్రీ శిశు సంక్షేమ శాఖలో జిల్లా స్థాయిలో లైజాన్ ఆఫీసర్‌గా పనిచేసింది. చివరి పదేళ్ళు హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసింది. ఏ ఉద్యోగం చేసినా ఆ ఉద్యోగం ఆశించే కనీస కర్తవ్యాలను – మినిమమ్ పెర్ఫార్మెన్స్‌ను – ఎంతో ఎంతెంతో దాటుకొని వెళ్లి మనసుపెట్టి పనిచేసింది. స్త్రీలు, పిల్లలు, బడుగు జీవుల అభ్యున్నతికి తన అధికార పరిధిని దాటి వెళ్ళి కృషిచేసింది. ఫలితాలు సాధించింది.

ఏ లక్ష్యం కోసమయితే పరిపూర్ణ ఉద్యోగిని అయిందో ఆ విషయంలో ఆమె సాధించిన ఫలితాలు అపూర్వం. ముగ్గురు పిల్లలూ చదువుకోవడం, చక్కని విలువలు సంచరించుకోవడం, ఉన్నత ఉద్యోగాలూ బాధ్యతలూ చేపట్టడం, సమాజానికి ఉపయోగపడే 'ఆలంబన' అన్న సంస్థను నడపడం, బాధ్యత గల రచయితలుగా పరిణమించడం, ఆమె మనమలూ మనవరాళ్లు కూడా విలక్షణ వ్యక్తులుగా పరిణమించడం – వినడానికి పుక్కిటి పురాణమనిపించే వాస్తవ గాథ ఇది. ఇలాంటి ఆధునిక పుక్కిటి పురాణాలే ఆయా వ్యక్తుల్ని జీవిస్తోన్న చారిత్రక వ్యక్తులుగా – లెజెండ్స్‌గా – మార్చుతాయి. పరిపూర్ణ విషయంలో అదే జరిగింది.

## 4. ఎవరీ పరిపూర్ణా?!

జిజ్ఞాసి. నిరంతర విద్యార్థి.

పద్దెనిమిదవ ఏట స్కూలూ కాలేజీల చదువు ముగించినా మళ్లా మరో పదహారేళ్ల తర్వాత ఆ విడచిన చదువును కొనసాగించి పట్టభద్రురాలయింది. కానీ ఆమె చదువు అక్కడితో ఆగిపోలేదు. నిరంతరం కొనసాగింది. అంతులేని విద్యాదాహం ఆమెది. ఉద్యోగం పిల్లల పెంపకం తనకు తీరికలేని జీవితాన్ని ప్రసాదించినా ఏనాడూ పుస్తకాలనూ మనుషుల్నీ చదవడం మానలేదావిడ. తన చదువును ఫిక్షన్‌కే పరిమితం చెయ్యకుండా చరిత్ర, సామాజికశాస్త్రం, తత్వశాస్త్రం, యాత్రాగాథలు, జీవితకథలు – ఇలా ప్రపంచాన్ని తెలుసుకోడానికి ఎన్నిరకాల పుస్తకాలు ఉంటాయో అన్నీ చదివింది. చివరిదాకా చదివింది. నడుస్తోన్న చరిత్రతో కలిసి అడుగులు వెయ్యడానికి వార్తాపత్రికలను – ఆంగ్లభాషవి – ఆమె వాహికలుగా ఎంచుకుంది. కొత్తపాటలు వినేది. కొత్త గాయకులను అభిమానించేది. తన తరానికి చెందిన ఎస్. రాజేశ్వరరావు, ఎస్.డీ బర్మన్లతోపాటు మలితరపు ఇళయరాజానూ, రెహమాన్‌నూ అభిమానించింది. తన జిజ్ఞాస తీరడానికి తన దగ్గరకూ, ఈ మధ్య మా అన్నదమ్ముల ఇళ్లలో ఉన్నపుడు మా ఇళ్ళకూ వచ్చే అతిథులను పలకరించి ఎన్నెన్నో విషయాలను వారినడిగి తెలుసుకునేది. వారు అడిగినవాటికి తన అనుభవంలోంచి సమాధానాలు చెప్పేది. వెళ్ళిపోవడానికి రెండు నెలల ముందు బెంగళూరులోని చిన్నకొడుకు శైలేంద్ర ఇంటి నుంచి హైదరాబాదులోని మనవరాలు తోట అపర్ణ ఇంటికి వచ్చి రెండు వారాలు గడిపినపుడు ప్రతిరోజూ అతిథులను ఆహ్వానించింది. అపర్ణ తరం వాళ్లతో అతి సులభంగా కనెక్టు అయింది. తనలోని విద్యార్థి ఆ రెండు వారాలలో ఎంతో నేర్చుకోగలిగిందని మురిసిపోయింది.

## 5. ఎవరీ పరిపూర్ణా?!

రచయితగా రాణించిన మనిషి.

తన తొంభై మూడేళ్ళ జీవితంలో సుమారు ఎనభై అయిదేళ్లు ప్రజాబాహుళ్యం నడుమన బ్రతికింది పరిపూర్ణ. ఎనిమిదేళ్ల వయసులో ప్రహ్లాద కోసం మద్రాసు వెళ్ళినపుడు ఆమె పబ్లిక్ లైఫ్ మొదలయిం

దనవచ్చు. ఆ తర్వాత గాయనిగా కళాకారిణిగా విద్యార్థి నేతగా ప్రజా కేంద్రిత ఉద్యోగినిగా బడుగుల క్షేమం కోసం పనిచేసిన వ్యక్తిగా ఆమె బ్రతుకంతా ప్రజల మధ్యనే. ప్రైవేటు జీవితం అన్న ఆలోచనే తన దగ్గరకు రానివ్వని మనిషి పరిపూర్ణ.

ఇలా ప్రజల కోసం ప్రజల మధ్యన ఉండేవాళ్లకి జీవితం గురించి ఆలోచనలూ అనుభవాలూ అనేకానేకం ఉండటం సహజం. ఆ ఆలోచనలను క్రమబద్ధంగా పేర్చే నేర్పూ, సుస్పష్టంగా వ్యక్తీకరించే భాషా ఉన్నపుడు అలాంటివాళ్ళు రచయితలు అవడం జరుగుతుంది. కానీ, వారికి కూడా ఏదో ఒక ప్రేరణా, ఏదో ఒక ప్రోత్సాహం లభించినపుడే వారిలోని రచయితలు బయటపడతారు.

పరిపూర్ణకు అలాంటి ప్రేరణా ప్రోత్సాహం వాసిరెడ్డి సీతాదేవి నుంచి లభించింది.

సీతాదేవి పరిపూర్ణకు పై ఆఫీసరుగా 1960ల నడుమ దినాలలో విజయవాడ వచ్చారు. వచ్చిన కొద్దిరోజుల్లోనే పరిపూర్ణలోని మాట్లాడగల శక్తిని గమనించారు. ప్రోత్సహించారు. ఆకాశవాణిలో పరిపూర్ణ ప్రసంగాలకు దారి ఏర్పరచారు. ఆ దారివెంట చురుగ్గా నడిచింది పరిపూర్ణ. అనేకానేక సామాజిక సాహిత్య విషయాల మీద '66-69'లలో ఎన్నెన్నో రేడియో ప్రసంగాలు చేసింది.

మళ్లీ ఆ సీతాదేవిగారే, ఇలా ప్రసంగాలకే పరిమితమవక, ఆ విషయాలను రాసి ప్రచురించు అన్నారు. అలా ఆమె తొలి వ్యాసం 1969లో ప్రచురితమయింది. ఆ తర్వాత 2024 దాకా సుమారు మూడు వందల వ్యాసాలు రాసింది. మహిళా సమస్యలు, పిల్లలు - యువతరం, విద్యావ్యవస్థ, వెర్రి ఆధునికత, శృతిలేని రాజకీయాలు, మితిమించిన మతం, తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యం, మహిళా సంక్షేమంలో 'రాజ్యం' ఆడే కపట నాటకం, మాతృభాష, శృతిమించుతోన్న పోటీతత్త్వం, కార్పొరేట్ల రాజ్యాంగేతర శక్తిత్వం, దైవాల బహుభార్యాత్వం - ఇలా అనేకానేక విషయాల మీద రాసింది. రాస్తూ వెళ్ళింది.

కొన్ని విషయాలు పాఠకుల మనస్సుల్లోకి వెళ్ళడానికి వ్యాసాల కన్నా కథలూ, నవలలూ ఉత్తమ సాధనాలు అన్న స్పృహతో 1984లో పరిపూర్ణ కథారచన ఆరంభించింది. పంచాయితీరాజ్ ఉద్యోగంలోనూ, మహిళా సంక్షేమశాఖ అధికారిగానూ తాను చూసిన కొన్ని దుష్కృత్యాలను అక్షరబద్ధం చేస్తూ "మాకు రావు సూర్యోదయాలు" అన్న పెద్ద కథ 1985లో "ఆంధ్రప్రభ" వారపత్రికలో ప్రచురించింది. ఆ కథకు మంచి స్పందన వచ్చింది. ఆ స్పందన అందించిన ఉత్సాహంతో మరో నలభై ఏళ్లపాటు కథలు రాసింది. "ఉంటాయి మాకు ఉషస్సులు", "ఎర్ర లచ్చుప్ప", "సీనుగాడి తత్వమీమాంస", "శృతి తప్పిన రాగం", "అనల్పపీడనం" మొదలైన కథలు ఆమెను కథా రచయితగా నిలబెట్టాయి. తన కథలూ వ్యాసాలను "ఉంటాయి మాకు ఉషస్సులు"(1998), "కథా పరిపూర్ణమ్" (2006), "శిఖరారోహణం" (2016) అన్న పుస్తకాలుగా తీసుకు వచ్చింది. కథలతోపాటు ఆమె దళిత సమస్యల మీద తన ఆలోచనా ధోరణి వివరించే "పొలిమేర" (2018) అన్న నవలనూ, ఒక బలహీనవర్గాల బాలిక తన మార్గం ఎన్నుకొని సాగిపోయి తనలాంటి ఎందరికో సహాయపడే స్థాయికి చెందిన వైనాన్ని వివరించే "ఆలంబన" (2023) అన్న నవలా రాసారు.

తన రచనలన్నిటికీ తలమానికం "వెలుగుదారులలో" (2017) అన్న స్వీయచరిత్ర. చిన్న చిన్న సమస్యలను కూడా తట్టుకోలేక ప్రాణాలు తీసుకునే మనుషులు ఉన్న సమాజంలో ఒక మారుమూల గ్రామపు దళిత మహిళ జీవితంతో పోరాడి గెలిచిన వైనం, పదిమందికీ వెలుగుదారి పంచిన వైనం వివరించిన ఈ ఆత్మకథ ఎంతోమందికి స్ఫూర్తిదాయక మయింది. "థాంక్సండీ!" అన్న వ్యాసంలో ఆలమూరి సౌమ్య అనే ఈ తరం మహిళ, 'వెలుగు దారులలో చదువుతున్నపుడు ఒక దీపం పట్టుకుని, దారిలో వచ్చిన ముళ్లూరాళ్లూ ఏరుకుంటూ, కాళ్లకు తగిలిన గాయాలకు మందు పూసుకుంటూ నడుస్తున్న యువతి మదిలో మెదిలింది. ఇపుడు మనం అనుభవిస్తున్న ఆ కాసిన్ని హక్కులూ అప్పణంగా వచ్చినవి కావనీ, పరిపూర్ణలాంటి మన ముందు తరాలవారు పరచిన వెలుగు దారులనీ గ్రహించడం మనకు బలాన్ని ఇస్తుంది' అంటారు. **(ఒక దీపం వేయి వెలుగులు, పేజ్ 164)**

రచయితగా పరిపూర్ణ గురించి చెప్పుకొనేటపుడు ఆమె జీవితం-సాహిత్యం-వ్యక్తిత్వం ఆవిష్కరించే "ఒక దీపం వేయి వెలుగులు" (2022) అన్న వ్యాస సంపుటిని తప్పక ప్రస్తావించాలి. ఒక చెప్పుకోదగ్గ మనిషి మరణించినపుడు వారికి నివాళిగా సంచికలు రావడం సామాన్యంగా జరిగే విషయం. అలా గాకుండా ఆ మనిషి జీవించి ఉండగానే ఆ జీవితాన్ని ఆ మనిషి సాహిత్యాన్నీ వ్యక్తిత్వాన్నీ అక్షర రూపంలో నిక్షిప్తం చేసే అత్యంత అరుదైన పని సంపాదకులు ఏ.కె. ప్రభాకర్ చేసారు. చిరకాలం దాచుకోదగ్గ సంచికకు ప్రాణం పోసారు. 'నేను నీకు పుత్రికను. నాకు మరో జన్మను ఇచ్చావు' అని పరిపూర్ణ 2023 నవంబరులో ప్రభాకర్‌ను అక్కున చేర్చుకోవడమే ఈ సంచిక నిబద్ధతకూ సమగ్రతకూ నిదర్శనం.

## 6. ఎవరీ పరిపూర్ణా?!

సాధికారత సాధించిన మనిషి. సాధికారతను నిర్వచించిన మనిషి.

సాధికారత అన్నది, ముఖ్యంగా మహిళల విషయంలో ఉన్నపళాన వచ్చిపడే భగవత్ వరప్రసాదమేమీ కాదు. అలాగే సాధికారత కావాలి అని నినాదాలు ఇస్తే వచ్చేదీ కాదు. చట్టాలు చేసినంతమాత్రాన సిద్ధించేది కాదు. స్వాభిమానం స్వావలంబన అన్న మెట్లమీద సాగి త్యాగనిరతి, సామాజిక బాధ్యత అన్న శిఖరాలను చేరినపుడే ఎవరికైనా సాధికారత సిద్ధించేది.

పరిపూర్ణ స్వతహాగా స్వాభిమానం గల మనిషి. 'ఎవరితోనూ మాట పడేదికాదు' అంటారు తన 60ల నాటి సహోద్యోగి లీలగారు. స్వాభిమానమన్నది - అందులోనూ మహిళలకు, అందులోనూ దళిత మహిళలకు - ఉండరాని లక్షణంగా ఉండే 1940లు 50లలో పరిపూర్ణ స్వాభిమాన సమన్విత అవడం వెనక అనేక సామాజిక కారణాలు ఉన్నాయి. తల్లిదండ్రుల అక్షరాస్యత, వారి ఉపాధ్యాయ ఉద్యోగం, అన్నల అభ్యుదయభావాలు, పథాలు, ఆ అన్ననే పరిపూర్ణకు పరచిన దర్శి చెంచయ్య ప్రాపకంలాంటి వెలుగుబాటలు, మహీధర కుటుంబంతో సాన్నిహిత్యం, వామపక్ష ఉద్యమాలు - ఇన్ని సామాజిక అంశాలతో పాటు పరిపూర్ణలోని సహజ లక్షణాలైన తెలివి, నిర్భీతి, చొరవ తోడుగా నిలిచి ఆమెను స్వాభిమాన పతాకగా మలచాయి.

ఆ స్వాభిమానమే ఆమెను అననుకూల పరిస్థితుల్లో ‘తన మార్గం’ వెదుక్కొనేలా చేసింది. అందుకు ఊతం ఇచ్చింది. ఆ మార్గం పట్టాక అందులో సాగిపోయి స్వావలంబన సాధించడానికి ఆ ఆత్మాభిమానం బలమైన పునాది అయింది. అరకొర అర్హతలతోనే ఉద్యోగ విజయాలు సాధించే మనిషిగా తీర్చిదిద్దింది.

పరిపూర్ణ స్వభావరీత్యా పరోపకారి. మనుషులంటే అక్కర ఉన్న వ్యక్తి. తన జీవితం ఒడిదుడుకులతో సాగినా బంధుమిత్రులూ వారి పిల్లలూ చదువుకోడానికీ, ఉద్యోగాల్లో స్థిరపడడానికీ శృతిమించి సాయం చేసిన మనిషి పరిపూర్ణ. ఏమీ తెలియనివారికి కూడా చివరిదాకా చేయూతనందించిన మనిషి. పేదవారి పక్షపాతి. ఇలాంటి లక్షణాలున్న మనిషి, వాటికి తోడుగా స్వాభిమానం, స్వావలంబన సాధించిన మనిషి సాధికారత సంతరించుకోవడం ఎంతో సహజంగా జరిగిపోతుంది. ఆ సాధికారత తన వ్యక్తిగత ప్రయోజనాలకు గాకుండా సమాజ క్షేమానికి దోహదపడటం జరుగుతుంది. పరిపూర్ణ సాధించిన సాధికారత – సాఫ్ట్ పవర్ – సిద్ధాంతపరమైనదేగాదు – ఆచరణలో ఫలితాలు సాధించగల శక్తి గల సాధికారత తనది. ఆ సాధికారతే ఆమెకు ఇరుగుపొరుగుల విషయంలో, తాను నివసించిన కమ్యూనిటీ సమస్యల విషయంలో, తాను తపించిన మహిళలూ పసిపిల్లల సమస్యల విషయంలో ప్రత్యక్షంగానూ, రచనల ద్వారానూ అధికారులతోనూ వ్యవస్థలోనూ పోటీపడి పోరాడి గెలిచే పటిమను అందించింది.

## 7. ఇంతకీ ఎవరీ పరిపూర్ణ?

ఒక కాలాతీత వ్యక్తి. ప్రపంచపు ఉమ్మడి ఆస్తి.

నిన్న మొన్నటిదాకా నాకు పరిపూర్ణ ఒక కుటుంబానికి చెందిన మనిషి అన్న అపోహ ఉండేది. తన కార్యకలాపాల పరిధి అతి పరిమితం అన్న అపోహ ఉండేది. తనకు ఎనభై అయిదేళ్ల వయసులో రాసి ప్రచురించిన ఆత్మకథ “వెలుగుదారులలో” చూసాక, దానికి వచ్చిన ఆలమూరి సౌమ్యల స్పందనలు చూసాక పరిపూర్ణ ఒక కుటుంబానికే చెందిన మనిషి కాదు, పదిమందికీ చెందిన మనిషి అన్న అభిప్రాయం కలిగింది. జనవరి 26, 2024న ఆమె పోయాక వెల్లువెత్తిన అభిమాన స్వరాలు విన్నాక అది అనుమాన పడాల్సిన విషయం కాదు, అది ఒక వాస్తవం అన్న గ్రహింపు కలిగింది.

ఆమె గతం గురించి వర్తమానంలో రాయలేదు. ఆమె గతంలోనూ వర్తమానంలోనూ మాత్రమే జీవించలేదు. భౌతికంగా వెళ్ళిపోయాక కూడా తమ తమ వెలుగు పుంజాలను స్థల కాల ప్రాంత పరిధిలకు అతీతంగా అజేయంగా ప్రసరించే వ్యక్తుల కోవకు చెందిన మనిషి పరిపూర్ణ. వారికి మరణం ఉండదు. మరణించినా జీవించి ఉండే మనుషులు వాళ్లు. కాలాతీత వ్యక్తులు వాళ్లు.

పరిపూర్ణ అలాంటి కాలాతీత వ్యక్తి.

ప్రపంచపు ఉమ్మడి వారసత్వ సంపద పరిపూర్ణ. ✺

# భారత నాస్తిక సమాజ సంస్థాపకుడు జయగోపాల్ మరణానికి సంతాపం



**భారత** నాస్తిక సమాజం (1972), సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (2004) సంస్థల సంస్థాపకులలో ఒకరు, ప్రముఖ నాస్తిక ప్రచారకుడు, రచయిత జయగోపాల్ తన 77వ యేట దీర్ఘ అనారోగ్యానంతరం 07-02-2024న విశాఖపట్నంలో మరణించారు. ఆయన విశాఖలో 02-11-1947న జన్మించారు.

తన 16వ యేటకే జయగోపాల్, ఇంగర్సాల్, చార్లెస్ బ్రాడ్లా, అంబేద్కర్, పెరియార్‌ల రచనలతో ప్రభావితులయ్యారు. తన తల్లిదండ్రులు పాటించే ఆచారాలు, సంప్రదాయాలు, అస్పృశ్యత మొదలైనవాటిని వ్యతిరేకించి తిరుగుబాటు చేసి కులం నుంచి వెలివేయబడ్డాడు. వాటన్నిటినీ అధిగమించి స్వయంకృషితో ముందుకు సాగాడు.

జయగోపాల్ 1972 నుండి 2014 డిసెంబరు వరకు 450 పైగా ప్రసంగాలు గ్రామాలలో, స్కూళ్ళలో, కళాశాలల్లో చేశారు. ఆయన ఇంగ్లీషులో 7, తెలుగులో 28 పుస్తకాలు రచించారు. తెలుగులో ‘నాస్తికయుగం’ అనే మాసపత్రికను 1974 నుండి 2011 వరకు కొంతకాలం చార్వాక రామకృష్ణతో కలిసి నడిపారు. 1974-1976లలో ఇంగ్లీషులో ద్వైమాసపత్రిక ‘ది ఏజ్ ఆఫ్ ఎథీయిజం’ నడిపారు. జయగోపాల్ ఇంగ్లీషులో రాసిన ‘ది మిజరీ ఆఫ్ ఇస్లామ్’ జర్మనీ, పోలిష్ భాషల్లోకి అనువదింపబడి, జర్మనీలో విడుదలై నాలుగు ముద్రణలు పొందింది. ఆయన పలు అంతర్జాతీయ సంస్థలలో సభ్యత్వం పొంది, వారి పత్రికలలో రచనలు ప్రచురించారు. 2005లో ‘పెన్ ఆఫ్ బ్రేవ్ మైండ్స్’ అవార్డు అందుకున్నారు.

వివిధ సామాజిక సమస్యలపై స్పందిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించారు. దళితులపై దాడులను ఖండించారు. మత సామరస్యం ప్రబోధించారు. వారి సహచరి శారద 2020లో మరణించారు. జయగోపాల్ కళ్ళను ఐ బ్యాంకుకు, శరీరాన్ని ఆంధ్రా మెడికల్ కళాశాలకు అప్పచెప్పారు. వారి మరణానికి ‘ప్రజాసాహితి’ సంతాపాన్ని ప్రకటిస్తోంది. వారి కుమారులకు, కుమార్తెకు సానుభూతిని ప్రకటిస్తోంది. ✺

## నంబూరి పరిపూర్ణ సంస్మరణలో....



# మా ఉక్కుమహిళ

- మనోజ నంబూరి

**నాన్న** నా బాల్యంలో ప్రతి వేసవికి నన్ను అత్తయ్య దగ్గర వదిలేవాడు. అమ్మ సణుగుతూ ఉండేది. ఆ పిల్ల వయసెంతనీ.... అలా తిప్పుతున్నావూ.. అంటూ. అక్కడ పక్క పక్కనే నివాసాలున్న పూర్ణత్తయ్య, ఇంకా నాకెంతో ఇష్టమైన శిరీషొదిన, (తన కూతురు, రచయిత్రి దాసరి శిరీష) తన పిల్లలు.. సరదాగా ఉండటానికే కదా! అనుకున్నాను.. కానీ నాన్న ఒరిగిపోయాక గానీ అర్థం కాలేదు.. ఓ టెన్త్ పూర్తిచేసిన ఆడపిల్లకి, ప్రపంచాన్ని ఎలా చూడాలో... మనుషులను ఎలా వినాలో.... మనుషులను ఎంత ప్రేమించాలో.. మనసులను ఎలా చదవాలో.... జీవితాన్ని ధైర్యంగా ఎలా దాటాలో.... సమాజం పట్ల బాధ్యతలు ఎలా నెత్తికెత్తుకోవాలో.... పాజిటివ్‌గా ఎలా ఉండాలో.. ఇంకా ఏం పుస్తకాలు చదవాలో.. చూసి నేర్చుకోవటానికే ఒన్ ప్లస్ ఆఫర్‌లాగా అత్తయ్య, ఒదినల వద్ద వదిలేవాడని! తన కూతురు వ్యక్తిత్వం రూపుదిద్దుకునే సమయంలో అక్కడ తన ప్రియ సోదరి పరిపూర్ణ సహవాసం ఎంతో తోడ్పడుతుందనే గొప్ప ఆలోచన నాన్నది!

పరిపూర్ణత్తయ్య తరువాత పుట్టినవాడు మా నాయన జనార్దన. పెద్దన్న నంబూరి శ్రీనివాసరావు స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన యువకునిగా నెహ్రూ దృష్టిలో పడినవాడు. ఆదర్శ రాజకీయ నాయకుడు. కమ్యూనిస్టు. రెండు మార్లు ఎమ్.ఎల్.ఏ. అయిన ఆయన పి.వి.నర్సింహారావు, దర్శి చెంచయ్య, గుర్రం జాషువా లాంటి గొప్ప వ్యక్తులతో స్నేహ బాంధవ్యాలు గరిపినవాడు కవి. జైల్లో ఉండి కూడా సోదరి విద్యాభ్యాసం గురించి తండ్రివలె బాధ్యతపడిన వ్యక్తి.

పరిపూర్ణ రెండో అన్నయ్య దూర్వాసుడు, అక్కినేని నాగేశ్వరరావుతో గండపెండేర సన్మానం గ్రహించిన పెద్ద కవి.

మా నాన్న జనార్దన అత్తయ్యకెంతో ప్రియమైన సోదరుడు. వారిది ప్రత్యేక బంధం, కష్టకాలాల్లో ఆవిడకు ఈయన ఆసరా.... ఒడిదుడుకులలో ఈయనకి ఆవిడ చేయూతగా మెలగడం.... యువకులుగా, కమ్యూనిస్టు పార్టీ చురుకైన కార్యకర్తలుగా వీరిద్దరి సాహసాలూ.... రాస్తే ఒక పుస్తకమౌతుంది.

తన జీవితాన్ని అక్షరబద్ధం చేస్తూ రాసిన స్వీయ చరిత్రలో కమ్యూనిస్టు నాయకుడు దాసరి నాగభూషణంతో సంసారం, అందులో తీవ్ర ఒడిదుడుకులు, ఆ బంధం వద్దనుకుని, ముగ్గురు పసివారితో ఒంటరి పోరాటం, సింగిల్ మదర్‌గా తన చదువును కొనసాగించి, ఆపై ఉమెన్ వెల్ఫేర్ అధికారిణిగా ఎదగటం, పిల్లలు ముగ్గురినీ ప్రయోజకుల్ని చేయటం, ఎంతో నిజాయితీగా రాసింది అత్తయ్య.

రజాకార్లకూ, ప్రభుత్వాలకూ తీవ్రమైన అంతర్యుద్ధం జరుగుతూ, విద్యార్థి నాయకులపై కూడా నిషేధం నడుస్తున్న ఆ కాలంలో విద్యార్థి నాయకుడైన దాసరి తన సహచరి పరిపూర్ణతో సహా అజ్ఞాతవాసం చేయవలసి వచ్చినపుడు పార్టీ కరపత్రాలు, విప్లవ సాహిత్యం తీసుకుని ఓ రాత్రి రిక్షాలో వెళుతుండగా ఇద్దరు పోలీసులు అనుమానంతో అత్తయ్య వెంటపడి, స్టేషనుకి నడవమని ఎస్కార్ట్‌లా ముందు సైకిళ్ళపై వెళ్ళసాగారట. అపుడు తను ఎంతో చాకచక్యంగా సంచిలోని కాగితాలన్నీ మురికి కాలువలోకి విసిరేసిందట. అయినా తనని తీసికెళ్ళి సెల్‌లో కూర్చోమన్నారట. కానీ అక్కడెవరో మూత్ర విసర్జన చేసిన దాఖలాలు వుండటంతో తానక్కడ కూర్చోలేనని నిరాకరించగా, అక్కడి రైటర్ చాచి తన చెంపపై కొట్టాడట. పరిపూర్ణ వెంటనే అతని కాలరుపట్టి గుంజి బెబ్బులిలా అతని గుండెలపై గట్టిగా గుద్దిందట. మిగిలిన కానిస్టేబుళ్ళు వచ్చి విడదీసేంతవరకూ వదలలేదట. అపుడు తనని ఓ వారం గుంటూరు జైలులో ఉంచారట. అంతకు పూర్వం విద్యార్థి సంఘం కార్యకలాపాల్లో కూడా అరెస్టై, 26 రోజుల జైలు జీవితాన్నీ గడిపిన అనుభవం తనది. ఇలాంటి ఎన్నో అనుభవాలతో కూడిన తన స్వీయచరిత్ర 'వెలుగు దారుల్లో' అనే పుస్తకం తన 84వ ఏట రాసుకొచ్చింది. మేథావుల మన్ననలు పొంది 2017న మొదటి ముద్రణైతే, ఇపుడు మళ్ళీ 2024లో రెండవ ముద్రణకు నోచుకుంది.

ఈ స్వీయ చరిత్రలో మా నాన్న గురించి ఇలా రాసుకున్నది. "నా ప్రియ సోదరుడు, స్నేహితుడు అయిన జని మరణవార్త వినగానే తీరని దుఃఖం కమ్ముకున్నది. ఎపుడో మమ్మల్ని వదిలి వెళ్ళిపోయిన మా అమ్మా, నాయన, ఇద్దరు అన్నయ్యలు ఇపుడే, మళ్ళీ అంతా ఒక్కసారిగా వెళ్ళిపోయినట్టు తీవ్రమైన వెలితితో ఒణికిపోయాను" అని.

మా వంశ వృక్షంలోనే ఉక్కుమహిళ పరిపూర్ణ అత్తయ్య. అంబేద్కర్ ప్రవచించిన 'చదువే తలరాతలు మారుస్తుంది, కష్టాలను తీరుస్తుంద'నే మాటను ఆచరించి, మా అందరికీ అదేమాట నూరిపోసేది. తలరాతలు రాసే అవకాశం వేరేవారికివ్వకుండా, తను నిలబడింది, పిల్లలనూ తీర్చిదిద్దుకుంది. మహిళల స్వావలంబనకు పాటుబడే తన ఉద్యోగ సమయంలో గ్రామ గ్రామాల్లో తిరుగాడి మహిళలు అనుభవిస్తున్న ఎన్నో వెతలనీ, హింసనీ, అభద్రతనీ చూసిన అనుభవంతో....

"బలవంతులైనవాళ్ళెప్పుడూ బలహీనులను క్రూరంగా అణిచి వేస్తుంటారు. భార్యలపై హింస, చంపటం, ఆడవారిపై అత్యాచారాలు పీడనలోని క్రూరభాగాలు! "పులుల్ని బలి ఇవ్వరనీ, మేకల్ని మాత్రమే బలిస్తారనీ" అంబేద్కర్ అలనాడె సెలవిచ్చారు. దీనికి విరుగుడు ఒక్కటే! ప్రతి మహిళా చదువుకుని, ఉద్యోగమో, ఏదైనా సంపాదనార్హమైన పనో చేస్తూ స్వతంత్రంగా ఉండటమే!" అంటూ చాలా స్పష్టమైన పిలుపునిచ్చింది.

ఈ మాటలు ఆవిడకు అనుభవమైన, తను కంటితో చూసిన ...ఈనాటికీ మార్పులేని గృహహింస బాధితులకు గీతోపదేశం వంటివి.

చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, తనకు మూడు నెలలు సంగీతం నేర్పిన మాస్టర్ వేణు, తనతో "భక్తప్రహ్లాద"లో నటించిన అశ్వద్ధామ, పుండరీకాక్షయ్య, జి.వరలక్ష్మి, రేడియోలో ఎన్నో ప్రోగ్రాములు చేయించిన బహుముఖ ప్రజ్ఞాశాలి బాలాంత్రపు రజనీకాంతరావుగారూ ఇలా చెబుతూ పోతే ఎందరో గొప్ప మనుషులతో గల సాంగత్యం వల్లనూ, నిజాయితీ, క్రమశిక్షణ గల నిరాడంబర జీవితం వల్లనూ.. తన ప్రతీమాట ఎంతో విలువగా, మధురంగా మాకో విజ్ఞాన గనిగా ఉండేవి. ఒక్క వ్యాసంగా ఆవిడ జీవితపు వ్యాసంగాలను కుదించటం కుదరని పని. పదేళ్ళకు నటనే గాదు, 74 ఏళ్ళ వయసులో కారు డ్రైవింగ్‌కు కూడా వెళ్ళింది.

'నువు ఎంత పొట్టిగానైనా ఉండు. కానీ నిటారుగా నిలబడు' అనే ఈ మహిళ ఏ సందర్భం అయినా తలెత్తుకునే నడిచింది అనటానికి సందేహమేముంది?!

ఇక నాలాంటి తన వెనుక తరాలమంతా ఆమె పరిచిన వెలుగుల దారుల్లో నిర్భయంగా, నిటారుగా నడిచిపోవటమే..చేత పరిపూర్ణ ఆత్మగౌరవ జెండాను గర్వంగా ఎగరేసుకుంటూ! అందరికీ ఓ హీరో ఉండొచ్చు.. మాకు మాత్రం మా పరిపూర్ణ అత్తయ్యే ఎన్నటికీ షీరో!. ✺

# ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

## సంచిక : 8 సంపుటి : 17 మార్చి 1994

**"అగ్గిలాగ** మండరండి సంకెళ్ళను తెంచరండి" జాతీయ మహిళా కాన్ఫరెన్సు సందర్భంగా పి.ఓ.డబ్ల్యు (స్త్రీ విముక్తి) వారు ప్రచురించిన కార్డు కాలెండరు ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల జూట్ మిల్లు కార్మికులపై పోలీసుల కాల్పులను నిరసిస్తూ – సూర్యతేజ రాసిన కవిత "లే! నెల్లిమర్లా లేలే!!" కవితను రెండవ కవర్ పేజీలోనూ, అల రాసిన కవిత "తీతువు పిట్ట పాట"ను మూడవ కవరు పేజీలోనూ, కా॥ దేవయ్యపై కరీంనగర్ పోలీసుల అఘాయిత్యానికి ప్రతిస్పందిస్తూ – పోగుల రాజన్న రాసిన కవిత "ప్రకృతి విరుద్ధం" నాల్గవ కవరు పేజీలోనూ ప్రచురించారు. "ఖాకీ సామ్యం" అనే సంపాదకీయంలో ప్రజలు ప్రజాసంఘాలపై పోలీసుల పైశాచిక దాడుల గురించీ ప్రజలూ ప్రజాస్వామికవాదులు, ఉద్యమకారులూ పౌర ప్రజాస్వామ్య హక్కులకై ఉద్యమించాల్సిన అవసరాన్ని తెలియచేశారు. రవిబాబు అనువాదం చేసిన మావో వ్యాసం "కుమారి ఛావో ఆత్మహత్య గురించి", కరీంనగర్ సదస్సులో అరెస్టుల నిర్బంధాల మధ్య "కరీంనగర్ పోరాట ప్రత్యేక సంచిక" ఆవిష్కరణ వార్తగా ప్రచురించారు. మార్చి 23 భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా జనసాహితి ప్రచురణ "నా నెత్తురు వృధా కాదు" భగత్‌సింగ్ రచనల నుండి "విప్లవ తేజస్వి కామ్రేడ్ భగత్‌సింగ్‌కు అరుణారుణ జోహార్లు" వ్యాసాన్ని ప్రచురించారు. కాత్యాయనీ విద్మహే "రావిశాస్త్రి రచనలలో స్త్రీలు" వ్యాసాన్ని, బమ్మిడి జగదీశ్వరరావు కథ "యాత్ర", "నెల్లిమర్ల కార్మికుడా! వీరుడా!" అనే ఆర్. రామకృష్ణ కవిత, డాక్టర్ కిరణ్మయి అనువాదం చేసిన "తస్లీమా నస్రీన్ రాసిన – మతోన్మాదులను ప్రభుత్వం ఎందుకు శిక్షించదు?" వ్యాసాన్ని ప్రచురించారు. కుటుంబ పరిస్థితులూ స్త్రీలను చదువుకు ఎలా దూరం చేస్తున్నాయనే అంశంతో – వి.వి. కృష్ణమూర్తి రాసిన "చదువు – స్త్రీలు" వ్యాసాన్నీ, ఎం.జి.యం. రాసిన గల్పిక "సామ్రాజ్య పీడనెదురిద్దాం"నూ, న్యాయవ్యవస్థపై సడలుతున్న నమ్మకాన్ని పునరుద్ధరించే ప్రయత్నం అంటూ వి. పద్మ రాసిన "ఊర్మిళ" చిత్ర సమీక్ష ప్రచురించారు.


నిరంజన్ రాసిన "అశ్లీల బూతును అంతం చేద్దాం" కవితనూ, టైమ్స్ ఆఫ్ ఇండియా నుండి ఉదయరేఖ అనువాదం చేసిన "నెల్సన్ మండేలాతో ముఖాముఖి" – షబానా అజ్మీ ఇంటర్వ్యూను, "పిల్లల ప్రపంచం" శీర్షికన పి. చంద్రశేఖర్ అజాద్ బాలలు రాసిన రెండు కవితలను పరిచయం చేశారు. కా॥ పీర్ సాహెబ్ అకాల మృతికి పరితపిస్తూ శాంతికుమార్ రాసిన ఎలిజీ "వైపరీత్యం"నూ జనసాహితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కా॥ పీరు సాహెబ్ అకాల మరణానికి జనసాహితి సంతాపాన్ని ప్రకటించారు. 'కామోత్సవ్' సీరియల్‌పై సుప్రీంకోర్టులో పిటిషను దాఖలు వివరాలు ప్రచురించారు. "కరత్రాలు – కదిలేచరిత్ర" శీర్షికన "సాంస్కృతిక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అఖిల భారత సదస్సును జయప్రదం చేయండి!" కరపత్రాన్ని ప్రచురించారు. దివికుమార్, ఉదయ్‌ల రచన "పోరాటాల రాజవ్వ" (వీధినాటికా కథనం) ప్రచురించారు. "1/70 చట్టం రద్దు ప్రయత్నాలను త్రిప్పికొట్టండి, అడవి నిర్మూలన – గిరిజనుల హక్కులు" సమస్యపై మహబూబాబాద్ కేంద్రంలో మార్చి 17న సదస్సు' 18 నాడు జరిగే బ్రహ్మాండమైన ర్యాలీ, బహిరంగసభలను జయప్రదం చేయండి. అనే ఆం.ప్ర. రైతు–కూలీ సంఘం పిలుపు కరపత్రాన్ని ప్రచురించారు.

1/8 డెమ్మీలో 68 పుటలు. వెల : రూ.5/–

✺

సమీక్ష

**ఇది లెనిన్ శత వర్ధంతి సంవత్సరం....**



# లెనిన్ కావ్యం

## మయకోవ్‌స్కీ రాసిన కావ్య పరిచయం

- దాదాహయాత్

**(గత సంచిక తరువాయి)**

కార్ల్‌మార్క్స్ తుది సందేశం గురించి మయకోవ్‌స్కీ ఇలా రాశాడు –

"సిద్ధాంతాలకు రుజువు
ఆచరణలో కనిపించాలి
ఆచరణలో దారి చూపేవాడు
త్వరలోనే వస్తాడు
పుస్తకాల నుంచి యుద్ధ రంగాలకు
అస్తవ్యస్త జీవుల్ని నడిపిస్తాడు"

అప్పటికి పదిహేనేళ్ళకు ముందు –

యూరప్‌ను కమ్యూనిజం అనే
భూతం ఆవహించింది
ఒకసారి వెనుకంజ వేసి
మళ్ళీ విజృంభించి
భూవలయం అంతటా
సంచరించింది
ఈ యీ కారణాలన్నింటివల్లా
ఎక్కడో దూరాన వున్న
సింబిర్స్కులో జన్మించాడు
లెనిన్ అనే అందరిలాంటి శిశువు

కార్ల్‌మార్క్స్ భౌతికంగా మరణించిన రెండేళ్ళ తర్వాత ఒక సంఘటన జరిగింది. ష్లిస్సెల్ బుర్గ్ కోటలో అలెక్సాండ్ర్ ఉల్యానోవ్ అనే వ్యక్తిని జారు చక్రవర్తి ఉరి తీయించాడు. 'నరోద్నయా వోల్యా' (ప్రజాస్వేచ్ఛ) విప్లవ సంఘంలో అలెక్సాండ్ర్ ఉల్యానోవ్ సభ్యుడు. జారును హత్య చేయడానికి ప్రయత్నించినందుకు కోర్ట్ మార్షల్ చేసి అతిన్ని ఉరితీశారు. మయకోవ్‌స్కీ ఆ సంఘటన గురించి ఇలా రాశాడు –

అలాగే అలెక్సాండ్ర్ ఉల్యానోవ్
ఒక రాత్రి
ష్లిస్సెల్ బుర్గ్ కాగడాల వెలుగులో
ఉరితీయబడ్డాడు
అప్పుడతని తమ్ముడు
పదిహేడేళ్ళ ఇల్యీచ్
ప్రతిజ్ఞ చేశాడు
చండప్రచండంగా!
'సోదరా!
సత్యం కోసం జరిగే ఈ
సమరాన్ని మేం సాగిస్తాం
విజయాన్ని సాధిస్తాం
కాని వేరే మార్గాలలో'

అతడే వ్లదీమీర్ ఇల్యీచ్ లెనిన్.
కమ్యూనిస్టు కార్యాచరణ పథనిర్దేశకుడు.

★ ★ ★ ★

'లెనిన్' కావ్యం ఎంతో ఉద్వేగభరితమైంది. ఏకాగ్రతతో చదివేవారికి ఎన్నో విషయాలు తెలియజేస్తుంది. మరెన్నో అనుమానాలు నివృత్తి చేస్తుంది. ఇది ప్రాపగాండా కవిత్వమని ప్రచారం జరిగింది. అలా అంటారని మయకోవ్‌స్కీకి ముందే తెలుసు.

నాకు తెలుసు
మీ విమర్శకులు బెత్తాలు పుచ్చుకుని
మీ కవీశ్వరులు
గొంతులు చించుకుని
'అబ్బే! ఇదేం కవిత్వం?
ఉత్త ప్రచారం
ఒక రసమా పాడా? ఏం లేదు
కేవలం నిస్సారం' అంటారు.
నిజమే
'ధనస్వామ్యం' అనేదంత వీనుల
విందైన మాట కాదు.
'కోకిల' అనే మాట ఎంత
ఘుమాఘుంగా ఉంటుంది!
అవసరం వచ్చినపుడు
అదీ రాస్తానులెండి
ఇప్పటి మటుకు నా గీతాలు
సమరనాదాల్లా ప్రతిధ్వనించనియ్యండి

'మహాప్రస్థానం' తర్వాత శ్రీశ్రీని కూడా అలాగే కొంతమంది వెంటాడారు. మయకోవ్‌స్కీ చెప్పిన సమాధానమే శ్రీశ్రీకీ వర్తిస్తుంది. 'కమ్యూనిజం నా హృదయం, అది వినా నాకు ప్రేమ లేదు' అని చాటుకున్న నిబద్ధ కవి మయకోవ్‌స్కీ. శ్రీశ్రీ కూడా చాలాసార్లు అదే మాటన్నాడు.

లెనిన్ కావ్యాన్ని మయకోవ్‌స్కీ ఆశ్వాసాలుగా విభజించలేదు. అయితే స్థూలంగా మూడు భాగాలుగా మనం విభజించుకోవచ్చు. కార్మికవర్గ నాయకుడిగా లెనిన్ అవతరణ వరకూ ఒకభాగం. లెనిన్ నాయకత్వంలో రష్యాలో విప్లవజ్వాల ఎలా వర్ధిల్లిందీ వర్ణించేది రెండవ భాగం. విప్లవం విజయవంతమయ్యాక లెనిన్ తన అపార మేధాసంపత్తిని ఉపయోగించి తిరోగమనం నుంచి కాపాడటం, ఆ తర్వాత లెనిన్ అమరుడు కావడం, ప్రపంచవ్యాప్తంగా పీడిత ప్రజానీకానికి శాశ్వతమైన ఆశాజ్యోతిగా నిలిచిపోవడం వరకూ మూడవ భాగం. ఇంతవరకూ మనం సమీక్షించుకున్నది మొదటి భాగం వరకే. రెండవ భాగం పార్టీ నిర్మాణ కార్యక్రమంతో ప్రారంభమవుతుంది.

ఎన్నెన్నో సన్నని బలహీనమైన
గొంతుకలన్నీ కలిసి
ఒకే ఒక హోరెత్తే తుఫాను ఘోష పార్టీ
ఫిరంగుల మ్రోతలకు
చెవులు గింగుర్లెత్తేలాగ
దాని గర్జనకి శత్రువుల కంచుకోటలు
బద్దలవుతాయి

ఒక వ్యక్తి మాత్రమే అయితే
ఓటమి పాలవుతాడు
ఒంటరి వ్యక్తి తుఫాన్‌ను
సృష్టించలేడు

పార్టీ అంటే ఏమిటి
పదిలక్షల వేళ్ళ చెయ్యి
ఈ వేళ్ళు ఒక పిడికిలిగా బిగిస్తే
దాని దెబ్బకెదురు లేదు

ఎంత పటిష్ఠంగా పార్టీ నిర్మాణం జరిగినా విప్లవ కార్యాచరణ అంత సులువైన పని కాదు. జారు చక్రవర్తి సైనికుల్ని ప్రయోగించి ఉక్కుపాదంతో అణచడానికి పూనుకున్నాడు. భయంకరమైన హింసకు పాల్పడ్డాడు. ఒక్క మాటలో చెప్పాలంటే, "కార్మికుల రక్తనదిలో ఈదుతున్నాడు". మతమనే అడ్డుగోడ ఎదురయ్యింది. పార్టీలోనే ఆంతరంగిక శత్రువులు తలెత్తారు.

సర్వాంతర్యామి ఇల్యీచ్
1905 పొడుగునా
కార్మికులతో భుజం కలిపి
ప్రతీ బారికేడ్ పక్కను నిలిచి
అనుదినం పోరాడుతూనే వున్నాడు
విప్లవానికి తన దీక్షాదక్షతతో
జవం జీవం పోస్తూనే ఉన్నాడు

ఎప్పటికప్పుడు విద్రోహాలు ఎదురయ్యాయి. నిరాశలు మిన్నుముట్టాయి. విప్లవం నిజంగానే విజయవంతమవుతుందా? అనుమానాలు మొదలయ్యాయి. కామ్రేడ్ లెనిన్ ప్రవాసానికి వెళ్ళాల్సి వచ్చింది.

మళ్ళీ లెనిన్
మరోమారు
ప్రవాస జీవితాన్ని
పాఠశాలగా మారుస్తాడు
రాబోయే పోరాటానికి
మనందరికీ పాఠాలు నేర్పుతాడు
ఇతరులకు నేర్పడంలో
తన జ్ఞానాన్ని పెంచుకుంటాడు
చెల్లాచెదరైన పార్టీని
మళ్ళీ కూడదీసుకుంటాడు

ఎన్నో ఉద్విగ్నభరితమైన సంఘటనల తర్వాత, మరెంతగానో ఓర్పును పరీక్షించే ఘర్షణలూ, సంఘర్షణల తర్వాత –

'లెనిన్ మన మధ్య ఉన్నాడు
జిందాబాద్ లెనిన్!'
చప్పట్లు కొడుతున్న వందలాది జనం మీదుగా
దారి చూపే తన చెయ్యెత్తి
'కామ్రేడ్స్' అని ప్రారంభించాడు లెనిన్.

చరిత్రలో మొదటిసారి
ఏ హడావుడీ లేకుండా
తబ్బిబ్బుగా చూస్తున్న
మానవ మహాసముద్రం ఎదుట
ఒకనాడు అసాధ్యమని తోచిన
సామ్యవాదం
ఆచరణయోగ్యంగా నిలిచింది.

అక్టోబరు విప్లవం గురించి మయకోవ్‌స్కీ ఇలా అంటాడు –

నా యావజ్జీవితంలో అత్యంతం అమోఘమైన
దినం ఏదని వెనక్కి చూస్తే
నా అనుభవాలనూ చూసిన విషయాలనూ
గాలించి వెతికితే
నిస్సందేహంగా నిర్వివాదంగా
ఆరోజు అక్టోబరు 25, 1917 అనే అంటాను.

అక్టోబరు విప్లవం విజయవంతమైనా ఎన్నో సవాళ్ళు ఎదురుగా నిలిచాయి. మయకోవ్‌స్కీ మాటల్లో –

విజయం సాధించాం
కాని మన నౌకకన్నీ
కన్నాలే, పగుళ్ళే
అన్నీ శిథిలశకలాలే
ఇంజన్లు ఎంతోకాలం
పనిచేసేలా లేవు

కిందా, పైనా, గోడలకీ
మరమ్మత్తులు చేయాలి

లెనిన్ చాకచక్యమంతా అప్పుడక్కరకొచ్చింది. లెనిన్ లేకపోయుంటే – డెబ్బయి ఏళ్ళ తర్వాత 1991లో ఎదురైన చేదు అనుభవం అప్పుడే ఎదురై వుండేది. కానీ లెనిన్ గెలిచాడు. విప్లవాన్ని కాపాడుకోవడంలో కృతకృత్యుడయాడు. 1991కి ఇక్కడ స్థానం లేదు.

లోకమంతా
ఫ్యాక్టరీ గొట్టాల అరణ్యాలలో
బ్రహ్మాండమైన ఎర్ర చౌకు
లక్షలాది చేతులు జెండా కొయ్యగా మారి
మహోద్వేగంతో గాలిలో తేలుతుంది
ఆ పతాకంతో
అందులోని అన్ని మడతలతో
మరోసారి సవాల్ చేస్తూ
నడిపిస్తాడు లెనిన్


వ్లదీమీర్ ఇల్యీచ్ ఉల్యానోవ్ ఇప్పటికి వందేళ్ళ క్రితం భౌతికంగా మరణించి వుండొచ్చు. కానీ కామ్రేడ్ లెనిన్ ఎప్పటికీ జీవించే వుంటాడు.

కార్మికులారా!
అంతిమ యుద్ధానికి సన్నద్ధులు కండి
బానిసలారా!
బోరవిప్పి నిలవండి
వెన్ను విరిచి నడవండి
పీడితజన సేనా నివహమా
అఖండశక్తితో లేచిరా!
విప్లవం వర్ధిల్లాలి
విజయం వేగం సాధించాలి
చరిత్రలో సాగిన అన్ని యుద్ధాల కన్నా
ఇదే గొప్ప యుద్ధం
ఇదే న్యాయమైన సమరం

'లెనిన్' కావ్యంలో ఇవే చివరి మాటలు.
అంటే పోరాటం ఇంకా మిగిలి వున్నట్టేగా!

**'వ్లదీమీర్ ఇల్యీచ్ లెనిన్'** కావ్యం (మూలరచన : 1924)
రష్యన్ మూలం : **వ్లదీమీర్ మయకోవ్‌స్కీ** (1893-1930)
తెలుగు అనువాదం : **శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు)** ✷

# కథారచయిత శ్రీపతి మరణం



**శ్రీపతి** అనే కలం పేరుతో కథలు రాసిన పుల్లట చలపతిరావు తన 86వ యేట హైదరాబాదులో 07-02-2024న మరణించారు. ఆయన శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం భైరిపురం గ్రామానికి చెందినవారు.

1965లో లాల్‌దర్వాజాలోని వెంకట్రావు స్మారకోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి, మరికొన్నేళ్ళు ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో వార్తలు చదివే ఉద్యోగం చేశారు. ఆ తరువాత హైదరాబాద్‌లో స్థిరపడి ప్రగతిశీల రచయితలకు సన్నిహితుడయ్యారు.

ఆయన 'ఎక్స్-రే' పేరుతో విప్లవ కవితలు రాశారు. విరసం ఏర్పడటానికి ముందు నేపథ్య వాతావరణం సృష్టించడంలో ఆయన భాగస్తుడు. 'సృజన' పత్రిక తొలి సంచిక నుండి, శ్రీశ్రీ షష్టిపూర్తి సంచిక వరకు రూపొందించడంలో ఆయన పాత్ర వుంది. 'మంచు పల్లకి – మరి తొమ్మిది', 'కాటుక కళ్ళు – కథలు మూడు', 'సత్యజిత్ రాయ్ ఎవరు?', 'బెనారస్ చిత్రాలు' అనే కథాసంపుటాలు రచించారు. శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానంలోని నెమళ్ళ అడవి ప్రాంతంలోని గిరిజనుల బాధామయ జీవితాలను తన కథల్లో చిత్రించారు. తన గ్రామ నేపథ్యంగా రాసిన కథ 'మామిడిపళ్ళ ఊరు' ఆయన రాసిన చివరి కథ. ✷

# నల్లెల రాజయ్య మరణం



**కవి,** రచయిత, పౌరస్పందన వేదిక ప్రధాన కార్యదర్శి నల్లెల రాజయ్య తన 62వ యేట హనుమకొండలో 15-2-2024న మరణించారు. ఆయన ములుగు మండలం అబ్బాపూర్‌లో రైతు కుటుంబంలో పుట్టారు. దివ్యాంగునిగా గూనితో బాధపడ్డారు.

ఉపాధ్యాయునిగా హసన్‌పర్తి మండలం జిల్లా పరిషత్ హైస్కూలులో పనిచేసి 2020లో ఉద్యోగ విరమణ చేశారు. విద్యార్థి దశలోనే నాస్తికత్వం వైపు ప్రయాణం చేసి, సామాజిక కార్యకర్తగా ఎదిగారు. రామప్ప కట్టడాన్ని పరిరక్షించడానికి కృషి చేశారు. పద్మాక్షి గుట్ట సమస్యపై పర్యావరణ విధ్వంసాన్ని ప్రశ్నించారు. ప్రజా ఉద్యమాలన్నిటిలో భాగస్వామ్యం వహించారు.

ఆయన 2002లో వరంగల్ రచయితల సంఘం స్థాపించి దానికి అధ్యక్షునిగా పనిచేశారు. 'ఆశయాల పందిరిలో' (కవితా సంపుటి), 'చాయెనా, రేయెనా' (వీధి నాటిక) వ్రాసారు. సంపాదకులుగా దాదాపు 15 పుస్తకాలను ప్రచురించారు. ✷

వ్యాసం

# శ్రామిక ప్రజాపక్ష భావజాలాన్ని కనుమరుగు చేయటం కోసం ఉపయోగింపబడుతున్న మరొక అస్థిత్వవాద రాజకీయం!

- జి.వి. భద్రం

**1960** నుండీ అమెరికా ప్రభుత్వమూ, అమెరికా ఉన్నత పాలకవర్గాలవారూ, వామపక్షాలలోకి రహస్యంగా చొరబడటం ద్వారా, వామపక్షాలను విచ్ఛిన్నం చేయటానికి ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. 1960లలోని సి.ఐ.ఏ.కు చెందిన 'ఆలోచనా (మేధో) కాసారాలు' అసంఖ్యాకమైన వ్యూహాలతో ముందుకొచ్చారు. మాదకద్రవ్యాల వాడకాన్నీ, స్వైర్య, అక్రమ లైంగిక ప్రవర్తనాపూర్వక లైంగిక భావనలను విరివిగా ప్రోత్సహించి "సాహసవంతమైన నూతన ప్రపంచపు" పలాయనవాదాన్ని ప్రోత్సహించటం – ప్రచారం చేయటమే కాకుండా, ప్రజల దృష్టిని కార్మికవర్గ సమస్యల నుండి తప్పించే ప్రయత్నాలను సాగించారు. దేశంలో సగంమంది దారిద్ర్యరేఖకు క్రింద జీవితాలను దుర్భరంగా వెళ్ళమార్చుతుండగా, దానిని నిరసించటానికి బదులుగా యీ పలాయనవాదాన్ని, ప్రత్యేకించి నల్లజాతి ఆఫ్రో అమెరికన్లలో ప్రోత్సహించి ముందుకు త్రోశారు. అయితే అమెరికాలోని శ్రామికవర్గ పార్టీలు యీ రకమైన భ్రష్టత్వాన్ని వెనక్కు నెట్టివేయటంలో విజయవంత మయ్యాయి. మాదకద్రవ్యాలను వాడటాన్నీ, మత్తుపానీయాలను త్రాగటాన్ని నిరుత్సాహపరచాయి. లైంగిక ప్రవర్తనను, లైంగికత్వాన్నీ వస్తుపరం చేయటాన్ని ప్రత్యేకించి మహిళలను శృంగార వస్తువులుగా చేయటాన్ని, విమర్శించటం ద్వారా యీ పలాయనవాదాన్ని వెనక్కు నెట్టగలిగారు.

వామపక్షాలను విభజించి జయించటానికి, ఒక వామపక్షాన్ని మరొక వామపక్షానికి వ్యతిరేకంగా నిలబెట్టడానికి, 1960ల చివరి కాలంలో, కనిపెట్టి అమలుజరపిన మరొక వ్యూహం అస్థిత్వవాద రాజకీయాలు. మెక్కార్థియిజం (కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం) మాదిరిగానే, యీ అస్థిత్వవాద రాజకీయం సోషలిజం గురించీ, శాస్త్రీయ ఆర్థికవ్యవస్థ గురించీ వివరించటాన్ని లేదా చర్చించటాన్ని అనుమతించలేదు. వామపక్షవాదులు చర్చలు జరిపేటప్పుడు పిల్లికూతలు వేస్తూ, అల్లరి చేస్తూ, వక్తలను మాట్లాడనీయకుండా మాట, మాటకు అడ్డుకొంటోంది. ప్రత్యేకించి వామపక్షవాదులను బ్లాక్‌లిస్టులో పెడుతూ, వామపక్షవాదుల సంఖ్యను నామమాత్రం చేసేందుకు ప్రయత్నిస్తోంది.

1930ల నుండి 1970ల వరకూ, అమెరికా కమ్యూనిస్టుపార్టీ యొక్క ఆదర్శం, నినాదం 'నల్లజాతి, తెల్లజాతి ప్రజల ఐక్యతే. అందుకోసం బహిరంగచర్చలు, ప్రశ్నలు–జవాబులు, వాదప్రతివాదాలు జరిగేవి. తక్కువ ప్రగతిశీలకంగా వున్న తెల్లజాతి పేద కార్మికులకు వివరణలు యివ్వటం వలన వారు వాస్తవాలు తెలుసుకోగలిగేవారు. జాత్యహంకారానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన కార్యక్రమాల ఫలితంగా, నల్లజాతివారి పౌరహక్కుల శకంలో, వారికి తెల్లజాతివారి మద్దతు లభించింది. ఈ అంశాలన్నిటినీ అర్థం చేసుకొన్న బ్లాక్ పాంథర్ పార్టీ, అప్పలాచియాన్స్ లాంటి అతి నిరుపేద శ్వేతజాతివారిలో పనిచేసి తెల్లజాతి కార్మిక సంస్థలతో (చికాగోలోని యువదేశ భక్తుల సంఘం లాంటి సంస్థలతో) మిత్రత్వాన్ని నెలకొల్పుకోగలిగారు. అయితే 1970లో సి.ఐ.ఏ అస్థిత్వవాదపు రాజకీయాలను ప్రయోగించటంతో, స్వప్రయోజనాలు కల గ్రూపులు ఒకదానితో మరొకటి ముష్టి మెతుకుల కోసం పోటీపడుతూ, స్వార్థపూరిత వ్యక్తివాదాన్ని ప్రోత్సహిస్తూ, సమష్టితత్త్వాన్ని (సమష్టి కార్యాచరణను) తిరస్కరిస్తూ 'నల్ల, శ్వేతజాతివారల ఐక్యత' అన్నదాన్ని, అస్థిత్వవాద రాజకీయాలుగా మార్చివేశాయి.

బూర్జువా ఫెమినిజం ఫలితంగా ఇప్పుడు మహిళలకు తెల్లజాతి పురుషులు శతృవులుగా నెట్టబడ్డారు. యాజమాన్య స్థాయి ఉద్యోగాలలో స్త్రీలకు ఎక్కువ ఉద్యోగాలు యివ్వాలనే డిమాండును తీసుకువచ్చారు. నల్లజాతివారు, పోలీసు అధికారుల్లో ఎక్కువమంది నల్లజాతి పోలీసు అధికారులను నియమించాలంటూ డిమాండు చేశారు. ఏ రాయి అయితేనేం పళ్ళూడగొట్టడానికి అనే వివేచన లేకుండా క్రింది స్థాయి ఉద్యోగులను అణచే యాజమాన్య స్త్రీలూ (అధికారులూ), నల్లజాతివారి తలలను పగులగొట్టే నల్లజాతి అధికారులూ ప్రగతికారులు అన్నట్లుగా వున్నాయి వీరి డిమాండ్లు.

వ్యవస్థను నడిపే పాలకులు మారినంతమాత్రాన, వ్యవస్థ మారదు అని అస్థిత్వవాద రాజకీయవాదులు అర్థం చేసుకోవడాన్ని నిరాకరిస్తున్నారు. సమష్టితత్వంలో ఐక్యంగా వుండవల్సిన కార్మికులు యీ రోజున జాతి, జండర్, మతం, స్వజాతీయత (తెగలు) తదితర ప్రాతిపదికలపై చీల్చివేయబడ్డారు.

అమెరికా సామ్రాజ్యవాదం, యితర దేశాల్లో జరిపిన యుద్ధాలలో అమెరికన్ పౌరులు, ప్రత్యేకించి పదుల లక్షలమంది నల్లజాతివారు మరణించినా, ఒబామా అధ్యక్షుడిగా వున్న కాలంలో, యీ ఆధిపత్యవాద రాజకీయాల ప్రభావం వల్ల యుద్ధ వ్యతిరేక నిరసన ఉద్యమాన్ని వామపక్షాలు

ఉపసంహరించుకొనే స్థితికి వచ్చాయి. అటువంటి నిరసనలు, నల్లజాతి అధ్యక్షుడైన – ఒబామాను – నిరసించినట్లవుతుందనీ, కించపరిచినట్లవు తుందనేది కారణం. అస్థిత్వవాద రాజకీయాలు నల్లజాతి ప్రజల్లో పెంపొందించిన తప్పుడు, అపసవ్య అవగాహన ఇది. దీని ఫలితం ఏమిటంటే యీ రోజున లిబియా దేశానికి చెందిన పురుషులను బానిసలుగా అమ్మివేస్తున్నారు.

తెల్లజాతి పురుషులను నిందించి అపఖ్యాతి పాలు చేయటం, వారిని నిర్లక్ష్యం చేయటం. వారిలో ద్వేషాన్ని పెంచింది. అది మనం యీరోజు చూస్తున్న జాత్యహంకారాన్ని, స్త్రీ వివక్షతా దృక్పథాన్ని సృష్టించటానికి దారితీసింది. ఇందువలన చాలామంది పురుషులు తాము నిర్లక్ష్యానికి గురికాకుండా వుండటానికి మితవాదపక్షాల వైపుకు వెళ్ళారు.

ఈ క్రమంలో భాగంగానే నేడు మరొక క్రొత్త అస్థిత్వవాద రాజకీయం ముందుకొచ్చింది. అదే ట్రాన్స్ జండర్ సిద్ధాంతం!. నిజానికి యీ సిద్ధాంతం గేల (స్వలింగ సంపర్కులు) పట్ల వ్యతిరేకమైనదీ, స్వలింగ సంపర్కులపట్ల ద్వేషం కలిగినదయినప్పటికీ, చాకచక్యంగా లెస్బియన్, గే, ద్విలింగ సంపర్క ఉద్యమాన్ని తన స్వలాభం కోసం ఉపయోగించుకొంటూ, తనను తాను 21వ శతాబ్దపు పౌరహక్కుల ఉద్యమంగా ప్రచారం చేసుకొంటూ దూసుకెళ్తోంది. ఇప్పటికీ స్థానిక ప్రజలు, ఆఫ్రికన్ – అమెరికన్లూ, స్త్రీలూ, ఎన్నో ప్రధానమైన పౌరహక్కులను అమెరికాలో సాధించలేకపోయారన్న వాస్తవాన్ని మనం మరచిపోవాలంటోంది యీ ట్రాన్స్‌జండర్ ఉద్యమం.

యీ ట్రాన్స్‌జండర్ సిద్ధాంతం అనేది, ట్రాన్స్‌జండర్ వ్యక్తులతో సమానమైనది కాదు. ఇది కేవలం స్త్రీలపైననే కాక, వామపక్షాలపై దాడి జరుపుతోంది. ఈ సిద్ధాంతం స్త్రీలు పునరుత్పాదక పెట్టుబడికి దోహదం చేస్తారన్న విషయాన్నీ, వారు శృంగారానికి మాత్రమేకాక భవిష్యత్తుకు అవసరమైన కార్మికులను గర్భం దాల్చి కంటారన్న విషయాన్నీ, స్వయంగా స్త్రీలే కార్మికులేనన్న విషయాన్ని పట్టించుకోకపోగా తక్కువ చేసి చూపిస్తుంది. కార్మికవర్గ స్త్రీలపై ప్రభావాన్ని కలిగివున్న జనన (జనాభా) నియంత్రణ, మెటర్నిటీ శలవులు, ప్రజాసేవలు, తక్కువ వేతనాలు, పనిలో అసమానత్వం, లైంగిక వేధింపులు లాంటి సమస్యలను చర్చించటానికి బదులు ట్రాన్స్‌జండర్‌ల సమస్య అయిన యూనిసెక్స్ బాత్‌రూంలు లాంటి విషయాలను ముందున పెట్టి కార్మికవర్గ మహిళల సమస్యలను అప్రధానమైన సమస్యలుగా పరిగణిస్తుంది.

మరోవైపు యీ ఉద్యమం వామపక్ష ఐక్యతను, విప్లవ సాధ్యతను తక్కువ చేస్తుంది. నిజమైన ప్రజాఉద్యమంలో భాగంగా పాల్గొనటానికి స్త్రీలను తమ స్వంత సంఘటిత సంస్థలను నిర్మాణం చేసుకోకుండా నిరోధిస్తుంది.

ట్రాన్స్‌జెండర్ ఉద్యమం కార్మికవర్గానికి చెందిన ఉద్యమం కాదు. ఈ ఉద్యమం ప్రధానంగా జాత్యహంకారం గల స్త్రీలను, స్వలింగ సంపర్కాన్ని ద్వేషించే ఉన్నత మధ్యతరగతి శ్వేతజాతి పురుషులకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అది ఒక మూసలో వుండే జండర్ రకాలను గురించి వాదిస్తుంది. ఉదాహరణకు అది స్వలింగ సంపర్కులైన పురుషులను వారు వాస్తవంగా స్త్రీలని చెబుతుంది. లేదా జాత్యహంకారమన్నది ఊహాపూర్వకమైన అవగాహన అని చెబ్తుంది. ట్రాన్స్ స్త్రీలు తాము స్త్రీలమని చెప్పుకోవటం ద్వారా, వారు కేవలం శారీరకశాస్త్రాన్నీ, విజ్ఞానశాస్త్రాన్నీ ఖండించటమేకాక, మహిళలు అనుభవిస్తున్న అణచివేత యొక్క మొత్తం చరిత్రనే తొలగిస్తున్నారు.

ట్రాన్స్‌జండర్ సిద్ధాంతం, జీవశాస్త్ర సంబంధమైన శారీరక లక్షణాల కన్నా ముందుగా అనుభూతుల గురించి ప్రస్తావించే ప్రమాదకరమైన పూర్వోదాహరణ పద్ధతి వలన, కేవలం స్త్రీలపట్లే కాక నల్లజాతి ప్రజలు, స్థానిక ప్రజల (నేటివ్‌ల) పట్ల వివక్షత చూపడాన్ని అనుమతిస్తుంది.

గతితార్కిక భౌతికవాదాన్ని తిరస్కరించే ఉదారవాదులు ప్రకృతినీ, ప్రకృతిలో గల పరిణామపూర్వకమైన సంబంధాన్నీ నిరాకరిస్తారు.

ఇంగ్లీషు భాష మాట్లాడే ప్రతీ దేశంలోనూ, ట్రాన్స్‌జండర్ సిద్ధాంతం స్త్రీల ఉన్నత స్థాయిని తగ్గించి వారిని పురుషుల యొక్క లైంగిక వాంఛలను ఆకర్షించే అధీన స్థాయికి దిగజార్చేవిధంగా, భాషను ప్రభావవంతంగా వాడుకొంటోంది. ఇంగ్లండులో చేసిన 'జండర్ గుర్తింపు చట్టం' మాదిరిగానే అమెరికన్ కాంగ్రెసు 'సమానత్వ చట్టం' అన్నదానిని చేయబూనుకోవటంతో స్త్రీలు తప్పనిసరిగా తాము తప్పుకొని పురుషులు దారి యివ్వాలి. ఎందుకంటే యిప్పుడు పురుషులకు వారి యిష్టానుసారం మహిళలకు ఏర్పాటుచేసిన సదుపాయాల్లోకి స్వేచ్ఛగా ప్రవేశించే హక్కునూ, స్త్రీల క్రీడలను తమ యిష్టానుసారం సహనివేశనా క్రీడలుగా (కోలనైజేషన్) మార్చే హక్కునూ కలిగి వున్నారు. 1917లో విప్లవం విజయవంతం కావటంతో రష్యన్ మహిళలు వేరుగా బాత్రూమ్‌లు ఏర్పాటును పొందగలిగితే, అమెరికా దేశంలోని మహిళలకు దాన్ని సాధించటానికి 1920 వరకూ పట్టింది. అయితే యిప్పుడు రేపిస్టులైన మగవారూ, తాము స్త్రీలమనే అనుభూతిని పొందుతున్నామని నొక్కి చెప్పటంతో, వారిని స్త్రీల బాత్‌రూంలోకి అనుమతిస్తున్నారు. స్త్రీల జైళ్ళలోకి ప్రవేశపెడ్తున్నారు. అలా ప్రవేశించిన పురుషులు అక్కడి స్త్రీలను రేప్ చేస్తున్నారు.

ఈ ట్రాన్స్‌జండర్ సిద్ధాంతంలో పూర్తిగా మునిగిపోయిన వామపక్షాలు, తమ యొక్క శాస్త్రీయ సోషలిజాన్ని విడనాడాయి. ఇటువంటి వామపక్ష పార్టీలు (అమెరికాలో) ఆఖరుకు, పడుపు వృత్తి గురించి, హింసాపూరిత కామక్రీడలను అసభ్యంగా చిత్రించే చిత్ర రచనల గురించి తమ పార్టీలోని పురుషుల అభిప్రాయాలతో ఏకీభవించని స్త్రీలను పార్టీ నుండి బహిష్కరించే స్థాయికి దిగజారిపోయాయి.

కొన్ని వామపక్ష పార్టీలనబడేవి, బూర్జువా నయా ఉదారవాదంతో వ్రేళ్ళూనుకొని వున్న ఉదారవాదాన్ని ఆశ్రయించటం వలన, విప్లవ లక్ష్యానికి బదులు పార్లమెంటరీ లక్ష్యాన్ని చేపట్టడాన్ని పూర్తిచేసి, డెమోక్రటిక్ పార్టీ యొక్క తార్పుడుగాళ్ళలా మారిపోయాయి.

సి.ఐ.ఏ ఆఖరుకు, ట్రాన్స్‌జండర్ వాదంతో, ఈ పార్టీలను నాశనం చేయగలిగిందా అని ఆలోచించటానికి ముందు, ట్రాన్స్‌జండర్ కావటం వేరు – ఈ ట్రాన్స్‌జండర్ ఉద్యమం ఒక నిర్మాణాత్మక (ఆర్గానిక్) ఉద్యమం అన్నది వేరు అన్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. ఈ ట్రాన్స్‌జండర్ ఉద్యమానికి సి.ఐ.ఏ ద్వారానూ, దాని మేథో కాసారం ద్వారాను నిధులు అందుతున్నాయి.

2018 ట్రాన్స్ ఈక్వాలిటీ నౌ బహుమతులను యిచ్చే కార్యక్రమానికి వాషింగ్టన్ డి.సి.లో మే 17, 2018 నేషనల్ సెంటర్ ఫర్ ట్రాన్స్ జండర్ ఈక్వాలిటీ ఏక్షన్ ఫండ్ ఆతిథ్యం యిచ్చినప్పుడు, ఆ కార్యక్రమాన్ని స్పాన్సర్ చేసినవారిలో సి.ఐ.ఏ., జార్జి నోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ, ఫేస్‌బుక్ (పాక్షికంగా దీనికి అట్లాంటిక్ కౌన్సిల్ అయినేటోనిధులను యిచ్చింది) గూగుల్, అమెజాన్, కేపిటల్ ఒన్ బ్యాంక్, షూక్, హార్డీ & బేకన్ (బడా ఫార్మా రంగానికి చెందిన న్యాయవాద సంస్థ), అనేకమయిన ఫార్మా కంపెనీలతో బాటుగా గిలీడ్ సైన్సెస్, మెల్బోర్ క్లినిక్ అండ్ ఫార్మా లాంటి బడా వైద్య సంస్థలున్నాయి. అంతేకాక సోరోస్ యొక్క ఓపెన్ సొసైటీ ఫౌండేషన్, వ్యక్తులుగా వున్న ట్రాన్స్‌జండర్ కార్యకర్తలకు (వీరు వివిధ వామపక్ష సంస్థలలో నాయకులుగా వున్నారు) నిధులను యిచ్చింది. అటువంటివారిలో ఇంటర్నేషనల్ ఏక్షన్ సెంటర్ అండ్ వర్కర్స్ వరల్డ్ పార్టీకి చెందిన నాయకుడిగా వున్న ఇమానీ హెన్రీ అనే వ్యక్తి ఒకడు. అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రీ లేబర్ డెవలప్‌మెంట్ (ఎ.ఐ.ఎఫ్.ఎల్.డి) అనే సంస్థ ద్వారా సి.ఐ.ఏ., ఈ ట్రాన్స్‌జండర్ ఉద్యమానికి నిధులను సమకూర్చుతోంది. అమెరికాలోని కొన్ని ట్రాన్స్‌జండర్ ఉద్యమ సంస్థలైన ఎల్‌జిబిటిక్యు + సమూహాల సంస్థలు యీ నిధులను స్వీకరించకుండా దూరంగా వున్నాయి. దీనర్థం సారాంశంలో వీటి స్వభావం యితర ట్రాన్స్‌జండర్ ఉద్యమ సంస్థలకు భిన్నమైనది అని కాదు.

ఇటీవలనే జెరూసలెం నగరంలో, ఇజ్రాయిల్ ప్రభుత్వ మద్దతుతో జూన్ 1, 2023న 'గే ప్రైడ్ అండ్ టాలరెన్సు పెరేడ్' అనే ట్రాన్స్‌జండర్ల ప్రదర్శన నిర్వహించారు. పోలీసుల ప్రకారం యీ ప్రదర్శనకు 10,000 మంది హాజరయ్యారు. ఈ ప్రదర్శనకు రక్షణగా 2,000 మంది ఇజ్రాయిల్ పోలీసులు, ఇజ్రాయిల్ బోర్డర్ పోలీసులూ పనిచేశారు. ఇటువంటి ప్రదర్శనను తమ ప్రాంతంలో జరిపి తమను అవమానపరచవద్దని హార్దీస్, హమాస్‌కు చెందిన జెరూసలెం నగరంలోని యూదు, ముస్లిం, క్రిస్టియన్ సమూహాలు కోరినప్పటికీ, యీ గే (నపుంసకలింగ) కార్యకర్తల ప్రదర్శనను జెరూసలెం నగరం గుండా నిర్వహించారు. ఆక్రమిత జెరూసలెంలో యీ రకంగా ఆక్రమిత ఫాసిస్టు శక్తులు తమను కవ్వించటం కోసమే ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారని హమాస్ ప్రతినిధి ఆరోపించాడు. పాలస్తీనాలోనూ, ఆక్రమిత గాజా ప్రాంతంలోనూ మారణహోమం (ప్రపంచమంతా నిరసిస్తూ, ఖండిస్తున్నా) సాగిస్తున్న ఇజ్రాయిల్ ప్రభుత్వం, యీ ట్రాన్స్‌జండర్ కార్యకర్తల ప్రైడ్ పెరేడ్‌ను నిర్వహించటాన్ని ప్రగతిశీలమైన చర్యగా ఏ రకంగానూ భావించలేము. అదేవిధంగా సి.ఐ.ఏ నిధులతోనూ, సూపర్ లాభాలను దోచుకొంటూ, అమెరికాలోనే కాక, ప్రపంచమంతటా దారుణ ఆర్థిక అసమానత్వాన్ని పెంచుతున్న సామ్రాజ్యవాద కార్పొరేటర్ల నిధులతోనూ, నిర్వహింప బడుతున్న 'ట్రాన్స్‌జండర్ ఉద్యమం' యొక్క స్వభావం స్పష్టంగానే అర్థమవుతోంది. దీని యొక్క లక్ష్యం కూడా స్పష్టంగానే అర్థమవుతోంది.

అమెరికాలోనూ, యితర అభివృద్ధి చెందుతున్న పాశ్చాత్య దేశాలలోనూ కొనసాగుతున్న ట్రాన్స్‌జెండర్ ఉద్యమం యొక్క స్వభావ, స్వరూపాలూ, లక్ష్యం – వామపక్ష భావజాలాన్నుండి ప్రక్కదారి పట్టించి, ప్రజల అసలైన మౌలిక సమస్యలు పట్టించుకోకుండా చేసి, వామపక్ష భావజాలాన్ని కనుమరుగు చేసేదిగానే వుందని వెల్లడి అవుతోంది.

ట్రాన్స్‌జండర్ ఉద్యమం యొక్క స్వభావ, స్వరూప, లక్ష్యాల నేపథ్యం యిదికాగా, యీ ఉద్యమం ఎల్.జి.బి.టి.క్యు + సమూహాల ఉద్యమ రూపంలో మనదేశంలోనూ తలెత్తి విశేషమైన ప్రచారాన్ని చేస్తోంది. ఈ ఉద్యమం సిద్ధాంతాన్ని మనదేశ ప్రజలు తలకెక్కించేందుకు ముమ్మరమైన ప్రచారం, కార్యక్రమాలు సాగుతున్నాయి.

విదేశీ నిధులతో 'సామాజికరంగంలో' పనిచేస్తున్న కొన్ని ఎన్.జి.ఒ.లు, శాస్త్రీయ అవగాహన ప్రాతిపదికగా లేని రాజకీయ కార్యకర్తలుగా వున్న కొందరు, ఎటువంటి రాజకీయ (నిర్దిష్టమైన) అభిప్రాయాలు లేని విద్యావంతులూ, జర్నలిస్టులూ న్యాయవాదులు, ఉన్నత మధ్యతరగతి ప్రొఫెషనల్‌లు, స్త్రీవాదులు, సంచలనవార్తల వ్యాపారాన్ని నిర్వహిస్తున్న పత్రికలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు యీ ట్రాన్స్‌జెండర్ ఉద్యమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు, ప్రోత్సహిస్తున్నారు.

ఆఖరుకు 'ది హిందూ' లాంటి ఇంగ్లీషు జాతీయ దినపత్రిక కూడా "ఈ వివిధ నపుంసకలింగ (ఎల్.జి.బి.టి. + సమూహాల) సమూహాలకు చెందిన సభ్యులకు వ్యతిరేకంగా సంవత్సరాల తరబడి ఎటువంటి దురభిప్రాయాలు, ప్రతికూలాభిప్రాయాలు వున్నాయో, వీరందరినీ సమాజం ఏవిధంగా ఒకే మూసలోకి నియంత్రించిందో అన్న విషయాన్ని వివరించటం అనే పేరిట, యీ ఉద్యమానికి సంబంధించిన కార్యక్రమాల వివరాలను, అభిప్రాయాలను, వాటిపై చర్చలను ప్రముఖంగా ప్రచురిస్తూ, తన పాఠకులను ఆకర్షిస్తూ, పాఠకుల సంఖ్యను పెంచుకోవటానికి వీలుగా ఈ ఉద్యమాన్ని వాడుకొంటోంది. మరోవైపు యీ విషయం గురించి ఆలోచించటం, ఆ ఉద్యమాన్ని అర్థం చేసుకొని ప్రోత్సహించటం ఒక 'ప్రగతిశీలకమైన' కార్యక్రమం అనే భావాన్ని కలుగజేస్తోంది.

ఈ ట్రాన్స్‌జండర్ ఉద్యమాన్ని నిర్వహించే వేదికలు ఎన్నో తలెత్తాయి. ట్రాన్స్‌జండర్ సిద్ధాంతానికి పునాదిగా అనేక సెర్చి పుస్తకాలు, ట్రాన్స్‌జండర్లే తమ అనుభవాలంటూ వ్రాసిన అనేక గ్రంథాలూ వెలువడుతున్నాయి. ఇన్‌స్టాగ్రాం పేజీల్లోనూ, సామాజిక మాధ్యమాలలో ఎడిహెచ్‌డి లాంటి సంస్థలూ కథలు ప్రచురిస్తున్నాయి. పోస్టింగులు ప్రచారం చేస్తున్నాయి. 'కలెక్టివ్ క్వీర్', 'చెన్నై క్రానికల్స్', 'ది న్యూస్ మైన్యూట్' లాంటి మీడియా సంస్థలు, 'గూగుల్ న్యూస్ ఇన్షియేటివ్'

సహాయంతో ట్రాన్స్‌జెండర్ సమూహాలకు చెందిన ప్రజలకు, మీడియాలో ప్రాతినిధ్యం కల్పించేపేరిట సెషన్లు నిర్వహిస్తున్నాయి.

మరోవైపు, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను నామమాత్రంగా కూడా పట్టించుకోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, యీ ట్రాన్స్‌జండర్ సమూహాల సంక్షేమాన్ని పట్టించుకొంటున్న ప్రగతి కాముకులమన్నట్లు వివిధ సంక్షేమ బోర్డులు ఏర్పాటుచేస్తూ నటిస్తున్నాయి. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్ వెల్ఫేర్ బోర్డు అన్నదాన్ని ఏర్పాటుచేసి, కొందరు ట్రాన్స్‌జండర్ సమూహ ప్రముఖులు అనేవారికి "ట్రాన్స్ జండర్ ప్రజల జాతీయ కౌన్సిల్‌కు" పంపిస్తూ, తాను ప్రగతిశీలక ప్రభుత్వం అన్నట్లు నటిస్తోంది. అంతేకాక ఛత్తీస్‌ఘడ్ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, బడిపిల్లలు టెక్ట్ పుస్తకాలలో ట్రాన్స్‌జండర్ చరిత్రపై కొన్ని అధ్యాయాలను చేర్చింది. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం, ట్రాన్స్‌జండర్ రచయిత్రి మంజమ్మ లాంటి వారికి 'రాజ్యోత్సవ ప్రహస్తి' అవార్డునివ్వటమే కాకుండా పద్మశ్రీ అవార్డు కూడా ప్రకటించింది. కర్నాటక రాష్ట్రంలోని కాలాబుర్గిలో గల షరన్ బసవా లాంటి విశ్వవిద్యాలయాలైతే, ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను యిచ్చాయి. కర్నాటక జానపద అకాడమీకి ఆమెను అధ్యక్షురాలిని చేశారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం 2008లోనే ట్రాన్స్ జండర్ వెల్ఫేర్ బోర్డు నెలకొల్పింది. తమిళనాడు స్టేట్ డెవలప్‌మెంట్ పాలసీ కమిటీకి, నర్తకి నటరాజ్ అనే ట్రాన్స్‌జండర్ స్త్రీని అధ్యక్షురాలిగా చేసింది.

మరోవైపు 'రైన్‌బో సాహిత్య ఫెస్టివల్' లాంటి ఫెస్టివల్స్, 'ఇంటర్నేషనల్ క్వీర్ ఫిల్మ్ ఫెస్టివల్స్', 'ఖాషీష్ ఫెస్టివల్స్', 'క్వీర్ సాహిత్య ఫెస్టివల్స్', 'డైలాగ్స్ ఫెస్టివల్స్' లాంటి ఫెస్టివల్‌లు బొంబాయి, డిల్లీ, మద్రాసు, కలకత్తా లాంటి నగరాల్లో నిర్వహింపబడుతున్నాయి. ట్రాన్స్‌జండర్ల చిత్రకళా ప్రదర్శనలు నిర్వహింపబడుతున్నాయి. ట్రాన్స్ జండర్ల ప్రైడ్ మార్చ్ (సగర్వ కవాతులు) నిర్వహింపబడుతున్నాయి. డ్రాగ్ షోలు నిర్వహింపబడుతున్నాయి. ఇటువంటి ప్రదర్శనలన్నింటిని బడా మీడియా సంస్థలు ప్రోత్సహించి జరపించటం అన్నదీ, ఈ కార్యక్రమాల సందర్భంగా అనేకమంది 'క్వీర్ వ్యాపారస్థులు' నగలను, కళాఖండాల లాంటివాటిని అమ్ముకోవటాన్ని వ్యాపార వర్గాలవారు, యీ కార్యక్రమాను ప్రోత్సహిస్తూ ఏ రకంగా లాభార్జనలకు పాల్పడు తున్నారో అర్థమవుతుంది.

శ్రీ, శ్రీమతి, కుమారి లాంటి పదాలతో సంబోధించటానికి కుదరని యీ ట్రాన్స్‌జండర్ సమూహానికి చెందిన సభ్యులను (మిస్టర్ లేదా మిసెస్ లేదా మిస్ అని పిలువటానికి కుదరనివారిని) 'మక్స్' అని సంబోధించాలని యీ ట్రాన్స్‌జండర్ ఉద్యమకారులు కోరుతున్నారు.

అయితే ట్రాన్స్‌జండర్ అస్థిత్వ ఉద్యమాన్ని కేవలం పైన పేర్కొన్న సంస్థలూ, వ్యక్తులు మాత్రమేకాక కొన్ని వామపక్ష పార్టీలు కూడా సమర్థిస్తూ, వారి కార్యకలాపాలకు ప్రోత్సాహ, ప్రచారాలను కల్పిస్తున్నాయి. మరోవైపు మార్క్సిస్టులుగా చలామణీ అవుతున్న అపర మార్క్సిస్టులు కొందరు సమాజంలో అనంత అస్థిత్వాలు వున్నప్పుడు వాటిని చేరుకోవాలనీ, వైవిధ్యాలను గుర్తించాలనీ, మార్క్స్ కాలంలో యివి చర్చకు రాకపోయినంతమాత్రాన యివి వర్గపోరాటానికి సంబంధంలేనివైపోవనీ, లైంగిక వైవిధ్యాల గురించిన చర్చ మన సాంస్కృతిక అవగాహన స్థాయిని పెంచుతుందనీ, ట్రాన్స్‌జండర్ అస్థిత్వాన్ని గుర్తించాలనీ, వారి ఆత్మగౌరవ పోరాటాన్ని అర్థం చేసుకొని, ఆహ్వానించాలి అంటూ బోధనలు చేస్తున్నారు. మార్క్సిస్టు పదజాలాన్ని, ట్రాన్స్‌జండర్ సిద్ధాంతానికి యాంత్రికంగా జతచేసి, దాన్ని ట్రాన్స్‌జండర్ సిద్ధాంతానికి మార్క్సిస్టు సిద్ధాంత అన్వయం అన్నట్టుగా చూపెడ్తున్నారు. తమను విప్లవ పురోగాములుగా చూపెట్టుకొంటున్నారు.

అదే కోవలో కొందరు స్త్రీవాదులు, ట్రాన్స్‌జండర్ ఉద్యమానికి సహాయపడుతున్న ఒక మహిళను మేక్సిమ్ గోర్కీ నవల 'అమ్మ'లోని, అమ్మ పాత్ర అయిన నీలోవ్నా వ్లాసోవాతో పోల్చుతూ, శ్రామికవర్గ పోరాటంతో, ట్రాన్స్‌జండర్ ఉద్యమాన్ని సమం చేసే పరోక్ష ప్రయత్నాలకు పాల్పడుతున్నారు.

జీవసంబంధమైన శారీరక లక్షణాలుగా ట్రాన్స్‌జండర్లుగా జన్మించిన వ్యక్తులు వేరు, ప్రస్తుతం ముందుకు తేబడిన ట్రాన్స్‌జండర్ అస్థిత్వవాద ఉద్యమం వేరు అన్న విషయాన్ని గుర్తించకుండా, ట్రాన్స్‌జండర్లయిన వ్యక్తుల సమస్యలను, ప్రస్తుతం జరుగుతున్న ట్రాన్స్‌జండర్ల ఉద్యమాన్ని సమంచేసి, దాన్ని ప్రోత్సహించటం ద్వారా తాము పురోగామిశక్తుల ముందుపీఠిలో వున్నామని ప్రకటించుకొంటున్నారు.

నిర్దిష్ట విప్లవ ప్రణాళిక, కార్యక్రమం, లక్ష్యం వున్నవారు ఆ కార్యక్రమాన్ని మరింత పట్టుదలతో ముందుకు తీసుకొనిపోతూ, ప్రజా ఉద్యమ నిర్మాణానికి పూనుకోవటానికి బదులు, యిటువంటి అస్థిత్వ సిద్ధాంతాల ఉచ్చులో చిక్కుకుపోయి; ప్రక్కదారులు పడుతున్నారు. ఇందువలన తమ వామపక్ష సిద్ధాంతం, దాని ప్రభావాలు క్రమక్రమంగా దొలచబడే ప్రమాదాన్ని వారు గుర్తించటల్లేదు.

ఈరోజున ప్రపంచమంతటా ప్రజలూ, ప్రత్యేకించి మనదేశంలోని మెజార్టీ ప్రజానీకం, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రభావం వలన తీవ్రమయిన నిరుద్యోగం, పేదరికం, ఆకలి, అణచివేత, అసమానత్వాల బారినపడి సతమతమవుతున్నారు. ఇందుకు కారణం మనదేశపు అర్థభూస్వామ్య, అర్ధవలస వ్యవస్థేననీ, అటువంటి వ్యవస్థను తప్పనిసరిగా కూలద్రోయాలనీ అంగీకరించే వామపక్షాలూ, మార్క్సిస్టులూ, యీ ప్రధాన లక్ష్యం సాధించే దిశగా అడుగు వేయకుండా, యీ ట్రాన్స్‌జండర్ సమూహాల అస్థిత్వ సమస్యలను గురించి పండిత చర్చలు జరపటంలోనూ అందుకు ప్రాధాన్యతను యిచ్చి వాటిని ప్రోత్సహించే కార్యక్రమంలో తలమునకలవుతూ వుండటం ఏవిధంగా సమర్థనీయం? అనేది ప్రశ్నించుకోవలసిన అవసరం వుంది. సిసలైన శ్రామిక ప్రజాపక్ష విప్లవ కార్యకర్తలు, మేధావులూ, ఆలోచనాపరులూ, వర్గస్పృహతో, యిటువంటి అస్థిత్వవాద ఉద్యమాల స్వరూప, స్వభావ, లక్ష్యాలను అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

**(హన్నా కోకో వ్రాసిన వ్యాసం ఆధారంగా)** ✺

# 29వ కోల్‌కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవం

– బాలాజీ (కోల్‌కతా)

**(గత సంచిక తరువాయి)**

**29వ** కోల్కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో 'పర్యావరణం' అనే విభాగంలో కొన్ని మంచి సినిమాలు ప్రదర్శించారు. లుక్ జ్యాకేత్ 'Antarctica Calling' ఆస్కార్ రేసులో పాల్గొన్న సౌనక్ సేన్ 'All That Breaths', రక్షిత్ తీర్థహళ్లి 'Thimmana Mottegalu' వంటి సినిమాలతో పాటు ఈ విభాగంలో ప్రదర్శించిన ఒక ముఖ్యమైన సినిమా 'Kalamkathi'.

KIFF 29
Kolkata International Film Festival
(Accredited by FIAPF)
5-12 December 2023

**'Kalamkathi' (2023) (బెంగాలీ) :**

మధ్యయుగంలో మన దేశానికి మొఘలులు వచ్చారు. ఆ తర్వాత ఆంగ్లేయులు వందల ఏళ్ళ వలస పాలన సాగించారు. దీని ఎన్నో ఫలితాల్లో ఒకటి – వర్ణం విషయంలో మన ఆలోచనలో వచ్చిన మార్పు! నలుపు, చామనఛాయ ప్రజలు ఎక్కువగా ఉండే మన దేశంలో 'తెలుపు' విషయంలో మన ఆకర్షణ విపరీతంగా పెరిగిపోయింది. నల్లని తమిళ హీరో కోసం కూడా నార్త్ ఇండియన్ మిల్క్ క్రీం బ్యూటీ హీరోయిన్‌గా కావాలి. కొత్త అవసరం కొద్దీ మొహాన్ని తళతళలాడించడానికి కాస్మెటిక్ కంపెనీలకు వందల వేలు ధారబోస్తున్నాం. కాస్మటిక్స్ చర్మానికి చేసే హాని గురించి మాత్రం ఆలోచించం. తెలుపు పట్ల మన అబ్సెషన్ మనం తినే తిండి మీదికి కూడా పాకింది. మన దేశంలో 'అన్నం' అన్నది 'భోజనానికి' పర్యాయపదం. "భోంచేశావా అని అడగడానికి బదులు అన్నం తిన్నావా?" అని అడుగుతాం. తిండిలో ఇంత ప్రధాన పాత్ర పోషించే అన్నం కూడా మన పళ్ళెంలో తళతళ మెరుస్తుండాలి. అందుకే వరిని పాలిష్ చేయడం మనకు అనివార్యమైంది. వరిపై వుండే చామనఛాయ పొరలో మనకు కావలసినంత ఖనిజాలు ఉంటాయి. తొలగిన ఆ పొరతో పాటు బీటా కెరోటిన్, థయామిన్, రిబో ఫ్లోవిన్, నియాసిన్, ఐరన్, జింక్ వంటి అవసరమైన ఖనిజాలు పోతాయి. మన నోటికి కేవలం కొండంత పిండి పదార్థం మాత్రమే అందుతుంది. ఒకప్పుడు లేని షుగర్ తదితర జబ్బులన్నీ గ్రామీణులకు కూడా ఇప్పుడు వస్తున్నాయి. వరి నుంచి తొలగించిన పొట్టుతో నూనె తయారుచేస్తున్నారు. దాన్నే 'rice bran oil' పేరుతో మనం కొనుక్కుంటున్నాం. మరో సంగతి ఏంటంటే, వరిని పాలిష్ చేసే నేపథ్యంలో ఆ గింజకు ఒక కొసన ఒక ముక్క విరిగిపోతుంది. నిజానికి అది వరి అండకోశం అన్నమాట. అండకోశంలో ఎంత అవసరమైన పోషక విలువలు ఉంటాయో కోడిగుడ్డు చూస్తే మనకు అర్థమౌతుంది. (The rice milling process usually includes the removal of the husk (dehusking) and removing of rice bran and embryo by polishing to obtain white rice. Source: https://www.sciencedirect.com/.../abs/pii/S0733521021000242)

"కాబట్టి పిల్లలూ, పాలిష్ చేసిన బియ్యం తింటున్నామంటే మనం నగ్నంగా వున్న, అందం లేని అన్నం తింటున్నట్టు" – అని పిల్లలకు అర్థమయ్యేలా చెబుతుంటాడు మారుమూల గ్రామం బడిలోని ఓ టీచర్. ఈ దృశ్యం 'కలంకాఠి' అనే బెంగాలీ సినిమాలోనిది. 'కలంకాఠి' అనేది బెంగాల్‌లోని వేలాది సంప్రదాయ వరి వెరైటీల్లో ఒకటి. వ్యవసాయ వేత్త, వ్యవసాయ కార్యకర్త దేబల్ దేబ్ ప్రకారం 4000 ఏళ్ళ నుండి వరి పండిస్తున్న బెంగాలు రైతులు వేర్వేరు ప్రాంతాల ప్రత్యేక పరిస్థితుల ప్రకారం 15,000 రకాల వరి వెరైటీలు ఆవిష్కరించారు. ఒక్కో రకానికి ఒక్కో ఔషధ గుణం కూడా వుంటుంది. కానీ 1965 నుండి హరిత విప్లవం పుణ్యమా అని వ్యవసాయంలో బహుళజాతి కంపెనీల విత్తనాలు రాజ్యమేలాయి. వేలాది సంప్రదాయ వరి పంటలు విలుప్తమయ్యాయి. దేబల్ దేబ్ తన seed bankలో 576 రకాలను భద్రపరిచాడు.

ఆధునిక వ్యవసాయం అంటే ఎరువుల కంపెనీలపై, పురుగుల మందుల కంపెనీలపై, విత్తనాల కంపెనీలపై, అధిక మొత్తంలో నీటి అవసరంపై ఆధారపడడం. అది బహుళజాతి కంపెనీలకు లాభాలూ, రైతులకు అప్పులూ, ఆత్మహత్యలూ మిగుల్చుతుంది. భూగర్భ జలాలను కొల్లగొట్టేలా, పర్యావరణాన్ని ధ్వంసం చేసేలా సాగుతుంది. మనుషులతో పాటు పశుపక్ష్యాదులకు ప్రాణ సంకటంగా మారుతుంది. దీనికి వ్యతిరేకంగా ఒక ప్రగతిశీల వ్యవసాయవేత్త సంప్రదాయ వ్యవసాయ పద్ధతిని ప్రచారం చేయడానికి చేస్తున్న ప్రయత్నమే 'కలంకాఠి' సినిమా. దర్శకుడు బిప్లబ్ దాస్.

**సినిమా కథ :**

బెంగాలు బాంకురా మారుమూల గ్రామంలో, ఒక వృద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త అసలైన వరి విత్తనాలూ, ప్రకృతి సహజ ఎరువులతో, రైతులందరూ ఏనాడో దాదాపు మరచిపోయిన సహజ వ్యవసాయ పద్ధతులను పునరుద్ధరించడానికి కంకణం కట్టుకుని కృషి చేస్తున్నాడు. కొంతమంది ప్రగతిశీల విద్యావంతులతో, ఔత్సాహిక యువ గ్రామస్థుల చిన్న సమూహం సహాయంతో, ఆధునిక వ్యవసాయ పరిశ్రమల కుట్రను

బహిర్గతం చేస్తూ, సంప్రదాయ వ్యవసాయాన్ని పునరుజ్జీవింపజేయడంలో గిరిజన సంఘాలకు కూడా మద్దతు అందిస్తున్నాడు. అక్కడ అతనో ఒక వ్యవసాయ సంగ్రహాలయాన్నీ, పిల్లల కోసం బడినీ నిర్వహిస్తున్నాడు. మెల్ల మెల్లగా అతని ప్రయత్నం ఉద్యమ స్థాయికి చేరడంతో స్థానిక భూ మాఫియా, బహుళజాతి పురుగుమందులు, ఎరువుల కంపెనీల నుండి అతనికి నిరంతర బెదిరింపులు ఎదురౌతాయి. ఈలోగా కోల్కతా నుండి ఆ గ్రామాన్ని చూట్టానికి వచ్చిన ఓ మహిళా పర్యావరణవేత్త, మరో మహిళా జర్నలిస్టు అక్కడి సంఘర్షణల్లో భాగమైపోతారు. దుర్మార్గుల కూటమి పెద్ద హాని తలపెట్టినా, చివరికి గ్రామస్తులు సంఘటిత శక్తితో ముందుకు కదలడానికి సంసిద్ధమౌతారు. ఈ విధంగా సినిమా ఆశావహంగా ముగుస్తుంది. ఈ సినిమాను డాక్టర్ పార్థ చక్రవర్తి, రాజీబ్, సుమన్ వంటి నిజజీవిత వ్యక్తుల ప్రేరణతో నిర్మించినట్టు దర్శకుడు ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. ఈ సినిమా అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో ఎన్నో అవార్డులు అందుకుంది.

**60 Days (2023) (Turkey) :**

'నీ పెల్విస్ పెద్దది. నువ్వు ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనివ్వ గలవు' అని కామెంట్ చేస్తాడు ఆల్ఫా ఏని'మేల్' రణ విజయ్. అలా అసభ్యంగా మాట్లాడినందుకు గీతాంజలికి కోపం రాదు. పైగా ఆ జంతువునే కోరి పెళ్ళాడుతుంది. ఒక స్త్రీ తన శరీరావయవాలతో సహా మొత్తం సమాజానికి ఆస్తి అనుకునే పురుషాధిక్య తంత్రాన్ని ఎగదోసే సినిమాలను నేడు ఎక్కువ నిర్మిస్తున్నారు. స్త్రీ పురుషుడి ఆస్తి అయినప్పుడు అది అపహరించబడకూడదు, తాకబడకూడదు. స్వచ్ఛంగా, పవిత్రంగా వుండాలి. ఇలాంటి ఆలోచనే స్త్రీ కన్నెపొర లేదా హైమన్ విషయంలో వివిధ సమాజాల్లో వుంది. పెళ్లి అయిన మొదటి రాత్రి సెక్స్ సమయంలో కన్నెపొర చిరిగి కాస్త రక్త స్రావం కాకపోతే పెళ్లి కూతురు పెళ్లికి ముందే కన్యత్వం కోల్పోయి ఉంటుందనే అపవాదు ఎన్నో సమాజాల్లో వుంది. ఈ అంశంపై వచ్చిన టర్కీ సినిమా '60 డేస్'.

టర్కీ గ్రామీణ ప్రాంతాల్లో పెళ్ళిళ్ళ సమయంలో స్త్రీ కన్యత్వానికి చాలా ప్రాధాన్యత వుంది. ఈ నేపథ్యంలో లతీఫ్ అనే అబ్బాయికి వారి ఇంటికి దగ్గరిలోని అమ్మాయి సెమిహాతో పెళ్ళవుతుంది. ఆమెతో అందమైన జీవితాన్ని ఊహించిన లతీఫ్కు మొదటి రాత్రి పెద్ద షాక్ తగుల్తుంది. బెడ్ షీట్పై రెండు రక్తపు బొట్లు కనిపించక పోయేసరికి బెంబేలెత్తిపోతాడు. అతడి ప్రపంచం తలకిందులౌతుంది. 'ఏమిటి సంగతి?' అని భార్యను గద్దించి అడిగితే, 'నా తప్పేమీ లేదు. నేను అమాయకురాలిని' అని చెబుతుందామె. కానీ అతడు శాంతించడు. విషయం తన కుటుంబ సభ్యుల మధ్య పెట్టి పెద్ద గొడవ చేస్తాడు. ఏదో కోల్పోయిన వాడిలా చిర్రుబుర్రు లాడుతాడు. వెంటనే విడాకు లిచ్చేస్తానని గోల చేస్తాడు. లతీఫ్ తల్లిదండ్రులు సెమిహా తల్లిదండ్రుల్ని పిలిపించి, విషయం చెప్పి, తమ పిల్లను తమ ఇంటికి తీసుకుపొమ్మని తగువు పెడతారు. సెమిహా తల్లిదండ్రులకు తలకొట్టేసినట్టవుతుంది. "వెంటనే ఇంటికి తీసుకెళ్తే, సెమిహా అన్నలకు సంగతి తెలిస్తే, ఆమెను నరికేస్తారు. ఇంతకాలం పక్కపక్కనే బతికిన వాళ్ళం, కష్టసుఖాల్లో పాలుపంచుకున్న వాళ్ళం. మా పిల్లను రెండు నెలలు మీ ఇంట్లోనే ఉండనివ్వండి. మీకు ఇబ్బంది కలిగించకుండా నడుచుకుంటుంది. అవసరమైతే ఆమె భత్యం ఖర్చు మేమే భరిస్తాం. రెండు నెలల తరువాత పెళ్లి వర్కౌట్ కాలేదని పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకుందాం. ఆ తర్వాత మా అమ్మాయి ఖర్మ. ఈ మాత్రం సహాయం చేయండి." అని బ్రతిమాలుతారు సెమిహా తల్లిదండ్రులు. సరే నంటారు ఇవతలి పెద్దలు. రెండు నెలలంటే 60 రోజులు. అదే ఈ సినిమా టైటిల్.

లతీఫ్ పట్టుదల మేరకు మొదట సెమిహాను ఒక గదిలో బంధించి ఉంచుతారు. ఆమెను ఒక పురుగును చూసినట్టు చూస్తుంటాడు లతీఫ్. కానీ ఇంటి పెద్దకోడలు అర్జెంటుగా పుట్టింటికి పోవడంతో ఆ ఇంటికి సెమిహా సేవలు అవసరమౌతాయి. ఆమె మంచితనం చాలా మంది మనసుల్ని జయిస్తుంది. ఎటొచ్చీ లతీఫ్ మాత్రం ఆమెకు ఆమడ దూరంలో ఉంటాడు. కానీ 60 రోజుల ప్రయాణం చాలా సుదీర్ఘమైనదే. లతీఫ్ మనసు కొంచెం కరగ్గానే ఆమెకు విపరీతంగా దగ్గరైపోతాడు. ఎంతగానంటే, ఇంటి వాళ్ళు అతడ్ని హెచ్చరించేంత! 'ఎలానూ విడాకులు తీసుకోబోతున్నాం కనుక, నువ్వు నా నుంచి దూరంగా ఉండటమే మంచిది' అని సెమిహా లతీఫ్ను వారిస్తుంది. ఇప్పుడు మధనపడటం లతీఫ్ వంతవుతుంది. ఇది టర్కీ 'మౌనరాగం' అనుకోనవసరం లేదు. మణిరత్నం సినిమాలో గత ప్రేమ ప్రస్తావన వుంది. ఇక్కడ ఒక అపోహతో కూడిన సామాజిక దురాచారంపై వివేకం, మానవత్వం జయించడం కనిపిస్తుంది.

నిజానికి యుక్తవయస్సులో అమ్మాయిలు శారీరక వ్యాయామాలు చేయడం, చెట్లు ఎక్కడం, డ్యాన్స్, జిమ్నాస్టిక్స్, సైకిల్ తొక్కడం లాంటివి చేస్తే కూడా కొన్నిసార్లు కన్నెపొర చిరుగుతుంది. కొన్ని సందర్భాల్లో హైమెన్ చిరగకుండానే సెక్స్ జరిగే సందర్భాలుంటాయి. కానీ ఈ విషయాలు తెలీక ఆడపిల్లలపై అనవసర వత్తిడి వస్తోంది. కన్యాత్వం కోల్పోయిన అమ్మాయిలు 30 వేల రూపాయల ఖర్చుతో హైమెనోప్లాస్టీ సర్జరీ చేసుకుంటే దానిని తిరిగిపొందగలిగే మార్గం వచ్చిందట! పెళ్ళిళ్ళ సీజన్లో దీనికి చాలా డిమాండ్ ఉంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. సమాజంలో ఆలోచన సరళి సరిగ్గా లేకపోతే ఎన్నెన్ని వింతపోకడలు చూడాల్సి వస్తుందో! మన టర్కీ సినిమా మాత్రం సుఖాంతమే అవుతుంది. ఈ సినిమాకు దర్శకుడు ఇస్మాయిల్ దోరుక్.

**Broken Dreams Stories from the Myanmar Coup (2023) (Myanmar) :**

The Network for the Promotion of Asian Cinema (NETPAC) అవార్డుల కోసం ఎంపికయ్యే ఆసియన్ సినిమాల విభాగం ఒకటి కోల్కతా అంతర్జాతీయ చలనచిత్రోత్సవ అంతర్భాగంగా వుంది. దీన్ని Asian Select విభాగం అంటారు. ఈ విభాగంలో ఈ ఏడాది ఉత్తమ సినిమా అవార్డు Broken Dreams Stories from the Myanmar Coup (2023) (Myanmar) అనే మయన్మార్ అండర్ గ్రౌండ్ సినిమాకు దొరికింది. నిజానికిది ఎనిమిది మంది దర్శకులు నిర్మించిన తొమ్మిది లఘు చిత్రాల సమాహారం. హ్యాండ్ హెల్డ్ కెమేరాలతో, కొన్ని సందర్భాల్లో మొబైల్ కెమేరాలతో రహస్యంగా నిర్మించిన చిత్రాలివి. తొమ్మిది కథల్ని వేరువేరుగా షూటింగ్ చేసి ఒక్క చోట ఎడిట్ చేసి

'నైన్ ఫోల్డ్ మొజాయిక్' సమర్పణగా విడుదల చేశారు. 2021లో మయన్మార్‌లో జరిగిన సైనిక కుట్ర అంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూలదోసి నియంతృత్వాన్ని కొనసాగిస్తోంది. ఈ దేశానికి సైనిక కుట్రలు మామూలే. ఈ కుట్ర జరిగిన రెండేళ్ళ తరువాత దేశంలో అంతర్యుద్ధం వంటి పరిస్థితి నెలకొంది. మిలిటరీ జుంటా వారు చట్టవిరుద్ధంగా హత్యలు చేస్తూ ప్రజాస్వామ్య ఉద్యమకారుల ఆస్తులను కైవసం చేసుకుంటున్నారు. వారి కుటుంబాలను జైళ్లలో కుక్కేస్తున్నారు. చాలామంది కార్యకర్తలు దేశం నుండి పారిపోయారు లేకుంటే ప్రతిఘటన చేసే సాయుధ సమూహాలలో చేరిపోయారు. ఈ సినిమాలు నిర్మించిన ఎనిమిది మందీ దేశం నుండి బహిష్కృతులే.

ఆత్మీయులను కోల్పోయిన వారి బాధలూ, భావప్రకటనా స్వేచ్ఛను కోల్పోయిన బాధితులూ, మిలిటరీ అత్యాచారాల వలన నేటికీ పీడకలలతో చిత్రవధ అనుభవించే అభాగ్యులూ, మిలిటరీ వారు స్వస్థలాల నుండి తరిమి వేయగా కీకారణ్యాల్లో తలదాచుకున్న మూల వాసుల అగచాట్లూ – ఇలా అసాధారణమైన సంఘటనల్లో చిక్కుకున్న సాధారణ మయన్మార్ పౌరుల వివిధ దృక్కోణాలను చిత్రీకరిస్తుంది ఈ సినిమా. పరిమిత వనరుల్లో కూడా అద్భుతమైన కథన శైలిలో సాగుతాయి ఈ లఘు చిత్రాలు. ఒక సీసాలోని నీటిలో చిక్కి ఉన్న చిన్న చేపపిల్ల దృష్టికోణం నుండి తీసిన లఘు చిత్రం ఇది. చాలా ఆసక్తికరంగా వుంటుంది. ఇందులో ఒక్క పాత్రధారి కూడా ఉండదు. నీటిలోని చేప మయన్మార్ పౌర సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఒక ఖాళీ కుర్చీతో జరిపే సంభాషణ సినిమా దర్శకుడితో ఇంటర్వ్యూ అనిపించేలా చిత్రీకరణ చాలా వినూత్నంగా అనిపిస్తుంది. అసాధారణ పరిస్థితులు అసాధారణ వ్యక్తీకరణకు దారితీస్తాయి. ఈ విషయాన్ని ఇరాన్ దర్శకుడు జాఫర్ పానహీ పదే పదే రుజువు చేశాడు.

ఈ సినిమా దర్శకుల్లో ముఖ్యుడైన Bo Thet Htun అనే 36 ఏళ్ల యువకుడు ఈ సినిమాను ప్రెజెంట్ చేయడానికి కోల్కతా వచ్చాడు. ఈయన గతంలో మిలిటరీ కుట్రపై నిర్మించిన 'మయన్మార్ డైరీస్' అనే డాక్యుమెంటరీకి అంతర్జాతీయంగా గుర్తింపు రావడంతో ప్రభుత్వం ఈయనను గాలించడం మొదలుపెట్టింది. ప్రస్తుతం థాయ్‌ల్యాండ్‌లో తలదాచుకున్నాడు. అక్కడ్నుంచి థాయ్ మయన్మార్ బోర్డర్‌లో వున్న కొన్ని శరణార్థి శిబిరాల్లోని బాధితుల్ని కలిసి వారి సహాయంతో ఈ సినిమాలోని తన లఘు చిత్రం 'Dancing in the Dark' సినిమాను నిర్మించాడు. ఐక్యరాజ్య సమితి లెక్కల మేరకు ప్రస్తుతం 20 లక్షల మయన్మార్ ప్రజలు విదేశాలకు వలస పోయారు. ఈ సినిమాలో అంగ్ సాన్ సూకీ గురించి కూడా ఒక లఘు చిత్రం వుంది. కానీ Bo Thet Htunకు ఒక కలకత్తా విలేకరి అంగ్ సాన్ సూకీ గురించీ, రోహింగ్యాల గురించి అడిగినపుడు చాల నిజాయితీగా జవాబిచ్చాడు. రోహింగ్యాలపై జరిగిన అన్యాయాన్ని ఖండించాడు. మయన్మార్ సినీ పరిశ్రమ జుంటా ప్రభుత్వాన్ని సమర్థించే వారు, వ్యతిరేకించేవారు అనే రెండు శిబిరాల్లో చీలి వుందట!

**Junks and Dolls (2023) (Iran) :**

చండీగఢ్‌లో నేక్‌చంద్ రాక్ గార్డెన్ ఉంది. అక్కడ పనికిరాని వస్తువులతో నేక్ చంద్ తయారుచేసిన అపురూపమైన కళాఖండాలను చూడవచ్చు. ఇరాన్ దర్శకురాలు మనిజే హెక్మత్ సినిమా 'Junks & Dolls' చూసినపుడు అనుకోకుండా నేక్‌చంద్ గుర్తొస్తాడు.

అది ఉత్తర ఇరాన్‌లోని అతి పెద్ద చెత్తకుప్పల గుట్టల ప్రదేశం. అక్కడికి ఒక పెళ్ళయిన జంటను తీసుకు వస్తాడు దాన్ని పర్యవేక్షించే లోకల్ కాంట్రాక్టర్. ఆ జంట ఆ చెత్త కుప్పల ప్రాంతానికి గార్డులుగా వుండాలి. ఎవరో అభాగ్యులైతే తప్ప అటువంటి పని కోసం అటువంటి ప్రాంతానికి రారు. కటిక పేదరికంలో ఉన్న జంట అది. పైగా ఆ భర్త కొంచెం మతి స్థిమితం లేని వాడు. సాధారణ జనాలకు అతడు abnormal. కానీ ఆ భార్యకు తన భర్తపై ఎటువంటి కంప్లైంట్ కూడా వుండదు. సంచార బ్రతుకు బ్రతికే ఆ జంట అక్కడో కూలిన ఇంటిని అందమైన ఇల్లుగా మార్చుకుంటారు. ఇతరులు abnormalగా చూసే ఆ భర్త అసాధారణ ప్రతిభ వున్నవాడు. పాత రేడియో, టీవీ, కెమెరా – ఇలా ఏ వస్తువునైనా రిపేర్ చేసే అసాధారణ విద్య అతడి సొంతం. ఆ భార్య అందుకే తన భర్తను 'ఇంజనీరు' అని ఇతరులకు పరిచయం చేస్తుంది. ఆ చెత్త కుప్పలపై రీసెర్చ్ చేయడానికి ఒక ఫోటో జర్నలిస్టు అక్కడికి వస్తుంది. ఆమె ఆసక్తి ఈ అభాగ్య జంటపై, మరీ ముఖ్యంగా ఈ అసాధారణ ప్రతిభాపాటవాలున్న ఆ భర్తపై పడుతుంది. ఆమె వారికి దగ్గరవుతుంది. తన కెమేరాతో ఆ జంట ఫొటో తీసి అందంగా ఫ్రేమ్ కట్టించి వారికి బహుమతిగా ఇస్తుంది. ఆ జంటకు ఆ దగ్గర్లో ఉన్న కొన్ని కుటుంబాలతో స్నేహం కూడా ఏర్పడుతుంది. ఊరుమ్మడి బ్రతుకులకు ఒక స్థిరమైన చిరునామా దొరికిందని అనుకుంటుండగా, అధికారులు వారితో ఆ స్థలాన్ని ఖాళీ చేసి వెళిపొమ్మని చెబుతారు – అక్కడ మరింత ఎక్కువ చెత్త డంప్ చెయ్యాలి కనుక! ఆఖరు దృశ్యంలో ఆ చెత్తను ఒక పెద్ద యంత్రం బుల్డోజ్ చేస్తుండగా ఆ జంట ఫొటో (జర్నలిస్టు తీసినది) ఆ చెత్త మధ్య దొర్లుతూ కనిపిస్తుంది. Junks అంటే చెత్త, Dolls అంటే బొమ్మలు. ఆ చెత్త కుప్పల్లో దొరికిన వస్తువులూ, వస్త్రాలతో ఆ భర్త ఎన్నో బొమ్మలు తయారుచేయడం, ఆ బొమ్మల కోసం ఆ దగ్గర్లో నివసించే పాప వారికి చేరువకావడం, ఆ బొమ్మలు వారికి జీవనోపాధి కావడం మనమీ కథలో చూస్తాం. మొదట్లో ఈ జంటను (ప్రత్యేకించి ఆ భర్త కారణంగా) అంటరాని వాళ్ళుగా చూస్తారు. కానీ అతడు నిరపాయకరమైన వాడేకాక, అవసరమైనవాడని ఇతరులు మెల్ల మెల్లగా గ్రహిస్తారు.

సినిమా శీర్షిక ఈ జంటకే కాక ప్రతీకాత్మకంగా మొత్తం సమాజానికి వర్తిస్తుందని మనకు అర్థమౌతుంది. ఆ ప్రాంతంలో వింత రోగాలు ప్రబలుతూ చాలా మంది మరణిస్తున్నారు. దీనికి కారణం ఆ చెత్తకుప్పల విషం అక్కడి సెలయేరులో కలవడం, ఆ నీటినే అక్కడి జనాలు తాగాల్సి రావడం! అంటే అక్కడి జనం ఒక జంటను మాత్రమే చెత్తగా పరిగణిస్తే, వ్యవస్థ అక్కడి జన సముదాయం మొత్తాన్ని చెత్త కుప్పగా లెక్కకడుతోందన్న మాట! ఈ విధంగా ఎన్నో భాష్యాలకు తావిస్తుంది ఈ సినిమా. 'ఈ ప్రపంచంలోని సకల జనులందరూ సుఖప్రదంగా వుండాలని కోరుకుందాం' అంటూ కోల్కతా ప్రేక్షకులకు తన సినిమాను ప్రజెంట్ చేస్తూ చెప్పింది దర్శకురాలు మనిజె హెక్మత్. ✺

వ్యాసం

# మహర్ల, మాంగ్‌ల దుఃఖభరిత జీవితం గురించి

- ముక్తా సాల్వే

*(జ్యోతిబాఫూలే, సావిత్రీబాయి ఫూలే దంపతులు 1848లో బుధవారపు పేటలోని భీడేవాడలో మొట్టమొదటి బాలికా పాఠశాల ప్రారంభించారు. 1852లో విఠల్‌పేటలో మూడవ బాలికా పాఠశాల తెరిచారు. ఈ పాఠశాలల్లో అన్ని కులాలకు చెందిన బాలికలకు ప్రవేశం కల్పించారు. ఈ స్కూలు విద్యార్థిని 14 సంవత్సరాల బాలిక ముక్తా సాల్వే, స్కూలు కార్యక్రమంలో భాగంగా రాసిన వ్యాసం ఇది. ఈ వ్యాసం తప్ప ముక్తా సాల్వే రాసినదేదీ పరిశోధకులకు దొరకలేదు. ఆధునిక భారత దళిత ఫెమినిస్టు సాహిత్య చరిత్రలో ఈ వ్యాసాన్ని మొట్టమొదటి రచనగా విమర్శకులు గుర్తించారు.*

*కుల, లైంగిక అసమానత్వాలకు వ్యతిరేకంగానేగాక, ఫూలే దంపతులు రైతులు, శూద్రులైన వివిధ చేతివృత్తులవారు, దళిత కులాలు, మహిళలను చైతన్యపరచడం, వారికి సాధికారత సంపాదించడం మొదలైన సామాజిక కార్యక్రమాలు చేబట్టారు. వీటన్నిటి ఫలితమే 14 ఏళ్ళ విద్యార్థిని ముక్తా సాల్వే రాసిన వ్యాసం. ఇది రెండు భాగాలుగా 169 ఏళ్ళ క్రిందట 'జ్ఞానోదయ' అనే పత్రికలో 18 ఫిబ్రవరి 1855నా, 1 మార్చి 1855నా ప్రచురింపబడింది. ఆ పత్రిక తరువాతి సంచికలలో ఈ వ్యాసంపై విమర్శగా రెండు లేఖలను ప్రచురించారు. 'జ్ఞానోదయ'లో దీనిని ప్రచురిస్తూ "ఈ వ్యాసం రాసిన విద్యార్థిని జ్యోతిబా స్కూలులో మూడేళ్ళు చదివిందనీ, తన తలిదండ్రుల బాధామయ జీవిత సంఘటనలు విన్న తర్వాత ఈ వ్యాసం రాసిందనీ, తాము వ్యాసాన్ని ఎక్కడా మార్చలేదనీ (దిద్దలేదనీ)" ప్రకటించింది.*

– ఇంగ్లీషు నుంచి అనువాదం : **కొత్తపల్లి రవిబాబు**)

**నేనొక** అంటరాని బాలికను. నన్ను పశువుకంటే హీనంగా పరిగణిస్తారు. కాని నా గుండె నిండా మహర్ మాంగ్ ప్రజల బాధల గాథలను దేవుడు నింపాడు. సమస్త సృష్టికి మూలమైన సృష్టికర్తను తలచుకుంటే వచ్చిన ధైర్యంతో ఈ వ్యాసాన్ని రాయడానికి ధైర్యం చేస్తున్నాను. ఈ సృష్టికర్త మాంగ్‌లనూ, మహర్లనే గాక బ్రాహ్మణులను కూడా సృష్టించాడు. ఆయనే ఈ వ్యాసం రాసే తెలివితేటలు నాకు ఇచ్చాడు. నా కృషి ఫలవంతమయ్యేట్లు ఆయన నన్ను ఆశీర్వదిస్తాడు.

కుక్షింభరులైన బ్రాహ్మణుల వాదనలను వేదాల ఆధారంతోనే త్రిప్పికొట్టినా, మనల్ని ద్వేషించే ఈ బ్రాహ్మణులు తాము మాకంటే ఎంతో గొప్పవారమనీ, వేదాలు వారి సొంత ఆస్తి అనీ అంటారు. అయితే స్పష్టంగా, వేదాలు బ్రాహ్మణులవే అయితే, అవి నిశ్చయంగా మనవి కావు అని స్పష్టమౌతుంది.

వేదాలు బ్రాహ్మణులవే గనుక అయితే, మనకొక మతగ్రంథం లేదన్నది బహిరంగ రహస్యం. మనకు మత గ్రంథం లేదు. అంటే మనకేమతమూ లేదన్నమాట. వేదాలు బ్రాహ్మణులకు మాత్రమే చెందినవైతే, వేదాలు నిర్దేశించినట్లుగా మనం వ్యవహరించనక్కర్లేదు. బ్రాహ్మణులు చెబుతున్నట్లుగా, వేదాల వంక చూడటమే మనలను ఘోరమైన పాపంలోకి నెడుతుంది అనడమే నిజమైతే, వాటిని అనుసరించడం ఎంత తెలివితక్కువతనం? ముస్లిములు ఖురాను ప్రకారం వారి జీవితాలను దిద్దుకుంటారు. ఇంగ్లీసువారు బైబిల్‌ని అనుసరిస్తారు. బ్రాహ్మణులకు వారి సొంతవైన వేదాలున్నాయి. వాళ్ళందరూ అనుసరించడానికి మంచిదో, చెడ్డదో ఒక మతం వుంది. గనుక వారు మనకంటే – ఎటువంటి మతమూ లేని మనకంటే ఎంతో కొంత సంతోషంగా వున్నారు. అయ్యో! దేవుడా! చెప్పు మా మతమేదో? దైవమా! నీ నిజమైన మతమేదో మాకు చెప్పు – దాని ప్రకారం మా జీవితాలను దిద్దుకుంటాం. కొందరికే సకల సౌకర్యాలు వుండి, మిగిలినవారికి ఏమీ లేకుండా చేసే మతం ఈ భూ ప్రపంచం నుండి అదృశ్యమవుగాక! అటువంటి వివక్షాపూరిత మతం గురించి గొప్పలు చెప్పుకోనివిధంగా మా మనసులు వుండుగాక!

పేదవారైన మాంగ్‌లను, మహర్లను వారి వారి సొంత భూముల నుండి వీరు తరిమేసి, పెద్దపెద్ద భవంతులు కట్టుకోడానికి ఆ భూములను ఆక్రమించారు. అంతేకాదు. మాంగ్‌లు, మహర్లు విషతుల్యమైన మాదకద్రవ్యాన్ని త్రాగేట్లు చేసి, వారి భవంతుల పునాదుల్లో వారిని పూడ్చిపెడుతున్నారు. ఆవిధంగా పేదవారైన మనలను తరతరాలుగా తుడిచిపెట్టేస్తున్నారు. బ్రాహ్మణులు మనలను పరమ నీచంగా చూస్తున్నారు. వారు మనలను ఆవులకంటే, పశువులకంటే అధములుగా పరిగణిస్తున్నారు.

బాజీరావు పీష్వా పరిపాలనా కాలంలో వారు మనలను గాడిదలకంటే నీచంగా చూడలేదూ? ఒక కుంటి గాడిదను కొడితే అది ప్రతిఘటిస్తుంది. కాని మహర్లను, మాంగ్‌లను దారుణంగా హింసిస్తుంటే అభ్యంతర పెట్టడానికి ఎవరున్నారు? బాజీరావు పాలనలో మాంగ్, లేక మహర్ ఎవడైనా వ్యాయామశాల ముందు నుండి గనుక వెళ్తే, వాడి తల నరికేసి, వాళ్ళ కత్తులు బ్యాట్‌లుగానూ, నరికేసిన తలలను బంతులుగానూ ఆడుకునేవారు. వారి ఇంటి ముందు నుంచి పోయినా మాకు శిక్ష విధింపబడుతుంటే, ఇంక మేము విద్య నేర్చుకునే ప్రశ్నే లేదు. జ్ఞానం సంపాదించే స్వేచ్ఛే లేదు. ఏదో ఒక రకంగా ఎవరైనా మాంగ్ కానీ, మహర్ కానీ చదవడం, రాయడం నేర్చుకుంటే, ఆ విషయం బాజీరావుకు తెలిస్తే, "బ్రాహ్మణుల హక్కును మాంగ్ లేక మహర్ హరించివేసినట్లే"నని ప్రకటించేవాడు. "వీరికి చదువుకోడానికి ఎంత ధైర్యం! బ్రాహ్మణులకు అధికారికంగా నిర్దేశించిన విధులను ఈ అంటరానివారికి అప్పగించి, వీరి మంగలిపొదులు మనం పట్టుకొని వితంతువులకు గుండు గొరగాలా?" ఇటువంటి వ్యాఖ్యానాలతో వారిని శిక్షించేవాడు.

ఇంతకీ మాకు విద్యను నిషేధించడంతో బ్రాహ్మణులు సంతృప్తి చెందారా? లేనేలేదు. బాజీరావు కాశీకి పోయి అక్కడ దిక్కులేని చావు చచ్చాడు. కాని ఇక్కడ మహర్లు తాము అంటరానివారైనా, మాంగ్‌లతో కలసి వుండటాన్ని ఇష్టపడరు. వారిలో కొంత బ్రాహ్మణీయ భావజాలం ప్రవేశించి, తాము మాంగ్‌లకంటే అధికులుగా పరిగణించుకుంటారు. మాంగ్‌ల నీడ తమపై పడితే అపవిత్రమైనట్లు భావిస్తారు. తను ఆధిక్యతను ప్రకటించుకోడానికి పవిత్రమైన దుస్తులలో (మడిబట్టలు) సగర్వంగా సంచరించే పాషాణ హృదయులైన బ్రాహ్మణులు, అంటరానివారిగా మాపై ముద్ర వేసినందుకు మేము గడిపే బాధామయ జీవితాన్ని చూసి ఏ మాత్రమైన జాలి, కరుణ ప్రదర్శిస్తారా? అంటరానివారం గనుక మాకెవరూ ఉద్యోగాలు ఇవ్వరు. ఉద్యోగం లేదు అంటే అర్థం డబ్బులేదు అని. పేగులను మెలిత్రిప్పే పేదరికాన్ని మేం భరించాలి. ఓ జ్ఞానులైన పండితులారా! మీ స్వార్థపూరిత పౌరోహిత్యాన్ని కట్టపెట్టండి! మీ కపట జ్ఞానపు మాటలు ఆపండి! నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. మా గర్భిణీ స్త్రీలకు కాన్పుల సమయంలో కనీసం పైకప్పు వున్న ఇళ్ళైనా వుండవు. వారు వానకు, చలికి ఎంత బాధపడతారో! మీరే ఆ పరిస్థితిలో వున్నామనుకొని ఆ బాధను అర్థం చేసుకోండి. ప్రసవ సమయంలో ఏదైనా జబ్బు వస్తే, డాక్టర్లకు, మందులకు వారికి డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? అటువంటి రోగులకు ఉచితంగా సేవచేసే మానవత్వం గల డాక్టర్లు ఎవరైనా ఎప్పుడైనా వున్నారా?

బ్రాహ్మణ పిల్లలు తమపై రాళ్ళు విసరి తీవ్రంగా గాయపరచినా మాంగ్, మహర్ పిల్లలు వారిని తప్పుపట్టే ధైర్యం ఏనాడూ చేయరు. అదంతా వారు మౌనంగా భరిస్తారు. ఎందుకంటే ఆ బ్రాహ్మణులు విసిరే ఎంగిలి మెతుకుల కోసం తాము వారి ఇళ్ళముందు పడికాపులు కాయాలని వారికి తెలుసు. అయ్యో! దైవమా! ఎంత కఠోరమైన వ్యథ ఇది! ఈ అన్యాయాల గురించి ఇంకా రాయాలంటే నాకు ఏడుపు కట్టలు త్రెంచుకుని వచ్చేస్తుంది. ఇటువంటి అణచివేత వల్లనే, దయామయుడైన దేవుడు మాకు బ్రిటీషువారి ప్రభుత్వాన్ని పంపించాడు. ఈ ప్రభుత్వ పాలనలో మా బాధలకు ఉపశమనం ఎలా జరిగిందో చూద్దాం.

గతంలో గోఖలేలు, ఆప్టేలు, త్రికాజీలు, అంధావేలు, పన్సారేలు, కాలేలు, బెహ్రేలు (ఇవన్నీ బ్రాహ్మణుల ఇంటిపేర్లు) తమ ఇళ్ళల్లో ఎలుకలను చంపడంలో వీరత్వం చూపినవారు, మమ్ములను గర్భిణీ స్త్రీలను కూడా వదలకుండా, ఎటువంటి నీతి, నియమం లేకుండా దారుణంగా పీడించేవారు. ఇప్పుడీపద్ధతి ఆగిపోయింది. పూణేలో పీష్వాల పాలనలో మాంగ్‌లను, మహర్లను వేధించడం, హింసించడం సర్వసాధారణంగా జరిగేది. ఇది ఈనాడు లేదు. కోటలు, భవనాలు కట్టేటప్పుడు పునాదుల్లో వేయడానికి జరిగే నరబలులు ఈనాడు లేవు. ఇప్పుడు మమ్ములను ఎవరూ సజీవంగా సమాధి చేయడంలేదు. ఈనాడు మా జనాభా పెరుగుతోంది. గతంలో ఎవరైనా మాంగ్, మహర్‌లు మంచి మంచి దుస్తులు ధరిస్తే, మేం బ్రాహ్మణులమే అటువంటివి ధరించాలని అనేవారు. ఖరీదైన దుస్తులు ధరిస్తే చాలు, వాటిని మేము దొంగిలించామని ఆరోపించేవారు. అంటరానివారు మంచి దుస్తులు ధరిస్తే వారి మతం అపవిత్రమైపోయి, అది అంతమయ్యే ప్రమాదం వుందనేవారు. అటువంటి దుస్తులు ధరించిన మాంగ్, మహర్లను చెట్టుకి కట్టేసి శిక్షించేవారు. కాని బ్రిటీషువారి పాలనలో ఐతే, ఎవరైనా సరే తాము కొనుక్కున్న దుస్తులను ధరించవచ్చు. గతంలో అగ్రకులాలకు వ్యతిరేకంగా ఏదైనా నేరం చేస్తే, అంటరానివారి తల నరికేసేవారు. ఇప్పుడు ఈ అమానుష శిక్షలు ఆగిపోయాయి. మాపై వేసే దోపిడీ స్వభావం కల అధిక పన్నులు విధించడం ఆగిపోయింది. కొన్ని ప్రాంతాలలో అంటరానితనం పాటించడం ఆగిపోయింది. క్రీడా మైదానాలలో వారిని చంపేయడం ఆగింది. ఇప్పుడు మేము స్వేచ్ఛగా మార్కెట్‌కు వెళ్ళవచ్చు. నిష్పక్షపాత బ్రిటీషువారి పాలనలో ఇటువంటి మేళ్ళు ఎన్నో జరిగాయి. మమ్ములను మురికివారిగా పరిగణించిన బ్రాహ్మణులు, మమ్ములను ఈ బాధ నుండి విముక్తి చేయాలనుకోవడం నాకెంతో ఆశ్చర్యాన్ని కలుగచేస్తోంది. అయితే బ్రాహ్మణులందరూ అలా లేరు. సైతాను ప్రభావంలో వున్నవారు గతంలోలాగానే మాపై ద్వేషం కక్కుతున్నారు. మమ్ములను విముక్తిపరచడానికి ప్రయత్నిస్తున్న బ్రాహ్మణులకు వారు కుల బహిష్కరణ శిక్ష విధిస్తున్నారు.

ఉత్తములైన కొందరు మహర్లు, మాంగ్‌ల కొరకు పాఠశాలలు స్థాపించారు. వాటికి బ్రిటీష్ ప్రభుత్వం తన సహకారాన్ని అందిస్తోంది. ఓ మహర్లూ – మాంగ్‌లు! మీరు పేదవారు – నిరంతర వ్యాధి పీడితులు. జ్ఞానమనే మందు మాత్రమే మీ రుగ్మతలను నయం చేస్తుంది. అజ్ఞానమే మిమ్ములను గుడ్డినమ్మకాల నుండీ, మూఢవిశ్వాసాల నుండీ విముక్తి పరుస్తుంది. మీరు నీతివంతులుగా, ఆదర్శవంతులుగా మారతారు. జ్ఞానమే దోపిడీకి అంతం పలుకుతుంది. మిమ్ములను గతంలో పశువుల కంటే హీనంగా చూసినవారు ఇకముందు అలా చేయడానికి సాహసించరు. కనుక కష్టపడండి – అధ్యయనం చేయండి. విద్యావంతులు కండి – మీరు మానవులుగా రూపొందండి. అయితే దీన్ని నేను రుజువు పరచలేను. ఎందుకంటే, విద్యాధికులు కూడా ఒక్కోసారి చెడ్డ పనులు చేసి మనలను ఆశ్చర్యపరుస్తారు.

వ్యాసం



# యువత

– భగత్‌సింగ్

**భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతి మార్చి 23 సందర్భంగా....**

*('యువక్' శీర్షికతో హిందీలో రాసిన వ్యాసానికి ఇది తెలుగు అనువాదం. భగత్ సింగ్ 'బలవంత్ సింగ్' అనే కలం పేరుతో ఈ వ్యాసం రాశాడు. వ్యాసం తొలుత కలకత్తా నుంచి నాడు వెలువడిన 'మత్‌వాలా' అనే హిందీ వారపత్రిక సంపుటి **2**, సంచిక **38**, **16** మే **1925** సంచికలో అచ్చుయింది. పత్రికా సంపాదకులు ఆచార్య శివపూజన్ సహాయ్ తనే సంపాదకత్వం వహించిన హిందీ వ్యాస సంకలనం, యువక్ సాహిత్య్‌లో ఈ వ్యాసాన్ని చేర్చినట్టు తన డైరీలో రాసుకున్నారు. ఈ వ్యాసాన్ని సంపాదకునికి లాహోర్ నుంచి పంపిస్తూ భగత్ సింగ్ తన అసలు పేరుకి బదులు 'బలవంత్ సింగ్' అని ప్రచురించమనే కోరాడు.* – సం॥)

**యవ్వనం** మానవ జీవితానికి వసంతరుతువు. యవ్వన ప్రాదుర్భావంతో మనిషి మత్తెక్కి పోతాడు. వెయ్యి బాటిల్స్ మధువు తాగినంత మత్తు అతణ్ని ఆవహిస్తుంది. విధాత ప్రసాదించిన శక్తులన్నీ సహస్రధారలై ఎగదన్నుకొస్తాయి. అతనిలో మదించిన ఏనుగులా నిరంకుశత్వమూ, వర్షాకాలాల్లో ఉప్పొంగి ప్రవహించే శోణభద్ర నదిలా, ప్రళయకాల ప్రభంజనంలా ప్రచండత్వమూ, వసంతకాలపు తొలి మల్లెమొగ్గలా కోమలత్వమూ, జ్వాలాముఖిలా ఉచ్ఛృంఖలత్వమూ, భైరవి రాగంలా మధురమూ అయినది యవ్వనం. ఉజ్వల ప్రభాతపు శోభ, స్నిగ్ధ సంధ్య సొబగు, శరచ్చంద్రిక మాధుర్యం, గ్రీష్మకాలపు మధ్యాహ్నపు తాపం, భాద్రపద అమావాస్య అర్ధరాత్రి నాటి భీషణత్వం – ఇవన్నీ యవ్వనకాలంలో మీకు కనిపిస్తాయి. విప్లవకారుని జేబులోని హాండ్ గ్రైనేడ్‌లా, కుట్రదారుని మొలకి వున్న తోలు పట్కాకి వేలాడుతున్న గుళ్ళు లోడు చేసిన పిస్తోలులా, వీరుని చేతిలోని ఖడ్గంలా వుంటుంది.

మానవ దేహానికి యవ్వనం. ప్రపంచంలోని ఆర్తనాదాలన్నిటినీ తెచ్చి విధాత 16 నుంచి 25 ఏళ్ళ దాకా రక్తమాంసాల సందుకా పెట్టెలో బంధించి వేస్తాడు. ఇహ పది సంవత్సరాల దాకా చిల్లుపడ్డ పడవలా పెనుతుపానులో, ప్రవాహం మధ్యలో పెనుగులాడుతుంది. చూడ్డానికి యవ్వనకాలం సస్యశ్యామల వసుధ కన్నా సుందరమయినది. అయితే దానిలో భూకంపంలా భీకరత్వం నిబిడీకృతమయి వుంటుంది. అందుచేత యవ్వనంలో మనిషికి రెండే రెండు మార్గాలు–అయితే అతను ఔన్నత్యపు ఉన్నత శిఖరాన్ని అధిరోహించనూ వచ్చు, లేదా అధః పాతాళపు చీకటి కందకంలో పడిపోనూ వచ్చు. అయితే త్యాగి అవుతాడు లేదా భోగిగా మారిపోతాడు. అతను దేవుడూ కాగలడు, లేదా నరపిశాచమూ కాగలడు. లోకాన్ని గడగడలాడించినా అతనే, అభయహస్తం ఇవ్వదలచుకున్నా అతనే. యువకుల ఇష్టారాజ్యమే ఈ లోకం. ప్రపంచ చరిత్రంతా యువకుల కీర్తి పతాకాలతో నిండిపోయి వుంది. యువకులే రణదండీ లలాట రేఖలు. యువకులే స్వదేశ యశోదుందుభి తూర్యనాదాలు. యువకులే స్వదేశ విజయ వైజయంతి దృఢ దండం. వారు మహా సముద్రంలో పడి లేచే ఉత్తుంగ తరంగాలులా ఉద్దండ పిండాలు. మహాభారతంలోని భీష్మపర్వంలో విసిరిన తొలి సవాలుగా భయంకరులు. ప్రేయసీ ప్రియుల తొలి కలయికలోని ప్రగాఢ చుంబనంలా సరసులు. రావణుని అహంకారంలా నిర్భయులు. ప్రహ్లాదుని సత్యాగ్రహంలా దృఢంగా, స్థిరంగా వుంటారు. మీకు విశాల హృదయులు కావాలా? యువకుల హృదయాలు వెదకండి. ఆత్మత్యాగం చేసే వీరులు కావాలా? యువకుల్ని అడగండి. రసికతకి వారు పెట్టింది పేరు. భావావేశంపై వారి ముద్రే వుంటుంది. ఛందస్సు తెలీకపోయినా వారు ప్రతిభావంతులైన కవులు. కవులు సయితం వారి హృదయారవిందాల మధుపాయిలు. రసాల పరిభాష తెలీకపోయినా కవిత్వ మర్మం తెలిసినవారు. ఈ సృష్టికి విషమ సమస్య యువకులు. సృష్టి కౌశల్యపు మేలుబంతులు యువకులు. సంధ్యా సమయంలో నది ఒడ్డున కూచుని, క్షితిజం వేపుకి సాగిపోయే రక్తరంజిత సూర్యుణ్ణి గంటల తరబడి తదేకంగా తిలకిస్తూ వుంటారు. నదికి ఆవలి ఒడ్డు నుంచి గాలిలో తేలిపోతూ వస్తున్న సంగీత లహరి మంద ప్రవాహంలో లీనమయిపోతారు. చిత్రమయినది వారి జీవితం. అద్భుతమయినది వారి సాహసం. అమోఘం వారి ఉత్సాహం.

వారెంతో నిశ్చింతగా వుంటారు. అలాగని జాగ్రత్తగా వుంటారా? అదీ లేదు. బుద్ధి పుడితే రాత్రికి రాత్రంతా జాగరణ చేసెయ్యగల సమర్థులు వారు. జ్యేష్ఠమాసపు మిట్టమధ్యాహ్నం వారి దృష్టిలో చైత్ర మాసపు పున్నమి వెన్నెల; శ్రావణ భాద్రపదాల కుంభవృష్టి మంగళోత్సవానికి పుష్పవృష్టి; శ్మశానపు నిస్తబ్దత; ఉద్యానవన విహంగ కలకూజితాలు. వారు తలచుకుంటే సమాజాన్నీ, జాతిని మేల్కొలపగలరు. దేశ గౌరవం నిలబెట్టగలరు. దేశానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టగలరు. పెద్ద పెద్ద సామ్రాజ్యాల్ని తలక్రిందులు చేసెయ్యగలరు. పతిత జనోద్ధరణ, ప్రపంచాన్ని మరమ్మత్తు చేసే సూత్రమూ వారి చేతుల్లోనే వుంది. ఈ విశ్వనాటక రంగస్థలం మీద ఆరితేరిన నటులువారు.

దేశంకోసం రక్తతర్పణ యువకులు తప్ప వేరెవ్వరు చెయ్యగలరు? మీకు ఆత్మబలిదానం చేసేవారు కావాలా? యువకుల దగ్గరకి వెళ్ళండి. ప్రతిజాతి భాగ్యవిధాతలు యువకులే. వారిని గురించి ఓ పాశ్చాత్య పండితుడు చాలా చక్కగానే చెప్పాడు.

“It is established truism that young men of today are countrymen of tomorrow holding in their hands the high destinies of the land. They are the seeds that spring and bear fruits”.

(నేటి యువకులే రేపటి దేశ భాగ్యనిర్ణేతలు. భవిష్యత్తులో విజయ సాధనా ఫలాలు అందించే బీజాలు వారే)

ప్రపంచ చరిత్ర పేజీలను తెరచి చూడండి. యువకుల రక్తంతో రచింపబడిన అమర సందేశాలు కోకొల్లలుగా కనిపిస్తాయి. ప్రపంచ విప్లవాలనూ, పరివర్తనలనూ క్షుణ్ణంగా పరిశీలించండి. వాటిలో మీకు పాగల్ ఛోకరే (పిచ్చి సన్నాసులు), పదభ్రష్ట్ (త్రోవ తప్పినవారు) అంటూ తెలివిగలవారు ముద్రవేసిన యువకులే మీకు దర్శనమిస్తారు. స్వదేశాభిమానంతో ఉన్మత్తులై తమ శవాలతోనే కోట కందకాలను నింపివేసే జపానీ యువకుల శరీరాలు ఏ ఉక్కుతో తయారయ్యాయో ఆ తెలివిగలవాళ్ళ కేమయినా తెలుస్తుందా? నిఖార్సయిన యువకుడు వెనుకాముందూ చూడకుండా చావుని ఆలింగనం చేసుకుంటాడు. ఛాతినీ తెరచి వాడిగల సన్నీల ఎదుట నిలబడతాడు. మరఫిరంగి ముఖద్వారం మీద కూచొని ముసి ముసినవ్వులు నవ్వుతాడు. చేతులకు వేసిన బేడీల లయతో జాతీయగీతాలు ఆలపిస్తాడు. ఉరికంబం మీదికి అట్టహాసం చేస్తూ ఎక్కి నిలుచుంటాడు. కేవలం యువకుని బరువు మాత్రమే ఉరితీసే రోజున పెరుగుతుంది. జైలు తిరగలి విసురుతూ యువకుడు ప్రబోధం చేస్తాడు. తాను కండెమ్డ్ సెల్ చీకటి గదిలో మగ్గుతూనే స్వదేశాన్ని చీకట్లోంచి తప్పించేందుకు ప్రయత్నిస్తాడు. అమెరికన్ యువనాయకుడు పేట్రిక్ హెన్రీ ఉద్వేగభరితమయిన కంఠంతో ఇలా అన్నాడు.

“Life is dear outside the prison walls but it is immeasurably dearer within the prison-cells, where it is the price paid for the freedom's fight”. (జైలు గోడల వెలుపల జీవితం చాలా ప్రియమైనది. అంతకన్నా ప్రియమైనది జైలుగోడల మధ్య జీవితం. కారణం – అక్కడ స్వాతంత్ర్య పోరాటపు మూల్యాన్ని మనం చెల్లించాల్సి వుంటుంది.)

అందుకే ఓ నాయకుడు అమెరికన్ యువతని ఉద్దేశించి యిలా ఉద్బోధించాడు :

“We believe that when a government becomes destructive of the natural right of man it is the man's duty to destroy that government”. (ప్రకృతి సహజమైన హక్కుని కాలరాసే ప్రభుత్వాన్ని తుదముట్టించడం మనిషి కర్తవ్యమని, అమెరికన్ యువత విశ్వసిస్తోంది.)

ఓ భారతీయ యువకుడా! ఆదమరచి ఏవిటా మొద్దు నిద్ర. లే! కళ్ళుతెరచి చూడు. ఎదురుగా తూర్పుదిక్కు ఎలా సింధూరం పులుముకుందో! ఇహ ఎక్కువసేపు నిద్రపోకు. నిద్రపోదలచుకున్నావా, శాశ్వత నిద్రలోకి వెళ్ళిపో. అంతేగాని కాలపురుషుని ఒడిలో నిద్రపోతావేం? మాయ, మోహం, మమకారం–అన్నీ విడచి గర్జించు యిలా:

Farewell farewell! my true love.
The army is on move;
And if I stayed with you Love,
A coward I shall prove.

(వీడ్కోలు వీడ్కోలు నా ప్రియా! సాగుతోంది సైన్యం ముందుకు. నీతోనే నేను ఉండిపోతే పిరికిపందగా ముద్ర పడితుంది.)

నీ మాత, నీ ప్రాతఃస్మరణీయ, నీ పరమవందనీయ, నీ జగదాంబ, నీ అన్నపూర్ణ, నీ త్రిశూలధారిణి, నీ సింహవాహిని, నీ సస్యశ్యామల, నేడు గోడు గోడున విలపిస్తోంది. కలత చెందిన ఆమె మనసు నిన్ను ఏ మాత్రమూ కలచివేయడం లేదా? ఛీ! ఏవిటీ ఈ నిర్వీర్యత. నీ నపుంసకత్వం. నిన్ను చూసి సిగ్గుతో నీ పితృదేవతలే శిరస్సు వంచుకుంటున్నారు. నీలో ఏ మాత్రమయినా సిగ్గూ శరమూ మిగిలి వుంటే, లే! లేచి నువ్వు తాగిన నీ తల్లిరొమ్ముల పాల గౌరవం కాపాడు. ఆమెని ఉద్ధరించడానికి నడుం బిగించు. ఆమె కారుస్తున్న ఒక్కొక్క కన్నీటి బొట్టు మీద ఒట్టు పెట్టి, ఆమె కష్టాలను తొలగించు, ఆపై ‘వందేమాతరం!’ అంటూ ముక్తకంఠంతో నినదించు. – జనసాహితి ప్రచురణ **“మా నెత్తురు వృధాకాదు”** నుండి ✺

# నవ్య ప్రింటర్స్ ఆర్కే ఆర్‌కు జోహార్లు



**ఆర్కేఆర్‌గా** సుపరిచితులైన ఎ. రామకృష్ణారెడ్డి నరాల సంబంధిత వ్యాధితో తన 62వ యేట 16 ఫిబ్రవరి 2024న హైదరాబాద్‌లో మరణించారు. ఆయన మాచర్లలో జన్మించారు.

హైదరాబాద్ మారేడుపల్లిలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రింటింగ్ టెక్నాలజీ కాలేజీలో ప్రింటింగ్ టెక్నాలజీ కోర్సు చేశారు. చదువుకునే రోజుల్లో విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. ఆ సమయంలో సహవిద్యార్థి, విద్యార్థి ఉద్యమ సహచరి అయిన పిఒడబ్ల్యు సంధ్యను ప్రేమించారు. వారిరువురూ 1991 జనవరి 26న వివాహం చేసుకున్నారు. 1991లో నవ్య ప్రింటర్స్‌ను స్థాపించారు. అంతకుముందు ముద్రణారంగంలో పనిచేస్తూ ప్రెస్ వర్కర్స్ యూనియన్‌ని పెట్టినందుకు ఆయనను ఉద్యోగం నుండి తొలగించారు. కార్మికరంగంలో పనిచేస్తూనే ఆయన కవిగా చిత్రకారుడుగా కృషిచేశారు. కమ్యూనిస్టు ఉద్యమ నేపథ్యం వున్న కుటుంబం నుండి వచ్చిన రామకృష్ణ మితభాషి, సహృదయుడు, ఉన్నత విలువలు కలవాడు. ఆయన చనిపోయేంతవరకు సమసమాజం కోసం కృషిచేస్తున్న సంస్థలకు, వ్యక్తులకు సహాయ సహకారాలందించారు. రాజ్య నిర్బంధాలను ఎదుర్కొంటూ దృఢంగా తన నమ్మిన ఆశయాల కోసం నిలబడ్డ ఆర్కేఆర్‌కు ‘ప్రజాసాహితి’ సంతాపాన్ని ప్రకటిస్తుంది. సంధ్యకు కుటుంబ సభ్యులకు సహానుభూతి తెలియచేస్తుంది. ✺

కరపత్రం

# మహిళల హక్కులను కాలరాస్తూ, దాడులను, హింసను ప్రేరేపిస్తున్న మతతత్త్వ రాజకీయాలకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం!

## అంతర్జాతీయ మహిళా పోరాటదినం 'మార్చి 8' స్ఫూర్తిని స్వీకరిద్దాం పితృస్వామిక పీడన, అణచివేతలకు వ్యతిరేకంగా సంఘటిత ఉద్యమాలను నిర్మిద్దాం!

*మిత్రులారా!*

మహిళల హక్కుల సాధనకు, పోరాటాలకు చిహ్నంగా **'మార్చి 8'**ని పాటించాలని 1910లో కోపెన్‌హాగన్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు మహాసభలో ప్రముఖ సోషలిస్టు నాయకురాలు క్లారా జట్కిన్ ప్రతిపాదించారు. నాటినుండి 'అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాట దినం' **'మార్చి 8'**ని ప్రపంచవ్యాప్తంగా శ్రామిక మహిళలు పోరాటాలకు సంకేతంగా, స్ఫూర్తిదాయకమైనదిగా స్వీకరించారు. అమెరికాలోని మహిళా కార్మికులు తమ వేతనాల పెంపుదల కోసం, పని పరిస్థితుల్లో మెరుగుదల కోసం, పనిగంటల తగ్గింపు కోసం, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా సాగించిన నిరంతర పోరాటాలే కా॥ క్లారా జట్కిన్ చేసిన ప్రతిపాదనకు పునాది. నిర్వివాదంగా **'మార్చి 8'** శ్రామిక మహిళా పోరాటాలకు సంకేతం. కానీ పాలక వర్గాలు శ్రామిక మహిళా పోరాటాలకు సంకేతంగా నిలిచిన **'మార్చి 8'** స్ఫూర్తిని అపహాస్యం చేస్తూ దీనిని ఫ్యాషన్ షోలకు, వంటల పోటీలకు, ముగ్గుల పోటీలకు, ఇతర అత్యల్ప విషయాలకు పరిమితం చేయాలనుకుంటున్నాయి. నేడున్న ఈ దోపిడీ వ్యవస్థలో వివిధ అండదండలతో అత్యున్నత స్థానాలకు చేరుకున్న కొద్దిమంది మహిళలను విజేతలుగా ప్రస్తావిస్తూ, అదే మహిళల అభివృద్ధిగా, సాధికారతగా మభ్యపెట్ట జూస్తున్నాయి. వీరి కుట్రలను బట్టబయలు చేస్తూ శ్రామిక మహిళలు, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న అభ్యుదయ, ప్రగతిశీల సంస్థలు **'మార్చి 8'** మహిళా పోరాటాలకు స్ఫూర్తిదాయక మైనదిగా ఎలుగెత్తి చాటుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా నేడు పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉంది. అది యుద్ధాలకు కారణమౌతోంది. సామ్రాజ్యవాద దేశాలు ఈ సంక్షోభ భారాన్ని 3వ ప్రపంచ దేశాలపై మోపుతూ ఆయా దేశాల ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఉపాధిలేమి వంటి ప్రధాన సమస్యలకు కారణాలుగా ఉన్నాయి. అంతేకాక వివిధ దేశాల మధ్య, ప్రాంతాల మధ్య, తెగల మధ్య, జాతుల మధ్య, మతాల మధ్య విద్వేషాలను వ్యాప్తి చేస్తూ వాటి మధ్య నిరంతరం అలజడులకు, అశాంతికి కారణమవుతున్నాయి. ఏ యుద్ధపరిణామాలలోనైనా అంతిమంగా మహిళలు తీవ్ర బాధితులుగా మిగులుతున్నారు. లైంగిక దాడులకు గురై, కుటుంబ సభ్యులను కోల్పోయి, ఆస్తులు కోల్పోయి, ఇళ్ళు కోల్పోయి, ఉపాధి కోల్పోయి జీవచ్ఛవాలుగా శరణార్థి శిబిరాల్లో తలదాచుకోవాల్సిన స్థితి సామ్రాజ్యవాద ప్రేరేపిత యుద్ధాల వల్ల మహిళలకు ఏర్పడుతోంది. ప్రస్తుతం సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోనూ, ఇజ్రాయిల్ - పాలస్తీనా యుద్ధంలోను మహిళలు ఇటువంటి దుస్థితినే ఎదుర్కొంటున్నారు. గత 5 నెలలుగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడులతో గాజా అట్టుడికిపోతున్నది. పాలస్తీనా జాతిని అంతమొందించటానికి పాలస్తీనా మహిళల పైన, పిల్లల పైన యుద్ధాన్ని ప్రకటించి మరీ దారుణ మారణకాండను ఇజ్రాయిల్ కొనసాగిస్తున్నది. పాలస్తీనా మృతుల్లో 67 శాతం స్త్రీలు, పిల్లలే ఉన్నారు. బాలింతల స్థితి మరింత దయనీయంగా ఉంది. అప్పుడే పుట్టిన బిడ్డని రక్షించుకోలేని స్థితిలో, తమ చేతుల్లోనే బిడ్డల ప్రాణాలు పోతుంటే ఏమీ చేయలేని అత్యంత నిస్సహాయమైన, దయనీయమైన స్థితిలో వారున్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదం యుద్ధోన్మాదంతో ఇజ్రాయిల్ ద్వారా పాలస్తీనాపై సాగిస్తున్న నరహంతక దాడులు ఇవి. యావత్ప్రపంచం ఈ దాడులను నిరసిస్తున్నది. పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలంటూ కోట్లాది మంది అనేక రూపాల్లో తమ నిరసనను తెలియజేస్తున్నారు.

సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను నెరవేర్చే విధానాలనే మన పాలకులు నిరంతరం అనుసరిస్తూ వస్తున్నారు. మహిళలను గౌరవించాలని ప్రకటిస్తూనే వారిని అడుగడుగునా తీవ్ర అవమానాలకు గురిచేస్తున్నారు. దేశంలో మహిళలపై హింసకు సంబంధించి గంటకు 51 పోలీసు కేసులు నమోదవుతున్నాయి. నమోదుకాని వాటి సంఖ్య ఇంకా అధికంగా ఉంటుందనటంలో సందేహం లేదు. మతతత్వ బిజెపి పాలిత రాష్ట్రాలో ఇది మరీ తీవ్రంగా ఉంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మహిళలపై, ప్రత్యేకించి దళిత మహిళలపై హింసలో, అత్యాచారాల్లో గత కొన్ని సంవత్సరాలుగా మొదటిస్థానంలో నిలుస్తూ వస్తోంది. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, చెప్పరాని అకృత్యాలకు పాల్పడి సామూహిక అత్యాచారం చేసి చంపేసిన ఘటన తాలూకు వీడియో వైరల్ అయి, దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. అయినప్పటికీ, బిజెపి డబల్ ఇంజన్ పాలకుల్లో ఏ స్పందనా లేదు. ఆ కేసు ఏమైందో, విచారణ ఏ స్థాయిలో ఉందో అతీగతీ లేదు. ఇంకా వందలమందిని మహిళలతో సహా నడిరోడ్డుపైనే కాల్చేశారు. అనేకమందిపై అత్యాచారాలు చేశారు.

గృహదహనాలు, లూటీలకు లెక్కేలేదు. ఈ నాటికీ ఆ ఘర్షణలు చల్లారనే లేదు. వందలాదిమంది మహిళలు శరణార్ధి శిబిరాల్లో ఆస్తులను, ఆప్తులను కోల్పోయి బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. బిజెపి పాలకుల కనుసన్నలలోనే ఈ దాడులన్నీ జరిగాయన్నది గమనార్హం. మణిపూర్ కొండలలోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టటం కోసమే అక్కడి తెగల మధ్య ఆరని చిచ్చు రగిల్చారు. ఈ విధంగా మన కేంద్ర పాలకులు హంతక దాడులు చేస్తూ, పార్లమెంటు కొత్త భవనాన్ని, అయోధ్యలో రామాలయాన్ని నిర్మించి తమ ప్రభుత్వ ఘనతగా చాటుకుంటున్నారు.

నిరుద్యోగం, ఉపాధి లేమి, అధిక ధరలు వంటి అనేక సమస్యలతో ప్రజలు సతమతమౌతున్నా, 75 సం॥ల స్వాతంత్ర్య అమృత మహోత్సవాలంటూ ఆర్భాటంగా ఉత్సవాలు చేశారు. ఈ సందర్భంగా గుజరాత్ అల్లర్లలో ముస్లిం మహిళ అయిన బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం చేసిన హిందూ మతతత్వ మూకలకు చెందిన దోషులను సత్ప్రవర్తన కలిగి ఉన్నారంటూ జైలు నుండి విడుదల చేశారు. అంతేకాక ఆ దోషులను స్వాగత సత్కారాలతో ముంచెత్తారు. సంబరాలు చేసుకున్నారు. తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపిని శిక్షించాలని ఆందోళన చేసిన మహిళా రెజ్లర్లను ఢిల్లీ నడివీధుల్లో ఈడ్చిపారేశారు. తాము అధికారంలో ఉన్న కారణంగా ఏ చట్టాలు తమను ఏమీ చేయలేవనే ధీమాతో మైనారిటీ మతాలపై, దళితులపై, మహిళలపై అనేక అకృత్యాలకు పాల్పడుతున్నారు బిజెపి మతతత్వ పాలకులు. తమను ధిక్కరిస్తున్నారనే కక్షతో అత్యల్ప విషయాలను కూడా సాకులుగా చూపించి దళితులపై హత్యాకాండను కొనసాగిస్తున్నారు. 'బేటీ బచావో–బేటీ పడావో' అంటూ ఒకవైపు ఆర్భాటపు ప్రకటనలు చేస్తూ, ఆచరణలో స్త్రీలను దాసీలుగా, భోగవిలాస వస్తువులుగా పరిగణించే దోపిడీ విషసంస్కృతినే వ్యాప్తి చేస్తున్నారు.

నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగంలో బిజెపి పాలకులు తీసుకువచ్చిన సంస్కరణలు మహిళలకు ఉన్నత విద్యను మరింత దూరం చేస్తున్నాయి. అనేక ఇబ్బందులను అధిగమించి డిగ్రీలు, పీజీలు పూర్తి చేసినా ఉద్యోగ అవకాశాలు లేక అత్యల్ప వేతనాలకే వారు అసంఘటిత రంగంలోకి విసిరివేయ బడుతున్నారు. సంక్షేమ హాస్టళ్ళలో భద్రత ప్రశార్థకమౌతోంది. విద్యార్థినుల పట్ల అవి మృత్యుకుహరాలుగా మారుతున్నాయి. ఎంత ఉన్నత చదువులు చదివినా పితృస్వామిక పీడన, అణచివేత మహిళలకు తప్పటంలేదు. ఇళ్ళల్లో, ఆఫీసుల్లో, ఇతర పనిస్థలాల్లో నిత్యం అవమానాలకు, వేధింపులకు గురవుతున్నారు. తమ జీవనభృతిని కోల్పోతామేమోనన్న భయంతో, నలుగురిలో నవ్వుల పాలౌతామన్న భయంతో చాలామంది మహిళలు మౌనంగా వీటిని భరిస్తున్నారు. వేధింపులను ప్రశ్నించినవారు, ఎదిరించినవారు కక్ష సాధింపు చర్యలకు గురవుతున్నారు. సోషల్ మీడియాలో తీవ్ర అసభ్యకర, అవమానకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

తెలుగు రాష్ట్రాలలో వివిధ పెన్షన్లు, అమ్మఒడి, విద్యాదీవెన అంటూ మహిళలకు ఎన్నో పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్నప్పటికీ, ఈ పథకాలు మహిళలు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ఏమాత్రం ఉపయోగపడేవిగా లేవు సరికదా, వాటి కొరకు చేయాల్సిన సాంకేతికమైన పనులు వారి సమయాన్ని, శ్రమను వృథా చేసి నష్టపరుస్తున్నాయి. అసంఘటిత రంగంలో మహిళల శ్రమను తీవ్రంగా దోపిడీ చేస్తున్నారు. ఎక్కువ వేగంగా, కేంద్రీకరించి పనిచేయగల వయసులోని పెళ్ళికాని యువతుల శ్రమనే ఎంచుకుని కార్పొరేట్ శక్తులు తమ దోపిడీని కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వాలు టార్గెట్లు పెట్టి మరీ అమలు చేస్తున్న మద్యం విధానం కష్టజీవి కుటుంబాల ఆదాయాలను కొల్లగొట్టడంతోపాటు కుటుంబాలలో నిరంతర అశాంతికి, మహిళలపై హింసకు కారణమవుతోంది. మద్యం ప్రధాన కారణంగా హత్యలు, ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాద మరణాలు సంభవిస్తుంటే; వ్యవసాయరంగ సంక్షోభ ఫలితంగా పేద, మధ్యతరగతి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఆయా కుటుంబాల భారాన్ని కష్టజీవి మహిళలే ఒంటరిగా మోయవలసి వస్తున్నది. ప్రభుత్వాలు ప్రకటిస్తున్న ప్రజాకర్షక పథకాలు ఏవీ కూడా కుటుంబ భారం మోస్తున్న మహిళల కష్టాలను ఏమాత్రం తీర్చలేకపోతున్నాయి.

దేశంలో అన్ని రంగాలలో తీవ్రమౌతున్న సంక్షోభం నేపథ్యంలో మహిళల జీవనం మరింత కష్టాలమయం అవుతోంది. పేదరికం, ఉపాధిలేమి వంటి సమస్యలతో పాటు పితృస్వామిక అణచివేత, పెరుగుతున్న సాంస్కృతిక విధ్వంసం వారికి ఎక్కడా రక్షణ లేకుండా చేస్తోంది. టీవీలు, సినిమాలు, ఇంటర్నెట్‌ల ద్వారా వెదజల్లబడుతున్న హింస, సాంస్కృతిక కాలుష్యం యువతీ యువకులపై తీవ్రప్రభావాన్ని చూపుతున్నాయి. స్కూలు పిల్లలతో సహా మద్యం, మత్తు పదార్థాల విచ్చలవిడి లభ్యత కూడా వీటికి తోడై యువకులను నేరాలకు పురిగొల్పుతున్నాయి. మహిళలపై దాడులకు ప్రేరేపిస్తున్నాయి. వీటిని సరిచేసే ఉద్దేశ్యమేదీ పాలకులకు లేదు సరికదా, వారే వాటిని పనికట్టుకుని పెంచి పోషిస్తున్నారు. పాలకుల ఈ విధానాలు మహిళలకు వ్యతిరేకమైనవని, హానికరమైనవి. హక్కులను కాలరాచేవి.

అన్ని రంగాలలోనూ పాలకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద విధానాలు ప్రజలను మరింత దారిద్ర్యంలోకి, అభద్రతలోకి నెట్టివేస్తున్నాయి. తమ తమ ఊర్ల నుండి, నివాసాల నుండి గెంటివేస్తున్నాయి. ఈ విధంగా విస్తాపనకు గురైన దళిత, గిరిజన మహిళల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అందుకే ప్రజ లెదుర్కొంటున్న ఈ సమస్య లన్నింటి నుండి దృష్టి మళ్ళించటానికి పాలకులు కుల, మత, ప్రాంత విద్వేషాలను పనిగట్టుకుని వ్యాప్తి చేస్తున్నారు. మతతత్వ రాజకీయాలను ఒక ఎజెండాగా ముందుకు తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తూ ప్రజలను విభజిస్తున్నారు. ఈ నేపథ్యంలో **అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దిన స్ఫూర్తితో మహిళా హక్కులను కాలరాస్తూ, వారిపై దాడులను, హింసను ప్రేరేపిస్తున్న మతతత్వ రాజకీయాలకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదామని ప్రతినబూనుదాం.**

– స్త్రీ విముక్తి సంఘటన ✺

వార్తాసాహితి

## ప్రముఖ అభ్యుదయ ఉర్దూ కవి గుల్జార్‌కు జ్ఞానపీఠ పురస్కారం

ఆయన అసలు పేరు సంపూర్ణసింగ్ కల్రా. 1936 అగస్టు 18న ప్రస్తుతం పాకిస్తాన్‌లోని జీలమ్ జిల్లా దీనా గ్రామంలో జన్మించారు. తన 89వ యేట 2023 జ్ఞానపీఠ పురస్కారం అందుకున్నారు. గుల్జార్ ఆయన కలంపేరు 'వర్ధిల్లుట, వికసించుట' అని దాని అర్థం.

దేశ విభజన ఫలితంగా వారి కుటుంబం ఢిల్లీ చేరగా, 1950లో గుల్జార్ ఉపాధి కోసం బొంబాయి చేరి అక్కడ ఒక మోటర్ గ్యారేజీలో రంగు పోయిన కార్లకు రంగు వేయడంలో నైపుణ్యం సాధించారు. స్వయంకృషితో సాహిత్యం అధ్యయనం చేశారు. రవీంద్రనాథ్ టాగోర్ కవితలను హిందీ అనువాదంలో చదివి వాటి వల్ల ప్రభావితమయ్యారు. బెంగాలీ మూలంలో వాటిని చదవాలనే కోర్కెతో ఆ తర్వాత కాలంలో బెంగాలీ నేర్చుకున్నారు. సాహిత్యంలో తన గురువు టాగోర్ అని చెప్తారు.

బొంబాయిలో అభ్యుదయ రచయితల సంఘానికి చెందిన రచయితలతో, ప్రజానాట్యమండలి (IPTA) నటులతో ఆదివారాలు జరిగే సమావేశాలలో ఏర్పడిన సాన్నిహిత్యంతో కవితలు రాశారు. సినిమా రంగంలో ప్రవేశించి ఎన్నో గేయాలు రచించారు. ఆయన పాటలు రాసిన మొదటి సినిమా 'బందిని' 1963లో విడుదలైంది. అత్యధికులు ఆయనను సినిమా గేయ రచయితగానే పరిగణిస్తారు.

కాని ఆయనకు ఉర్దూ కవిత్వంలో విశిష్ట స్థానం వుంది. ఐదు కవితా సంపుటాలు, రెండు కథా సంపుటాలు, 17 బాలల పుస్తకాలు, ఆరు స్క్రీన్‌ప్లేలు రచించి ప్రచురించారు. దేశ విభజనపై కవితలేగాక "ఇద్దరు" (Two) అనే నవల ఉర్దూలో రాశారు. 14 కథలు కూడా దేశ విభజనపై రాశారు. 2002లో సాహిత్య అకాడమీ బహుమతి, 2004లో పద్మభూషణ్ పురస్కారం, సినిమారంగపు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు 2013లో ఆయన అందుకున్నారు. 2013 ఏప్రిల్‌లో అస్సాం విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు.

విశ్వంలో అతి చిన్న గ్రహం 'ప్లూటో' అనే శీర్షికతో లఘు కవితల పుస్తకం ప్రచురించారు. వాటికి బొగ్గుతో బొమ్మలు తానే వేశారు. మచ్చుకి ఒక కవిత.

"నేత్రాలకు వీసాలక్కర్లేదు / కలలకు సరిహద్దులు లేవు / రోజూ కళ్ళను మూసుకుని / సరిహద్దులు దాటి వెళ్తుంటాను / మెహదీహసన్‌ను కలుసుకోడానికి"

(మెహదీ హసన్ ప్రముఖ పాకిస్తానీ గజల్ గాయకుడు, నేపథ్య గాయకుడు – 13 జూన్ 2012లో మరణించాడు)

- ★ విజయవాడలో 34వ పుస్తక ఉత్సవం డిశంబరు 28 నుండి జనవరి 7 వరకూ జరిగింది.
- ★ హైదరాబాదులో 36వ జాతీయ పుస్తక ప్రదర్శన ఫిబ్రవరి 9 నుండి 19 వరకు జరిగింది. గద్దర్ వేదికపై అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు రచయితలు, కళాకారులు, సామాజిక కార్యకర్తలచే పుస్తక ప్రదర్శన ప్రాముఖ్యతపై వీడియోలు తయారుచేసి ప్రచారం చేశారు.
- ★ ఫిబ్రవరి 11, 12 తేదీలలో 32వ జాతీయ నాస్తికమేళా చార్వాకాశ్రమంలో జరిగింది. ఈ నాస్తికమేళాకు తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, మహారాష్ట్ర, జైపూర్, ఢిల్లీ, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరయ్యారు.
- ★ ఫిబ్రవరి 15, 16, 17 తేదీలలో హైదరాబాదు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యాన, ఆర్ట్స్ కళాశాలలోని 133వ నంబరు గదిలో తెలుగు లిటరరీ కాంగ్రెసు (తెలుగు సాహిత్య మహాసభ)ను ఆ శాఖాధిపతి కాశీం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల రచయితలు, గాయకులు 149 మంది వక్తలుగా, 250 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

## ప్రసిద్ధ ఆర్థికశాస్త్రవేత్త, దళిత మేధావి డా॥ ఎమ్. కున్హమన్ మరణం

ఆచార్య కున్హమన్, తిరువనంతపురంలో తన ఇంట్లో 74వ పుట్టినరోజైన 3-12-2023న మరణించారు. ఆయన 1949లో పలక్కాడ్ జిల్లాలో జన్మించారు. అక్కడే ప్రభుత్వ విక్టోరియా కళాశాలలో ఆర్థికశాస్త్రంలో ప్రథమశ్రేణిలో ఎం.ఏ.లో ఉత్తీర్ణులయ్యారు. ఆ తర్వాత ఎం.ఫిల్, పిహెచ్‌డిలు సాధించారు. కేరళ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా 1979 నుండి 2006 వరకు పనిచేశారు. ఆ తర్వాత తుల్జాపూర్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో తొమ్మిదేళ్ళు బోధించారు.

2020లో ప్రచురించిన ఆయన స్వీయచరిత్రలో స్వాతంత్ర్య పూర్వపు కేరళలో దళితుల జీవితాన్ని చిత్రించారు. తాను జీవితాంతం కుల వివక్షనూ, అణచివేతను అనుభవించిన వైనాన్ని వివరించారు. 'దళిత ఆర్థిక విధాన అభివృద్ధి', 'భారతదేశంలో రాష్ట్రస్థాయి ప్లానింగ్', 'గ్లోబలైజేషన్ : ఒక ఉపశ్రేణి దృక్పథం' అనే గ్రంథాలు, ఎన్నో వ్యాసాలూ రాశారు. కేరళ సాహిత్య అకాడమీ 2021లో ఆయన స్వీయచరిత్రకు ఇచ్చిన పురస్కారాన్ని తిరస్కరిస్తూ 'నేను నా సంతృప్తికై రాసాను కాని పురస్కారం కోసం కాదని' ప్రకటించారు.

## ఆర్‌ఆర్‌బీ టెక్నీషియన్ రిక్రూట్‌మెంట్..9000 పోస్టులు

నిరుద్యోగులకు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు శుభవార్తను అందించింది. తొమ్మిదివేల టెక్నీషియన్ పోస్టులకు పట్నారైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా టెక్నీషియన్ గ్రేడ్ – I సిగ్నల్, టెక్నీషియన్ గ్రేడ్ – III పోస్టులను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు భర్తీ చేయనుంది. టెక్నీషియన్ పోస్టులకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ వచ్చే నెల 9 నుంచి ప్రారంభం కానుంది. ఈ పోస్టులకు అప్లయ్ చేసుకునేందుకు చివరి తేది ఏప్రిల్ 8గా నిర్ణయించడమైనది. ఈ క్రమంలో రిక్రూట్‌మెంట్ షెడ్యూల్‌ను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు తాజాగా ప్రకటించింది. పూర్తివివరాల కోసం అభ్యర్థులు https://indianrailways.gov.in లేదా https://www.rrbpatna.gov.in వెబ్‌సైట్‌లను సంప్రదించగలరు.

# 'పగిడీ సంభాళో' అనే ప్రసిద్ధ పంజాబీ గీతం చరిత్ర

పంజాబ్ సిక్కు రైతులలో బహుళ ప్రచారంలో వున్న ఈ గీతంలో 'పగిడీ' అంటే వారు. సంప్రదాయసిద్ధంగా ధరించే తలపాగా. 'సంభాళో' అంటే 'జాగ్రత్తగా వుంచుకో!' అని. తలపాగా వ్యక్తి గౌరవం, ప్రతిష్టకు సంబంధించిన విషయం. రాజుకు కిరీటం లాంటిదే, రైతుకు తలపాగా! ఒక ధిక్కార చిహ్నంగా గురుగోవిందసింగ్ దీనిని ధరించడం అనే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టాడు. తలపాగా సాధారణ రైతు (మానవుడి) గౌరవానికి, ప్రతిష్టకు చిహ్నం.

ఈ గీతం - 1907 నాటి 'పగిడీ సంభాళ్ జాతో' ఉద్యమంలో పుట్టింది. ఆ ఉద్యమం కూడా ఆనాడు బ్రిటీషు ప్రభుత్వం చేసిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగి విజయం సాధించింది. దీనికి నాయకత్వం వహించినవాడు భగత్‌సింగ్ బాబాయి అజిత్‌సింగ్. ఆ చట్టాలు 1. పంజాబ్ భూమి పరాయీకరణ చట్టం (1900); 2. పంజాబ్ భూమి వలసీకరణ చట్టం (1906); 3. డోబ్ బారీ చట్టం (1907). ఈ చట్టాలు రైతులను భూ యజమానుల స్థానం నుండి కాంట్రాక్టర్ల స్థాయికి దిగజారుస్తాయి. రైతులకు కేటాయించిన భూమిలో, ప్రభుత్వ అనుమతి లేకుండా దానిలో వున్న చెట్లను అంటుకుంటే చాలు, ఆ భూమిని ప్రభుత్వం కైవసం చేసుకుంటుంది. 1879లో ఎగువ బారిడోబ్ కాలువ ద్వారా చీనాబ్ నది నుండి నీళ్ళు లైల్‌పూర్ (ఇప్పుడు ఫైసలాబాద్ - పాకిస్తాన్)కు ఇచ్చి అక్కడి భూములను రైతులకు కేటాయించి, ఆ భూముల యాజమాన్యం ప్రభుత్వం తన వద్దే వుంచుకున్న సందర్భంగానూ, ఆ భూముల్లో ఇళ్ళు కట్టుకోవడాన్నీ, చెట్లను నరకడాన్నీ నిషేధించిన సందర్భంగాను, ఒక ఇంటిలో వయోజనుడు కాని పెద్ద కొడుకు మరణిస్తే, ఆస్తి చిన్న కొడుకుకు రాకుండా ప్రభుత్వానికి చెందుతుందని చట్టాలు చేసిన సందర్భంగాను వెల్లువెత్తిన ఉద్యమమే 'పగిడీ సంభాళో జాతో' ఉద్యమం.

ఈ ఉద్యమానికి ప్రేరణగా 'జంగ్ సయాల్' అనే దినపత్రిక సంపాదకుడు బంకే దయాళ్ 3 మార్చి 1907లో ఉద్యమగీతం రాసి, లైల్‌పూర్ ప్రదర్శనలో గానం చేశాడు. ఉద్యమం ప్రారంభం కాగానే బ్రిటీషు ప్రభుత్వం కొన్ని సవరణలకు అంగీకరించింది కాని ఉద్యమకారులు మొత్తం మూడు చట్టాలు రద్దు కావాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఒక బహిరంగ సభలో లాలాలజపత్‌రాయ్ ఉత్తేజకరమైన ఉపన్యాసం ఇచ్చాడు. రావల్పిండి, గుజ్రన్‌వాలా, లాహోర్ మొదలగుచోట్ల బ్రిటిష్ అధికారులను ఉద్యమకారులు దేహశుద్ధి చేశారు. వారిపై బురద వెదజల్లారు. అధికార కార్యాలయాలు, చర్చీలు తగులబెట్టారు. టెలిగ్రాఫ్ స్థంబాలు, వైర్లు ధ్వంసం చేశారు. ముల్తాన్ డివిజన్లో రైల్వే కార్మికులు సమ్మె చేశారు. లాహోర్‌లో ఫిలిప్స్ అనే పోలీసు అధికారిని కొట్టారు. బ్రిటిష్ ఉద్యోగులు తమ కుటుంబాలను బొంబాయికి పంపేసారు. అక్కడ నుండి ఇంగ్లండ్ వెళ్ళడానికి ఓడలను ఏర్పాటు చేసుకున్నారు.

అప్పటి రైతాంగ ఉద్యమం హింసాత్మకంగా సాగింది. ఈనాటి రైతాంగ ఉద్యమం అత్యంత అహింసాత్మకంగా సాగుతోంది. ప్రభుత్వమే ఈనాడు జల ఫిరంగులు పేల్చడం, రోడ్లపై మేకులు నాటడం, నిర్బంధాలు విధిస్తూ హింసాత్మకంగా ప్రవర్తిస్తోంది.

'పగిడీ సంభాళో' పాట హిందీ సినిమాలు 'షహీద్', 'ది లెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్'లో మార్పులతో వాడారు. రెండు రకాలుగా లభించిన ఈ పాట భావాన్ని క్రింద ఇస్తున్నాం.

"ఓ రైతు సోదరా! నీ ఆత్మగౌరవాన్ని నిలుపుకో! నీ తలపాగా
పడిపోకుండా చూసుకో! బానిసత్వపు సంకెళ్ళు త్రెంచుకో! నీ
భవిష్యత్తును తీర్చిదిద్దుకో! ఉన్నతస్థానంలోకి ఎదుగు! నిరాశకు
చోటివ్వకపోతే ఆకాశాన్ని కిందకు దింపవచ్చు! అప్పుడే అనుకున్న
వన్నీ సాధించవచ్చు! గాలిని బంధించవచ్చు! కాలాన్ని అదుపు చేయవచ్చు.
కష్టపడి పనిచేస్తేనే, నీ భవిష్యత్తు బంగారుమయమౌతుంది!
శత్రువులను తుడిచిపెడదామని వాగ్దానం చేద్దాం రా!"

"నీ పంటను పాడు చేస్తున్నాయి - చీడ పీడలు / కరువు కరాళ నృత్యం చేస్తోంది
కుటుంబమంతా వేదనతో నిండిపోయింది! నీ నాయకులు జమీందార్లు - ఖాన్
బహదూర్‌లు వలలు విసురుతున్నారు నిన్ను దోచుకోడానికి! ఇండియా నీ దేవాలయం!
ఎన్నాళ్ళు సోమరిగా వుంటావు? చావుకి తెగించి పోరాడు! నిర్బంధం ఎదుర్కో!
'రంఝా' 'హీర్'ను ప్రేమించినంతగా నీ దేశాన్ని ప్రేమించు! పిరికితనాన్ని పారద్రోలి
ధైర్యంగా, జాగ్రత్తగా, ఐక్యంగా సవాలును ఎదుర్కో! నీ ఆత్మగౌరవాన్ని నిలుపుకో!
(పంజాబీ ప్రేమకథలో ప్రేమజంట - రంఝా, హీర్‌లు)

(సంయుక్త కిసాన్ మోర్చా 2024 ఫిబ్రవరి 23న పగిడీ సంభాళ్ దివస్'గా ప్రకటించి,
ఆరోజు రైతులందరూ ఆకుపచ్చ తలపాగా ధరించే కార్యక్రమం చేసిన సందర్భంగా)

PRAJA SAAHITI March 2024 (TELUGU) Rs. 20/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2024-2026
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

పాట

# రైతు బిడ్డల యాతర.. పోరాటాల జాతర....

– శ్రీదేవి



**పల్లెలన్ని** పయనమయ్యే మా గొప్ప జాతరా
రైతన్న యాతర
గల్లీ నుండి ఢిల్లీ కొచ్చే మా గొప్ప జాతరా
రైతన్న యాతర
కన్నా తల్లి రుణమూ దీర్చ కదిలే బిడ్డల యాతర....
పల్లెలన్నీ.......బలే.. బలే....
రారా పోదాము రైతు బిడ్డల యాతర
పోదాం పదరా అది పోరాటాల జాతర

కల్లంలోని పంటానంత – కాజేసేటి ఎత్తూలతో
భూములన్ని చుట్టా చుట్టి – దోచి పెట్టే జిత్తూలతో
రైతన్నల కండాగున్న – మార్కెట్ యార్డులన్నీ తీసి
కంపెనీకి కట్టాబెట్టి – రైతునోట మట్టీగొట్టి
అంబానీల అదానీల బొక్కసాలు నింపూతుంటే.....
పల్లెలన్నీ......బలే... బలే.... ॥ రారా ॥

ఉప్పు పప్పు గ్యాసునూనె – కూరగాయ పండు ఫలము
ధరలూబెంచే ఒప్పందాలు – దగా చేసే దళారీలు
నీటి పంపు మీటర్లంటూ – నీటను ముంచె గారాడీలు
కార్పొరేటు సేద్యం తోటి – కాటికిబంపె పన్నాగాలు
రైతు మెడకు ఉరిని బెట్టి – సాగు పేర చావూదేచ్చే
చట్టాలింక చెల్లావంటూ......
పల్లెలన్నీ.....బలే.... బలే..... ॥ రారా ॥

బండి ఎనక బండి గట్టి – బారులు తీరి అన్నాలంతా
గిట్టుబాటు ధరల కొరకు – కట్టుగయ్యి కదులూతుంటే
మాయల మారి మోడీ ప్రభుత – బారీకేడ్లు బందూకులతో
దారులంట మోహరించి టియరు గ్యాసు నొదిలీపెట్టి
ముళ్ళకంచెలు మేకులు గొడితే – రక్తాలొడ్డిన రైతులంత
పోరాటాల పొలిమేరల్లో పోరు కేక పెట్టెనంట......
పల్లెలన్నీ......బలే.... బలే..... ॥ రారా ॥

మతం పేర మంటాబెట్టి – మారణకాండ సృష్టించేటి
నరారూప రాక్షసులు – దేశాన్నేలే పాలకులు
నేల నీరూ నింగీ గనులూ అడవిలోని గిరులు తరులు
విదేశాల దొంగలాకు దోచిపెట్టే దళారీలు
దళారీల అంతు దేల్చ దండుగట్టి కదులూతున్న
పల్లెలన్నీ....... బలే..... బలే......
రారా పోదాము రైతు బిడ్డల యాతర
పోదాం పదరా అది పోరాటాల జాతర

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI